అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

బుధవారం 27-3-2024

సంపుటి : 10 | సంచిక : 86 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

సీఏఏలో ముస్లిం మైనారిటీలు మినహాయింపు

- కేంద్రం విడుదల చేసిన నోటిఫికేషన్‌పై యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ ఆందోళన

న్యూయార్క్ : పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ) స్పష్టంగా ముస్లిం మైనారిటీలను మినహాయించిందని యూఎస్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రెలీజియస్ ఫ్రీడమ్ (యూఎస్‌సీఐఆర్‌ఎఫ్) పేర్కొంది. సీఏఏ అమలు కోసం కేంద్రం విడుదల చేసిన నిబంధనల నోటిఫికేషన్‌పై ఆందోళన వ్యక్తం చేసింది. మతం, విశ్వాసాల ఆధారంగా ఏ ఒక్కరి పౌరసత్వాన్ని తిరస్కరించకూడదని స్పష్టం చేసింది. యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ విదేశాలలో మతపరమైన స్వేచ్ఛను పర్యవేక్షించడానికి, విశ్లేషించడానికి, నివేదించడానికి అమెరికా కాంగ్రెస్ సభ్యులచే స్థాపించబడిన స్వతంత్ర, ద్వైపాక్షిక సమాఖ్య సంస్థ. వివాదాస్పద సీఏఏ పొరుగు దేశాల నుంచి పారిపోయి వచ్చిన శరణార్థులకు భారత్ మతపరంగా ...13లో



తీహార్ జైల్‌కు కవిత

- 14 రోజులు జ్యూడిషియల్ కస్టడీ
- ఏప్రిల్ 1న కవిత బెయిల్‌పై విచారణ
- ఢిల్లీ మద్యం కుంభకోణం నిందితులు బీజేపీలో చేరారు...
- కడిగిన ముత్యంలా బయటకు వస్తా: కవిత

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవితను తీహార్ జైలు తరలించారు. సీబీఐ స్పెషల్ కోర్టు 14 రోజులు జ్యూడిషియల్ కస్టడీ విధించింది. ఏప్రిల్ 9 వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం ఉదయం 10 గంటలకు ఈడీ కస్టడీలో ఉన్న కవితకు రోజువారి వైద్య పరీక్షలు ...3లో

ప్రధాని నివాసం ముట్టడికి ఆప్ యత్నం

- పలువురు నేతల అరెస్టు
- ఎక్కడికక్కడ ఆంక్షలు, బందోబస్తు ఏర్పాట్లు
- పోలీసు రాజ్యంగా మార్చేసారంటూ ఆప్ విమర్శలు

31న మెగా ర్యాలీ ఏర్పాటుకు సన్నాహాలు

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆప్ నేతలు, కార్యకర్తలు మంగళవారం వీధుల్లోకి వచ్చారు. 'ఇంక్విలాబ్ జిందాబాద్', 'కేజ్రీవాల్ జిందాబాద్' అని నినాదాలు చేసుకుంటూ లోక్ కల్యాణ్ మార్గ్‌లో గల ప్రధాని నరేంద్ర మోడీ నివాసం దిశగా ప్రదర్శనగా రావడానికి వారు ప్రయత్నించడంతో పటేల్ చౌక్ వద్ద వారిని నిలిపివేసి, పలువురిని అదుపులోకి ...3లో



అవినీతిని చట్టబద్ధం చేసిన మోడీ సర్కార్

భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

- బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించండి
- ఎలక్టోరల్ బాండ్స్‌లో అత్యధికం ఆ పార్టీ ఖాతాలోకే..
- భువనగిరిలో సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించండి : పార్లమెంటరీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపు



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-భువనగిరి

అవినీతిని వెలికితీస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్.. అవినీతికి చట్టబద్ధత కల్పించింది.. భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తోంది.. అలాంటి బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని.. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్న.. సీపీఐ(ఎం) అభ్యర్థిగా భువనగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న జహంగీర్‌ను గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. మంగళవారం భువనగిరి పట్టణంలో ఏఆర్ గార్డెన్‌లో ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన ...13లో

ఏం చూసి మోడీకి ఓటేయాలి?

పదేండ్లుగా రాష్ట్రానికి చేసిందేమి లేదు

- ఆర్ఆర్ఆర్ అడ్డుకుంటున్నారు
- మూసీ రివర్ ఫ్రంట్ నిధులివ్వలేదు : చేవెళ్ల నియోజకవర్గ సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ ఆగ్రహం
- నేడు ఢిల్లీకి సీఎం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్లుగా రాష్ట్రానికి ప్రధాని మోడీ ఏం చేశారని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఏం చూసి బీజేపీకి ఓటేయాలని ఆయన నిలదీశారు. రాష్ట్రానికి వరప్రదాయిని అయిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు బీజేపీ పూర్తి చేయలేదని విమర్శించారు. బుల్లెట్ ట్రైన్‌ను గుజరాత్‌కు తీసుకెళ్లిన మోడీ, వికారాబాద్‌కు ఎంఎంటీఎస్ రైలు ఎందుకు తీసుకరాలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి నిధులు ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రానికి రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) రాకుండా బీజేపీ ఎందుకు మోకాలడ్డుతున్నదని ప్రశ్నించారు. బీజేపీ నేతల వ్యవహారం ఎలా ఉందంటే, 'పెండ్లి పెద్దను చూసి పిల్లనివ్వాలన్నట్టుంది' అని ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ముఖ్యనాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం జరుగుతుందని భరోసానిచ్చారు. రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాల్లో 14 సీట్లను గెలవాలని మరోసారి పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో అందరి అభిప్రాయాలు, సర్వేల ఆధారంగానే పార్టీ అధిష్టానం అభ్యర్థులను ఎంపిక చేస్తున్నదని తెలిపారు. చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరి నియోజకవర్గాలకు ఒకదానికొకటి సంబంధం ఉందన్నారు. అన్ని రకాలుగా ఆలోచించే చేవెళ్లలో రంజిత్ రెడ్డి, మల్కాజిగిరికి సునీతా మహేందర్ రెడ్డి, సికింద్రాబాద్‌కు దానం నాగేందర్‌ను అభ్యర్థులుగా ప్రకటించిందని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు రాష్ట్ర ప్రభుత్వ వంద రోజుల పరిపాలనకు రెఫరెండం అని తెలిపారు. తెలంగాణలో 14 పార్లమెంట్ స్థానాలను గెలిచి సోనియమ్మకు కృతజ్ఞతలు చెబుదామని తెలిపారు. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఇది చక్కని అవకాశమని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యకర్తలకు అండగా నిలబడేందుకు, దేశాన్ని కాపాడుకునేందుకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వేల కిలోమీటర్లు నడిచారని తెలిపారు. పార్టీకి అండగా నిలబడి ...13లో

అదానీ చేతికి మరో నౌకాశ్రయం

ఎస్‌పీ గ్రూప్ నుంచి గోపాల్‌పూర్ పోర్టు స్వాధీనం

- రూ.3,350 కోట్లకు కొనుగోలు
- దేశవ్యాప్తంగా 13 పోర్టుల్లో అదానీ గ్రూప్ వాటా 24 శాతం



న్యూఢిల్లీ : నౌకాశ్రయాల్లో గౌతం అదానీ ఏకచత్రాధిపత్యం మరింత పెరిగిపోయింది. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ తాజాగా ఒడిషాలోని షాపూర్జీ పల్లోంజీ (ఎస్‌పీ) గ్రూప్‌నకు చెందిన గోపాల్‌పూర్ నౌకాశ్రయాన్ని స్వాధీనం చేసుకుంది. ఇప్పటికే దేశంలో పశ్చిమ, తూర్పులోని దాదాపు 12 పోర్టులు, టెర్మినల్స్‌ను సొంతం చేసుకున్న అదానీ పోర్టుపోలియోలో మరొక్కటి చేరినట్లయ్యింది. మోడీ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీ సహజ వనరులు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాల స్వాధీనాలను భారీగా పెంచుకున్న విషయం తెలిసిందే. ఒడిషా గోపాల్‌పూర్ ...13లో



భారత్‌లో పెరిగిన కుబేరులు..

- 271కి చేరిన బిలియనీర్లు
- గతేదాది కొత్తగా 94 మంది జత
- ముంబయిలోనే అత్యధికం
- ఆసియాలోనే ముకేశ్ అంబానీ టాప్
- హురున్ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడి

న్యూఢిల్లీ : భారత్‌లో అధిక ధరలతో సామాన్యుల ఆదాయాలు అడుగంటిపోతుంటే.. మరోవైపు కుబేరుల సంపద మాత్రం ఊహించని రీతిలో పెరిగిపోతోంది. సంఖ్యా, ఆదాయ పరంగాను గతేడాది వీరి సంఖ్య భారీగా పెరగడం గమనార్హం. కేవలం మూడు వందల లోపు మంది వద్ద దాదాపు రూ.80 లక్షల కోట్లకుపైగా సంపద పోగుబడిందని హురున్ రిస్ట్ లిస్ట్ రిపోర్ట్‌తో వెల్లడయ్యింది. సంపన్నులు ఏడాదికేడాదికి వేల కోట్లు పోగేసుకుంటున్నారని తేలింది. సోమవారం "హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2024" పేరుతో హురున్ ఓ రిపోర్ట్‌ను విడుదల ...13లో

బీజేపీని ఆపే సత్తా కాంగ్రెస్‌కు లేదు..

కమలం చెంతకు చేరే మొదటి వ్యక్తి రేవంతే..

- జీవితాంతం కాంగ్రెస్‌లో ఉంటానని ఆయన అనటం లేదు...
- ఢిల్లీకి రూ.2,500 కోట్లు పంపిన ఘనుడాయన : 'సికింద్రాబాద్' సమీక్షా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- దుమ్మూ కొట్టిన సాయికిరణ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, మధ్యలోనే వెళ్లిపోయిన మాజీ మంత్రి తలసాని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో బీజేపీని నిలువరించే శక్తి, సత్తా కాంగ్రెస్‌కు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీజేపీలో చేరే మొదటి వ్యక్తి ముఖ్యమంత్రి రేవంతేననీ, ఆయన తన జీవితాంతం కాంగ్రెస్‌లో ఉంటానంటూ చెప్పటం లేదని వ్యాఖ్యానించారు. బీజేపీలో ఆయన చేరికపై వస్తున్న విమర్శలను రేవంత్ ఖండించటం లేదని గుర్తు చేశారు. 'జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్న జేబుదొంగ రేవంత్... భవనాలకు అనుమతుల పేరిట వసూలు చేసిన రూ.2,500 కోట్లను ఢిల్లీకి సామంతరాజులా పంపారు...' అంటూ ఘాటుగా విమర్శలు గుప్పించారు. త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 40 సీట్లు కూడా దాటబోవంటూ కేటీఆర్ ఈ సందర్భంగా విమర్శించారు.

బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంటు సన్నాహక సమావేశాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించారు. ఆ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తోపాటు సికింద్రాబాద్ లోక్‌సభ ...6లో

దేశం ప్రశాంతంగా ఉండాలంటే.. మోడీ తిరిగి అధికారంలోకి రావొద్దు

- తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్



వివరాలు 13లో

హైకోర్టు జడ్జిగా జస్టిస్ సుజోయ్ పాల్ ప్రమాణం



వివరాలు 5లో

ధాన్యానికి రూ.500 బోనస్ దక్కేనా!

రాష్ట్రంలో వరి కోతలు షురూ.. మార్కెట్‌కు రానున్న ధాన్యం

- ఏప్రిల్ ఒకటి నుంచి కొనుగోళ్లు ప్రారంభం
- మద్దతు ధరతో పాటు బోనస్‌పై రైతుల్లో ఆశ
- నీటి ఎద్దడి, అకాల వర్షాల వల్ల అపార పంట నష్టం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

యాసంగిలో సాగు చేసిన వరి పైర్లు కోతకొచ్చాయి. ముందస్తుగా నాట్లు వేసిన ప్రాంతాల్లో ఇప్పటికే వరి కోత పనులు షురూ అయ్యాయి. ఏప్రిల్ 1 నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని పౌర సరఫరాల సంస్థ ఏర్పాట్లు చేస్తుంది. మార్కెట్లోకి ధాన్యం వచ్చిందంటే వెనువెంటనే కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. ఆరు గ్యారంటీల్లో భాగంగా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక తొలిసారిగా యాసంగి సీజన్‌లో ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేయనుంది. రైతులకు మద్ధతు ధరతో పాటు బోనస్ చెల్లించాలని రైతులు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బోనస్ చెల్లింపు గురించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దాంతో యాసంగిలో బోనస్ ఉన్నట్టా? లేనట్టా? అన్న సంశయం వ్యక్తమవుతోంది.

రాష్ట్రంలో యాసంగిలో సాగైన వివిధ రకాల పంటల్లో వరి సాగే అధికంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 54.93 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినా జలాశయాల్లో నీటి లభ్యత లేని కారణంగా సాగు విస్తీర్ణం తగ్గింది. ముందస్తుగా నాట్లు వేసిన నల్లగొండ, యాదాద్రి, సిద్దిపేట తదితర ప్రాంతాల్లో ఇప్పటికే వరి కోతలు షురూ అయ్యాయి. నల్లగొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతేడాదిలో పోలిస్తే సుమారు 7లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు వస్తాయనేది అధికారుల అంచనా. సిద్దిపేట జిల్లాలో 3.30 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. మెదక్ జిల్లాలో 2.60 లక్షల ఎకరాల్లో, సంగారెడ్డి జిల్లాలో 83 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. యాసంగి సీజన్‌లో దొడ్డురకం వరినే సాగు చేశారు. పండిన ధాన్యాన్నంతా రైతులు మార్కెట్‌లోనే విక్రయిస్తారు. దాంతో రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు పౌరసరఫరా సంస్థ ఏర్పాట్లు చేస్తుంది. ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల కోసం 7 వేల కేంద్రాల్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేశారు.

రైతుకు బోనస్ భరోసా లేనట్టేనా..?

వరి ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం బోనస్ చెల్లించాల్సి ఉంది. ఎన్నికల్లో గెలిపిస్తే అధికారంలోకి రాగానే రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాల్ ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తామని చెప్పింది. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం రూ.15 వేలు ...5లో





మార్చిలోనే మండుతోంది

42.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు

- వారంరోజుల్లో మరింత పెరుగుదల



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో మార్చి నెలలో ఎండలు భగభగ మండిపోతున్నాయి. పది జిల్లాల్లో అప్పుడే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిపోయాయి. ఆదిలాబాద్ జిల్లా తాళ్లమడుగులో మంగళవారం అత్యధికంగా 42.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. వచ్చే ఐదు రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు అదనంగా నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతం కూడా తక్కువగా ఉండే అవకాశముంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, కొమ్రంభీమ్ అసిఫాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, సూర్యాపేట, పెద్దపల్లి, మంచిర్యాల్, నిజామాబాద్, ములుగు, హన్మకొండ, జయశంకర్‌భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ...13లో

వ్యాపారులను బెదిరించి డబ్బులు దండుకున్నారు

- వీరిని మరింతగా విచారించాలి
- కోర్టుకు తెలిపిన పంజాగుట్ట పోలీసులు
- ముగ్గురు అధికారుల కస్టడీ పిటిషన్ నేటికి వాయిదా
- ప్రతి జిల్లాలో ఫోన్ ట్యాపింగ్ బాధితులున్నారు
- విచారణ జరపండి : డీజీపీకి కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం ఫిర్యాదు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రయివేటు వ్యాపారులనూ బెదిరించి ముగ్గురు పోలీసు అధికారులు భారీ మొత్తంలో డబ్బులను దండుకున్నారనీ, వారిని మరింత లోతుగా విచారించటానికి తమ కస్టడీకి ఇవ్వాలని పంజాగుట్ట పోలీసులు నాంపల్లి కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో నిందితులైన డీఎస్పీ ప్రణీత్‌రావు, అదనపు ఎస్పీలు బుజంగరావు, తిరుపతన్నలు చంచల్‌గూడ జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. కాగా, ఈ ముగ్గురిని తదుపరి విచారణ కోసం వారం రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలంటూ కేసు దర్యాప్తు జరుపుతున్న పంజాగుట్ట పోలీసులు.. న్యాయమూర్తిని కోరారు. ప్రతిపక్ష రాజకీయ ప్రముఖుల ఫోన్లతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బంగారు వ్యాపారుల ఫోన్లను అనేకం వీరు ట్యాపింగ్ చేసి చివరకు బెదిరింపులకూ పాల్పడ్డారని పంజాగుట్ట పోలీసులు కోర్టుకు తెలిపారు. అయితే, దీనికి సంబంధించి కౌంటర్ దాఖలు చేయటానికి తమకు సమయం కావాలని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టును కోరటంతో బుధవారానికి విచారణను న్యాయమూర్తి వాయిదా వేశారు.

దర్యాప్తును సాగిస్తున్న స్పెషల్ టీమ్ పోలీసులు ఈ ముగ్గురిని తదుపరి విచారించటానికి అవసరమైన ప్రశ్నావళిని సిద్ధం చేసుకుంటున్నారు. కాగా, ఫోన్‌ట్యాపింగ్‌కు అవసరమై ఆధునిక పరికరాలను విదేశాల నుంచి తేవటంలో ఒక ఎమ్మెల్సీ కూడా ఇందులో కీలక పాత్ర వహించినట్టు దర్యాప్తు అధికారుల దృష్టికి వచ్చినట్టు తెలిసింది. అదే సమయంలో, ఈ అధికారుల నుంచి తామెదుర్కొన్న బాధలను కొందరు వ్యాపారులు మౌఖికంగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిసింది. అయితే, వాటిపై ఫిర్యాదు చేస్తే తప్పకుండా దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని స్పెషల్ టీమ్ అధికారులు హామీ ఇచ్చినట్టు సమాచారం.

కాగా, ఈ ఫోన్ ట్యాపింగ్ వలన ఇబ్బందులను ఎదుర్కొన్న బాధితులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నారనీ, వాటిని సమగ్రంగా విచారించటానికి పటిష్టమైన విచారణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి.. డీజీపీ డాక్టర్ రవి గుప్తాను కలిసి ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తాను కూడా బాధితుడినేనని ఆయన చెప్పారు. ఒక కుట్రపూరితంగా జరిగిన ఈ ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో అప్పటి ప్రతిపక్ష రాజకీయ ప్రముఖులేగాక అనేక మంది వ్యాపారులు, ప్రముఖులు కూడా ఇబ్బందులు పడ్డారని ఆయన వివరించారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వెనక పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేసింది అప్పటి ప్రభుత్వ పెద్దలేననీ, ఈ నేరానికి పాల్పడ్డవారెవరిని కూడా వదలకూడదని ఆయన డీజీపీని కోరారు. ఈ విషయంలో సమగ్రంగా విచారణ జరిపించి, బాధితులకు న్యాయం చేస్తామని డీజీపీ హామీ ఇచ్చినట్టు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ఫోన్‌ట్యాపింగ్ ద్వారా బెదిరింపులకు పాల్పడి అనేక మంది వ్యాపారుల నుంచి కోట్ల రూపాయలను నిందిత అధికారులు దండుకున్నారనే ఆరోపణలపై రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కూడా దృష్టిని సారించినట్టు తెలిసింది. అప్పటి స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ) ఐజీ ప్రభాకర్‌రావు ఇచ్చిన ఫోన్ నెంబర్లే గాక.. ప్రయివేటు వ్యక్తులు, మరికొందరు రాజకీయ నాయకులు కూడా ఇచ్చిన ఫోన్ నెంబర్లను ట్యాప్ చేయటం ద్వారా భారీ మొత్తంలో అక్రమార్జనకు వీరు పాల్పడినట్టు ఏసీబీ అనుమానిస్తున్నది.

ఈ నేపథ్యంలో ఏసీబీ నుంచి కొందరు అధికారులను ఈ దిశగా అంతర్గత సమాచార సేకరణ కోసం రంగంలోకి దింపినట్టు తెలిసింది. నిందితుల్లో ఒకరైన అదనపు ఎస్పీ బుజంగరావు తాను ఎస్సైగా ఉన్నప్పటి నుంచి అదనపు ఎస్పీగా పదోన్నతి పొందే వరకు వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించిన సందర్భంగా అమాయకులను బెదిరించి భూకబ్జాలకు పాల్పడినట్టుగా కూడా ఆరోపణలు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చాయి. నాచారం, వనస్థలిపురం, మాదాపూర్, కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తించినపుడు ఈ భూకబ్జాలకు పాల్పడినట్టుగా పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నట్టు తెలుస్తున్నది. భువనగిరిలో పని చేస్తున్నపుడు గ్యాంగ్‌స్టర్ నయీమ్ కబ్జాకు పాల్పడ్డ కొన్ని భూములలో కూడా బుజంగరావు తన హస్తలాఘవం ప్రదర్శించి సొంతం చేసుకున్నట్టు కూడా పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఉన్నట్టు తెలుస్తున్నది.

ఫోన్ ట్యాపింగ్‌తో నాకు సంబంధం లేదు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఫోన్ ట్యాపింగ్‌తో తనకు సంబంధం లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కేసులో నిందితుడిగా ఉన్న డీఎస్పీ ప్రణీత్ రావుతో తనకు ఎలాంటి బంధుత్వం లేదని స్పష్టం చేశారు. ఆయన బంధువులు కొంత మంది తమ గ్రామంలో ఉన్నారని తెలిపారు. అంతకు మించి అతడితో తనకెలాంటి పరిచయం లేదని పేర్కొన్నారు. కొంత మంది కావాలని తనను ఈ కేసులో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తనపై ఫిర్యాదు చేసిన చరణ్ చౌదరి, ఎన్ఆర్ఐ విజయ్‌ల మధ్య ఉన్న లావాదేవీల్లోకి తనను లాగడం సరికాదన్నారు. చరణ్ చౌదరి బీజేపీలో ఉంటూ భూ కబ్జాలు, అక్రమాలకు పాల్పడుతుంటే పార్టీ నుంచి సస్పెండ్ చేశారని తెలిపారు. అతనిపై వివిధ పోలీస్ స్టేషన్లలో అనేక కేసులున్నాయని గుర్తు చేశారు.

నలభై ఏండ్ల రాజకీయ జీవితంలో ఏనాడు ఎలాంటి మచ్చ తనపై పడలేదన్నారు. పార్టీ మారాలంటూ కొందరు తనపై ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు. ఓటుకు నోటు కేసు గురించి తనకేమీ తెలియదని ఈ సందర్భంగా ఎర్రబెల్లి తెలిపారు.

మైక్రోసాఫ్ట్ విండోస్, సర్ఫేస్ చీఫ్‌గా పవన్ దావులూరి



న్యూయార్క్ : ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఆపరేటింగ్ సిస్టమ్ విండోస్, సర్ఫేస్ భాగాలకు కొత్త చీఫ్‌గా పవన్ దావులూరి నియామకమయ్యారు. గతంలో ఈ విభాగానికి నేతృత్వం వహించిన పనోస్ పనయ్ స్థానంలో పవన్‌ను కంపెనీ నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ఐఐటీ మద్రాస్‌లో విద్యాభ్యాసం చేసిన పనయ్ అమెరికాలోనే స్థిరపడ్డారు. దాదాపు 23 సంవత్సరాలుగా మైక్రోసాఫ్ట్‌లో పని చేస్తున్నారు.

పోకో నుంచి కొత్త సి61 ఆవిష్కరణ

హైదరాబాద్ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ కంపెనీ పోకో మంగళవారం బడ్జెట్ ధరలో కొత్త పోకో సి61 ఫోన్‌ను విడుదల చేసింది. దీని ప్రారంభ ధరను రూ.6,999గా నిర్ణయించింది. ఈ ఫోన్ మీడియాటెక్ హెలియో జీ36 ప్రాసెసర్‌తో పని చేస్తుంది. మార్చి 28 నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులోకి ఉంటుందని పోకో మొబైల్స్ పేర్కొంది. 5000 ఎంఎహెచ్ బ్యాటరీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బ్యాక్ 8-మెగా పిక్సెల్ డ్యుయల్ కెమెరా యూనిట్, రెండు ర్యామ్‌లూ రెండు స్టోరేజీ వేరియంట్లతో పాటు మూడు రంగుల్లో ఇది లభిస్తుందని తెలిపింది.

పెరిగిన ఓటర్లు


- తుది జాబితా విడుదల చేసిన ఎన్నికల సంఘం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య పెరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంటు ఎలక్షన్స్‌లో ఓట్లు వేసేవారి సంఖ్య పెరిగినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూడా ఈ ఏడాది మార్చి 25వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదు, ఇతర సవరణలకు అవకాశం కల్పించిన నేపథ్యంతో ఓటర్ల సంఖ్య పెరిగినట్టు పేర్కొన్నారు. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3 కోట్ల 30 లక్షల 13వేల 318 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1 కోటి 64 లక్షల 14వేల 693 మంది ఉండగా, స్త్రీలు 1 కోటి 65 లక్షల 95వేల 896 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య 1 లక్ష 81 వేల 203 అధికంగా ఉంది. ట్రాన్స్‌జెండర్లు 2,729 మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లు 15,472 మంది ఉన్నారని తెలిపారు. 18 - 19 ఏండ్ల మధ్య వయసు యువ ఓటర్ల సంఖ్య 8 లక్షల 72వేల 116 మంది ఉన్నారు. 85 ఏండ్లు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న ఓటర్లు 1 లక్ష 93వేల 489 మంది ఉన్నారు. వికలాంగులు 5 లక్షల 26వేల 286 మంది ఉండగా, ఎన్ఆర్ఐ ఓటర్లు 3,409 మంది ఉన్నారు.

ఇదేనా 'మాతృవందనం'?

మహిళలంటే ఎనలేని ప్రేమ చూపటమే కాదు..అంతా మీకోసమే అన్నట్టుగా బీజేపీ ఓటు రాజకీయం చేస్తోందనటానికి తాజా ఉదాహరణ మాతృవందనం పథకం. గర్భిణుల కోసం ప్రవేశపెట్టిన ఈ పథకం కూడా ఓట్లుగా మలుచుకోవటానికేనని స్పష్టమవుతోంది. వాస్తవ పరిశీలనలో మాతృవందనం పథకానికి కేంద్రం తూట్లు పొడుస్తున్నది.



కేటాయింపులు నాస్తి... ఖర్చులు జాస్తి

కఠిన నిబంధనలతో లబ్దిదారుల అనాసక్తత

ఆరోగ్య రక్షణలో ఇబ్బంది పడుతున్న గర్భిణులు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం గర్భిణులు, పాలిచ్చే తల్లుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆర్భాటంగా ప్రారంభించిన ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం కఠినతరమైన నిబంధనలు, నిధుల కొరత కారణంగా నీరుగారిపోతోంది. మరోవైపు ఈ పథకానికి బడ్జెటరీ కేటాయింపులు నానాటికీ తగ్గిపోతున్నాయి. ఫలితంగా గర్భిణులు తమకు అందజేస్తున్న అరకొర ఆర్థిక సాయం కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది.

జాతీయ ఆహార భద్రతా చట్టంలోని నిబంధనలను అనుసరించి 2017లో మోడీ ప్రభుత్వం ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకాన్ని తీసుకొచ్చింది. తొలిసారి గర్భం దాల్చిన మహిళలకు, పాలిచ్చే తల్లులకు రూ.5,000 ఆర్థిక సాయాన్ని అందజేస్తానని తెలిపింది. గర్భిణులు, పాలిచ్చే తల్లులు పాక్షికంగా ఉపాధి కోల్పోతారని, అంతేకాక తల్లీబిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుందని, అందుకోసం ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించామని ప్రభుత్వం చెప్పుకొచ్చింది. 2022లో ఈ పథకాన్ని ఆధునీకరించి మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన మిషన్ శక్తి పథకంలో చేర్చారు. సవరించిన ఈ పథకానికి పీఎంఎంవీవై 2.0 అని పేరు పెట్టారు. భ్రూణహత్యలను నివారించడానికి రెండో శిశువుకు (ఆడపిల్ల అయితే) రూ.6,000 అలవెన్సును ప్రకటించారు.

రుబీనా షేక్ అనే మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి రూ.10,000 ఖర్చు చేసింది. ఆ తర్వాత ఆమెకు రెండో బిడ్డ పుట్టింది. ప్రధానమంత్రి మాతృవందన యోజన (పీఎంఎంవీవై) పథకం కింద తనకు రావాల్సిన రూ.6,000 ఆర్థిక సాయం కోసం ఆమె ఇంకా ఎదురు చూస్తోంది.

గర్భిణులకు సాయం అందించడానికి కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని ఏడు సంవత్సరాల క్రితమే ప్రవేశపెట్టినప్పటికీ దాని అమలు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. దీనికి బడ్జెటరీ కేటాయింపులు కూడా నానాటికీ తగ్గిపోతున్నాయి.



ఆధార్ తప్పనిసరి కావడంతో...

పీఎంఎంవీవై కింద 2020 నుంచి 2021 వరకూ పేర్లు నమోదు చేసుకున్న లబ్దిదారుల సంఖ్య 7 శాతం పెరిగింది. అయితే 2022 నవంబర్ నాటికి ఆ సంఖ్య అంతకుముందు అదే సంవత్సరంతో పోలిస్తే 46 శాతం తగ్గింది. ఈ పథకం కింద ఆర్థిక ప్రయోజనం పొందాలంటే లబ్దిదారులకు ఆధార్ నెంబర్లు తప్పనిసరి అని కొత్తగా మార్గదర్శకాలు రూపొందించారు. ఈ కారణంగా లబ్దిదారుల సంఖ్య బాగా తగ్గిపోయింది.

అడ్డంకిగా మారిన నిబంధనలు

ఈ పథకానికి అర్హత సాధించాలంటే మహిళలు భగీరథ ప్రయత్నమే చేయాల్సి వస్తోంది. వారు తమ బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్, రేషన్ కార్డు వంటి ప్రభుత్వ గుర్తింపు కార్డులు, తల్లీపిల్లల రక్షణ కార్డు (ఎంసీపీ)లోని రిజిస్ట్రేషన్ వివరాలు అందజేయాల్సి ఉంటుంది. అయితే చాలా మంది మహిళల వద్ద ఈ కార్డులు, వివరాలు సరిగా లేవు. పోనీ ఎలాగోలా ఆ వివరాలన్నీ సమర్పించగానే అసలు కష్టాలు మొదలవుతాయి. సొమ్ము చెల్లింపునకు సంబంధించిన వాయిదాల సమయంలో అనేక నిబంధనలను పాటించాల్సి వస్తోంది. ఆస్పత్రిలో ఎప్పుడు పరీక్ష చేయించుకున్నారు, గర్భాన్ని ధ్రువీకరిస్తూ ఎప్పుడు నమోదు చేశారు, వ్యాక్సిన్లు ఎప్పుడు తీసుకున్నారు వంటి వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు సమర్పించాల్సి ఉంటుంది.

పైగా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న మహిళల్లో విద్యావంతులు తక్కువ. సమాచార సాంకేతిక పరిజ్ఞానం కూడా వారికి సరిగా అందుబాటులో ఉండదు.

పైగా సాంస్కృతిక సంప్రదాయాలు, నమ్మకాలు మహిళలపై ఆంక్షలు విధిస్తుంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో తొలిసారి గర్భం దాల్చిన మహిళల్లో కేవలం 67 శాతం మంది మాత్రమే కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు.

తగ్గుతున్న కేటాయింపులు

తొలిసారి శిశువుకు జన్మనిచ్చిన తల్లికి అందజేస్తున్న ఆర్థిక సాయం 2017 నుండి ఎదుగూ బొదుగూ లేకుండా అలాగే ఉంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ద్రవ్యోల్బణాన్ని బట్టి ఆర్థిక సాయాన్ని కనీసం రూ.1,599 నుంచి రూ.6,599 వరకూ పెంచాల్సిన అవసరం ఉన్నదని నిపుణులు సూచిస్తున్నారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీ వరకూ 32.1 మిలియన్ల లబ్దిదారులకు రూ.14,427 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ పథకం కింద ఎంత మంది మహిళలు రెండు వాయిదాల సొమ్మును అందుకున్నారన్న సమాచారం లేదు. ఉదాహరణకు 2022 నవంబర్ వరకూ కేవలం 20% మంది అర్హులైన మహిళలు మాత్రమే అన్ని వాయిదాల సొమ్మును అందుకున్నారని ఓ సంస్థ తెలిపింది.

ఈ పథకం కింద గర్భిణులకు అందజేస్తున్న సాయం వారి ఆర్థిక అవసరాలను ఏ మాత్రం తీర్చడం లేదు. దీంతో గర్భిణులుగా ఉంటూనే వారు అనారోగ్యకమైన పనులు చేయాల్సి వస్తోంది. అయినప్పటికీ ఈ పథకానికి 2020-21తో పోలిస్తే 2023-24లో బడ్జెట్ కేటాయింపులు 17 శాతం మేర తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి రూ.2,067 కోట్లు కేటాయించారు.

పెరుగుతున్న ఖర్చులు

2022లో దేశంలో 19.8 మిలియన్ల మంది గర్భిణులు, పాలిచ్చే తల్లులు ఉండగా వారిలో 16.1 మిలియన్ల మంది మాత్రమే ఈ పథకం కింద పేర్లు నమోదు చేసుకున్నారు. బడ్జెటరీ కేటాయిం పులతో పోలిస్తే గర్భిణులు, పాలిచ్చే తల్లుల ఆరోగ్య పరిరక్షణ కోసం అవుతున్న ఖర్చు మూడు రెట్లు అధికంగా ఉంది. రెండోసారి గర్భం దాల్చిన మహిళలకు అందిస్తున్న సాయం దీనికి అదనం. అంటే ప్రస్తుత కేటాయింపులు తొలిసారి గర్భం దాల్చిన వారికి ఆర్థిక సాయం చేయడానికి కూడా సరిపోవడం లేదు. తాజాగా లబ్దిదారులకు ఆన్‌లైన్ ద్వారా వారి ఖాతాల్లో నేరుగా సొమ్ము జమ చేస్తున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లోని 46.6 శాతం మహిళ లకు మాత్రమే ఇంటర్నెట్ సదు పాయం అందుబాటులో ఉంది.



ప్రధాని నివాసం ముట్టడికి ఆప్ యత్నం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నారు. దేశ రాజధాని నగరాన్ని ఢిల్లీ పోలీసులు మొత్తగా పోలీసు రాజ్యంగా మార్చివేశారని ఆప్ ఢిల్లీ శాఖ కన్వీనర్, మంత్రి గోపాల్ రాయ్ విమర్శించారు. ఇక్కడ ఒక పత్రికా సమావేశంలో మాట్లాడుతూ ఆయన, నగరవ్యాప్తంగా 144వ సెక్షన్ విధిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు చూస్తుంటే ఇది పోలీసు రాజ్యంగా వున్నట్టు అనిపిస్తోందన్నారు.

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ప్రేమించే వారు దేశంలోని నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడుతునాన్నరని రాయ్ పేర్కొన్నారు. మార్చి 31న ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో మహా ర్యాలీ నిర్వహించేందుకు సన్నాహాలు మొదలయ్యాయని చెప్పారు. దేశవ్యాప్తంగా మెగా నిరసనలను నిర్వహించనున్నట్టు రాయ్ తెలిపారు.

ఈ ర్యాలీలో లక్షలాదిమంది ప్రజలు పాల్గొంటారని, ఇండియా బ్లాక్ నుంచి పలువురు నేతలు హాజరవుతారని చెప్పారు. కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ వారందరూ తమ గళాన్ని వినిపిస్తారని చెప్పారు. ఆప్ కార్యకర్తల నిరసనల నేపథ్యంలో ప్రధాని నివాసం చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేశారు. సెంట్రల్ ఢిల్లీలోని మెట్రో స్టేషన్ల వద్ద బందోబస్తు పెంచారు. అదనపు భద్రతా సిబ్బందిని మోహరించారు. లోక్ కల్యాణ్ మార్గ్ మెట్రో స్టేషన్‌కు వెళ్ళే, వచ్చే మార్గాలను భద్రతా కారణాల రీత్యా మూసివేసినట్టు ఢిల్లీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఎక్స్‌లో తెలిపింది. అలాగే పటేల్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్ల వద్ద కూడా రాకపోకలపై ఆంక్షలు విధించారు.

ఏ తరహా నిరసనలు నిర్వహించడానికి కూడా అనుమతినివ్వలేదని డీసీపీ(న్యూఢిల్లీ) దేవేశ్ కుమార్ తెలిపారు. కాగా పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో సీనియర్ ఆప్ నేతలు సోమ్‌నాథ్ భారతి, ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రాఖి బిర్లా, పంజాబ్ మంత్రి హర్‌జోత్ సింగ్ బైన్స్ తదితరులు వున్నారు. అవినీతికి పాల్పడిన కవితను కాపాడేందుకు నిజాయితీగా వున్నవారిని ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని ఆందోళనకారుల్లో ఒకరు విమర్శించారు.

శాంతియుతంగా నిరసన తెలియ చేస్తున్న ఆప్ నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేయడం దిగ్భ్రాంతి కలిగిస్తోందని ఆప్ సీనియర్ నేత సోమ్‌నాథ్ భారతి వ్యాఖ్యానిం చారు. ఎక్స్‌లో పోస్టు పెడుతూ, తనతో పాటు డిప్యూటీ స్పీకర్ రాఖి బిర్లా తదితరు లను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసింది. మార్చి 28 వరకు రిమాం డ్‌కు పంపింది. ప్రస్తుతం రద్దైన ఈ విధానం లో సూత్రధారి, కీలక కుట్రదారుడు కేజ్రీవాల్ అని ఈడీ ఆరోపించింది. కాగా కేజ్రీవాల్ తనపై వచ్చిన ఆరోపణలను తిరస్కరిస్తు న్నారు. రాజకీయ దురుద్దేశాలతోనే కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలతో అవకతవకలకు పాల్పడుతోందని విమర్శించారు.

కేజ్రీవాల్ అరెస్టుపై స్పందించిన అమెరికా

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా స్పందించింది. సక్రమమైన, పారదర్శకతతో కూడిన విచారణా క్రమాన్ని చేపట్టగలరని తాము ఆశిస్తున్నట్టు అమెరికా పేర్కొంది. ఈ మెయిల్‌లో అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి పై రీతిన స్పందించారు. గతంలో జర్మనీ కూడా ఇదే రీతిలో స్పందించడంతో భారత్ తీవ్రంగా మండిపడింది. తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమే కాగలదని తీవ్రంగా స్పందించింది. జర్మనీ రాయబారిని పిలిచి తమ నిరసన తెలియచేసింది. అది జరిగిన రెండు రోజులకే అమెరికా కూడా ఇదే రీతిలో స్పందించింది. సకాలంలో విచారణ జరగాలని ఆశిస్తున్నట్టు తెలిపింది.

ఐపీఎల్ మ్యాచ్‌లకు పటిష్ట భద్రత

మ్యాచ్‌కు 3 గంటల ముందు నుంచే అనుమతి

- 2800 మందితో భారీ బందోబస్తు
- 360 సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా
- పోకిరీల ఆగడాలను అరికట్టేందుకు రంగంలోకి షీ టీమ్స్
- అర్ధరాత్రి వరకు మెట్రో సేవలు
- ప్రజా రవాణాను ఉపయోగించుకోవాలి
- రాచకొండ సీపీ తరుణ్ జోషీ



నవతెలంగాణ- సిటీబ్యూరో

ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఐపీఎల్ -17 షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 27, వచ్చే నెల 5న రాత్రి జరిగే మ్యాచ్‌లకు పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. బందోబస్తులో 2,800 మంది పోలీసులుంటారని రాచకొండ సీపీ తరుణ్ జోషీ తెలిపారు. 360 సీసీ కెమెరాల నిఘా మధ్య ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణ కొనసాగుతుందన్నారు. మెడికల్ టీమ్స్‌తోపాటు అంబులెన్స్, అగ్నిమాపక సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. బుధవారం(నేడు) రాత్రి సన్ రైజర్స్ - ముంబయి ఇండియన్స్ మధ్య తొలి మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంగళవారం ఉప్పల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ పద్మజతో కలిసి సీపీ మాట్లాడారు.

ఐపీఎల్ -17 షెడ్యూల్‌లో భాగంగా ఉప్పల్ స్టేడియంలో ఏడు మ్యాచ్‌లు జరగనున్నాయని తెలిపారు. ఆక్టోపస్, ఆర్మ్‌డ్ రిజర్వుడ్, ట్రాఫిక్, సీసీఎస్, ఎస్‌వోటీ, లా అండ్ ఆర్డర్‌తోపాటు ఇతర సెక్యురిటీ వింగ్‌లను రంగంలోకి దించామన్నారు. అదనంగా బాంబ్, డాగ్ స్క్వాడ్స్‌లను ఉపయోగిస్తున్నామని తెలిపారు. మొత్తం 2800 మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. రాత్రి 7:30 గంటల నుంచి మ్యాచ్‌లు కొనసాగుతాయన్నారు. మ్యాచ్‌లకు 3 గంటల ముందు నుంచి లోపలికి పంపిస్తారన్నారు. ప్రత్యేకంగా స్టేడియంలో జాయింట్ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరిపైనా నిఘా ఉంటుందన్నారు. పోకిరీల ఆగడాలను అరికట్టేందుకు షీ టీమ్స్ ఉంటాయని చెప్పారు. వివిధ ప్రాంతాల్లో ఫ్రీ పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఆటగాళ్లకు, వీవీఐపీలతోపాటు ప్రేక్షకులకు వేర్వేరుగా ప్రవేశ ద్వారాలు ఉన్నాయని తెలిపారు. పాసులు కలిగిన వారు పోలీసుల సూచనల మేరకు పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను పార్క్ చేయాలన్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లో బ్లాక్‌లో టికెట్ విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. టికెట్లు కలర్ జీరాక్స్ తీసుకొస్తే చర్యలు తప్పవన్నారు. ఎవరైనా బ్లాక్‌లో టికెట్లు విక్రయించడం.. పార్కింగ్ ఫీజ్ వసూలు చేసినట్టు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా రాచకొండ వాట్సాప్‌లో సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు. మొబైల్ ఫోన్లు, బ్లూ టూత్‌లకు మినహా ఎలక్ట్రానిక్ వస్తువులను స్టేడియం లోపలకు అనుమతించబోమని సీపీ తెలిపారు. ఈసారీ ఇయర్ ఫోన్లను అనుమతిస్తున్నట్టు స్పష్టం చేశారు. మహిళలకు పెద్దసైజు గల పర్సుల అనుమతి లేదన్నారు. ల్యాప్‌టాప్‌లు, కెమెరాలు, అగ్గిపెట్టెలు, బ్యాగ్‌లు, పెన్నులు, సెంట్ బాటిళ్లు, శిరస్త్రానాలు, మంచినీళ్ల సీసాలు స్టేడియం లోపలకు అనుమతించేది లేదని తెలిపారు.

సీఈఓ డాక్టర్ పాండు రంగమూర్తి మాట్లాడుతూ.. బయటి వస్తువులను అనుమతించబోమన్నారు. సెక్యురిటీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఐపీఎల్ మ్యాచ్‌కు వచ్చే ప్రేక్షకులు, అభిమానులు అధిక శాతం సొంత వాహనాలపై వస్తున్నారని తెలిపారు. భారీ సంఖ్యలో వాహనాలపై వస్తుండటంతో ట్రాఫిక్‌కు ఆటంకం కలుగు తోందన్నారు. ప్రజా రావాణాను ఉపయోగించుకోవాలని కోరారు. ఐపీఎల్ మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో మెట్రో, ఆర్టీసీ బస్సులు అర్ధరాత్రి ఒంటి గంట వరకు అందుబాటులో ఉంటాయన్నారు.



తీహార్ జైల్‌కు కవిత

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. అనంతరం గతంలో ఇచ్చిన 10 రోజుల కస్టడీ ముగియడంతో ఆమెను ఈడీ అధికారులు రౌస్ అవెన్యూలోని సీబీఐ స్పెషల్ కోర్టు ముందు హాజరుపరిచారు. ఈడీ తరపు న్యాయవాది జోసెబ్ హుస్సేన్, కవిత తరపు న్యాయవాది విక్రమ్ చౌదరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాదనలు కొనసాగించారు. తొలుత ఈడీ తరపు వాదనలు కొనసాగిస్తూ... కవితను 14 రోజులు జ్యూడిషియల్ కస్టడీకి పంపాలని కోరారు. కవిత కేసు దర్యాప్తునకు సహకరించడం లేదని కోర్టుకు నివేదించారు. అలాగే కేసు దర్యాప్తు పురోగతిలో ఉందని, ఈ కేసులో పలువురిని ఇంకా ప్రశ్నిస్తున్నట్టు తెలిపారు. ఈ వాదనలపై కవిత తరపు న్యాయవాదులు విక్రమ్ చౌదరి, రానా అభ్యంతరం వ్యక్తం చేశారు. రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశామని, ఈ విషయంలో ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని చెప్పారు. పీఎంఎల్ఎ చట్టంలోని సెక్షన్ 19(2) ప్రకారం నమోదు చేసిన కవిత స్టేట్మెంట్స్‌ను ప్రిజర్వ్ చేయాలని కోరారు. ఈ వాదనలపై జోక్యం చేసుకున్న ఈడీ తరపు న్యాయవాది కవిత బెయిల్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు కొంత సమయం కోరారు. మరోసారి విక్రమ్ చౌదరి వాదనలు కొనసాగిస్తూ... కవిత 16 ఏండ్ల కొడుకుకు 11వ తరగతి పరీక్షల షెడ్యూల్ రిలీజైందని కోర్టుకు నివేదించారు. మంగళవారం నుంచే ఈ పరీక్షలు జరుగుతోన్న నేపథ్యంలో.... ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 16 వరకు కవితకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరారు. కాగా, దాదాపు 12 ఇరువైపు వాదనలు ముగుస్తున్నట్టు పేర్కొన్న స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా... కవిత జ్యూడిషియల్ కస్టడీ, బెయిల్, మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై తీర్పును అరగంటకు రిజర్వ్ చేశారు. దీంతో కోర్టు హాల్‌లోనే కుటుంబ సభ్యులను కలిసేందుకు అనుమతించాలని, ఆమె తరపు న్యాయవాది విజ్ఞప్తి చేయడంతో న్యాయమూర్తి అనుమతించారు. ఈ సందర్భంగా భర్త అనిల్, కుటుంబ సభ్యులు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఇతర పార్టీ నేతలు ఆమెతో కాసేపు ముచ్చటించారు. అనంతరం ఒంటిగంటకు వెలువరించిన తీర్పులో కవితకు 14 రోజులు జ్యూడిషియల్ కస్టడీ విధిస్తున్నట్టు న్యాయమూర్తి కావేరి బవేజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏప్రిల్ 9న ఉదయం తిరిగి కోర్టు ముందు కవితను ప్రొడ్యూస్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే కవిత పెట్టుకున్న మధ్యంతర బెయిల్‌పై ఏప్రిల్ 1 మధ్యాహ్నం 2 గంటలకు విచారణ చేపడతామని వెల్లడించారు. అనంతరం పోలీసులు ఆమెను తీహార్ జైల్ కు తరలించారు.

పోలీస్ వ్యాన్‌లో తీహార్ జైల్ కు కవిత

కోర్టు 14 రోజులు కస్టడీ విధించడంతో కవితను పోలీస్ వ్యాన్‌లో తీహార్ జైల్‌కు తరలించారు. మధ్యాహ్నం 1 గంటకు కోర్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. అనంతరం రౌస్ అవెన్యూలోని కోర్టు హాల్ నుంచి ఆమెను అదే బిల్డింగ్‌లోని లాకప్ రూంకు తరలించారు. తర్వాత ఈడీ అధికారులు కవితను పోలీసులకు అప్పగించారు. లాకప్ రూంలోనే వైద్య సిబ్బంది కవితకు బీపీ, షుగర్ లెవల్స్‌ను చెక్ చేశారు. దాదాపు నాలుగు గంటల తర్వాత... సాయంత్రం 4:54కు ఆమెను పోలీస్ వ్యాన్‌లో జైల్‌కు తరలించారు. అయితే ఎలాంటి భద్రతా సమస్యలు ఎదురుకాకుండా... తొలుత లాకప్ రూంలోకే పోలీస్ వ్యాన్‌ను తీసుకెళ్లారు. ఆమెను లోపలే వ్యాన్‌లోకి ఎక్కించుకొని నేరుగా జైల్‌కు తీసుకెళ్లారు. కాగా కవితను జైల్‌కు తరలించే వరకు ఆమె భర్త అనిల్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పార్టీ ఇతర నేతలు, కవిత అభిమానులు లాకప్ రూం ముందే పడిగాపులు కాశారు.

ఈడీ ముందుకు శరణ్

ఢిల్లీ లిక్కర్ స్కాంలో కొత్తగా తెరపైకి వచ్చిన కవిత మేనల్లుడు మేక శ్రీ శరణ్ మంగళవారం ఈడీ ముందు విచారణకు హాజరయ్యారు. ఇండో స్పిరిట్ కంపెనీకి సంబంధించి జరిగిన నగదు బదిలీ/ వినియోగం నేర ప్రక్రియలో మేక శరణ్ ఉన్నట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈ నేర ప్రక్రియ సమాచారం శరణ్ దగ్గర ఉందని, ఆయన కేసు దర్యాప్తునకు సహకరించడంపై ఈడీ ఇటీవల కోర్టుకు తెలిపింది. కవిత తరపున సౌత్ గ్రూప్ నుంచి నగదు లావాదేవీలు/వినియోగం, బదిలీలు వంటి కీలక వ్యవహారాలన్నీ మేక కనుసన్నల్లో జరిగాయని ఆరోపించింది. ఈ నెల 15న కవిత ఇంట్లో నిర్వహించిన సోదాల టైంలో మేక శరణ్ ఫోన్‌ను సీజ్ చేశామని, అలాగే పీఎంఎల్ ఏ సెక్షన్ 17 ప్రకారం... శనివారం (మార్చి 23) శరణ్ ఇంట్లో సోదాలు చేపట్టామని, ఆ తర్వాత విచారణకు హాజరుకావాలని రెండుసార్లు ఆదేశించినా ఆయన రాలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. అయితే... తాజాగా ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో శరణ్ మంగళవారం ఈడీ ముందు విచారణకు హాజరయ్యారు. ఒకవైపు కవితను కోర్టులో ప్రొడ్యూస్ చేసిన ఈడీ అధికారులు...మరోవైపు ఈడీ ప్రధాన కార్యాలయంలో శరణ్‌ను విచారించారు. ముఖ్యంగా లిక్కర్ స్కాంలో కవిత పాత్ర, ఆమె ఆదేశాలను సారంగా సాగిన నగదు బదిలీలు/వినియోగం, సమీర్ మహేంద్రుతో శరణ్ చేసిన సంబంధాలు వంటి అంశాలపై ఆరా తీసినట్లు తెలిసింది.

జైల్లో ఆభరణాలు ధరించేందుకు కవితకు అనుమతి

తీహార్ జైళ్లో కవిత ఆభరణాలు ధరించేందుకు రౌస్ అవెన్యూ కోర్టు అనుమతించింది. మొత్తం 9 పేజీలతో కూడిన కవిత రిమాండ్ ఉత్తర్వులు సీబీఐ స్పెషల్ కోర్టు జారీ చేసింది. ఇందులో కవిత పెట్టుకున్న పలు విజ్ఞప్తులను కోర్టు పరిగణలోకి తీసుకుంది. ఆమె పెట్టుకున్న ఆరు విజ్ఞప్తులను అంగీకరిస్తూ... రౌస్ అవెన్యూ సీబీఐ స్పెషల్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా తీహార్ జైల్ సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేసింది.

ఇంటి భోజనం తీసుకునేందుకు పర్మిషన్ ఇచ్చింది. అలాగే కవిత పడుకోవడానికి మంచం, పరుపులు, చెప్పులు, బట్టలు, దుప్పట్లు, పుస్తకాలు స్వయంగా ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి మంజూరు చేసింది. వీటితో పాటు పెన్ను, పేపర్లు, ఆభరణాలు, మందులు తీసుకెళ్లేందుకు అనుమతినిచ్చింది. అయితే కస్టడీలో ఉన్నప్పుడు కవితకు చేసిన అన్ని వైద్య సంబంధిత వైద్య రికార్డ్‌లను ఆమె తరపు న్యాయవాదులకు అందజేయాలని ఈడీని ఆదేశించింది. కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్ పై ఏప్రిల్ 1 నాటికి సమాధానం ఇవ్వాలని స్పష్టం చేసింది. మద్యం కేసులో ఇప్పటికే ఈడీ జప్తు చేసిన ఆస్తులను ఖరారు చేస్తూ.. అడ్జ్యూడికెటింగ్ అథారిటీ ఉత్తర్వులను సీల్డ్ కవర్‌లో కవిత న్యాయవాదులకు ఇవ్వాలని ఆదేశించింది. అయితే ఈడీ సీల్డ్ కవర్‌లో ఇచ్చిన ఈ రికార్డులను "కాన్ఫిడెన్షియల్" గానే ఉంచాలని కవిత న్యాయవాదులకు కోర్టు సూచించింది.

సాక్ష్యాలను తారుమారు చేసే ప్రమాదం

కవిత ప్రధాన కుట్రదారు, లబ్దిదారురాలని ఈడీ ఆరోపించింది. ఆమ్ ఆద్మీ పార్టీ అగ్రనేతలతో కలిసి లిక్కర్ స్కాం కు పాల్పడ్డారని పేర్కొంది. ఇందులో రూ. 100 కోట్లు హవాలా రూపంలో చేతులు మారాయని తెలిపింది. అందుకే ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్, సెక్షన్ 19 ప్రకారం ఈ నెల 15 న ఆమెను అరెస్ట్ చేసినట్లు వివరించింది. ఒకవేళ కవితను రిలీజ్ చేస్తే లిక్కర్ స్కాం దర్యాప్తునకు ఆటంకాలు సష్టించవచ్చని ఈడీ ఆరోపించింది. కవిత అత్యంత ప్రభావశీలి అయినందున సాక్షులను ప్రభావితం చేయడంతో పాటు, సాక్ష్యాధారాలను తారుమారు చేసే ప్రమాదం ఉందని తెలిపింది. సాధారణ నేరాలతో పోల్చితే ఆర్థిక నేరాలు మరింత క్లిష్టతరంగా ఉంటాయని తెలిపింది. ఇందులో ప్రమేయం ఉన్న నేరస్థులు... సమాజంలో చాలా ప్రభావవంతంగా ఉండి, నేరాలను జాగ్రత్తగా ప్రణాళికాబద్ధంగా చేస్తారని ఆరోపించింది. ఈ కేసులో మరింత సమాచారం సేకరించాల్సి ఉన్నందున ఆమెకు బెయిల్ నిరాకరించాలని కోరింది. ఈ స్కాంలో ఇంకా ఎవరెవరు భాగస్వామ్యులై ఉన్నారో దర్యాప్తు చేయాల్సి ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లింది.

ఎన్నికల్లో లబ్దికోసమే బీజేపీ కుట్ర...: బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు

కవిత అరెస్ట్ తో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో లబ్దిపొందాలని బీజేపీ చేస్తోన్న కుట్రలు రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నాయని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. నిరపరాధిగా కవిత బయటకు వస్తారని చెప్పారు. కవితను జైలుకు తరలించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ఇలాంటి వాటికి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడదన్నారు. ఉద్యమ పార్టీకి ఇవన్నీ కొత్త కాదని, రాష్ట్ర పోరాటంలో అరెస్టై జైల్‌కు వెళ్లిన చరిత్ర ఉందన్నారు. తమకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉందని చెప్పారు. ఎమ్మెల్సీ కవిత కడిగిన ముత్యం లాగా బయటకు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఢిల్లీ మద్యం కుంభకోణం నిందితులు బీజేపీలో చేరుతున్నారు : కవిత

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు నుంచి తాను కడిగిన ముత్యంలా బయటకు వస్తానని కవిత అన్నారు. తాత్కాలికంగా జైలుకు పంపవచ్చు కానీ, తమ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని పేర్కొన్నారు. మంగళవారం కోర్టులో హాజరుపరిచిన సందర్భంలో కోర్టు హాల్ ప్రాంగణంలో కవిత మీడియాతో మాట్లాడారు. జై తెలంగాణ, జై కేసీఆర్ అంటూ మొదలుపెట్టారు. 'ఇది మనీలాండరింగ్ కేసు కాదు. పూర్తిగా పొలిటికల్ లాండరింగ్ కేసు. ఇది నకిలీ, తప్పుడు కేసు. ఇందులో నుంచి త్వరలోనే బయటకు వస్తా' అని అన్నారు. ఈ కేసులో ఒక నిందితుడు ఇప్పటికే బీజేపీలో చేరారన్నారు. రెండో నిందితుడు బీజేపీ నుంచి టికెట్ పొందబోతున్నారన్నారు. మూడో ముద్దాయి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీకి రూ. 50 కోట్లు ఇచ్చారని ఆరోపించారు. ఈ కేసుతో తమకే సంబంధం లేదని, అందువల్ల ఈ కేసు నుంచి తాము బయటకు వస్తామని ధీమా వ్యక్తం చేశారు.

నవతెలంగాణ

శరీర సౌందర్యం ఎంత ఉన్నా, హృదయ సౌందర్యం
లేకపోతే అదంతా వ్యర్థమే - స్వామి వివేకానంద

బుధవారం 27 మార్చి 2024
www.navatelangana.com

సంపాదకీయం

అరచేతిలోనే బూచాడు

బడిపంతులు సినిమాలో టీవీలో బూచాడున్నాడనే పాట కాదు, ఇక్కడ అరచేతిలోని సెల్‌ఫోన్లల్లోనే 'పెగాసస్' బూచాళ్లే కాదు, స్థానిక బూచాళ్లు నిండిపోయారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మోడీ 2001లో గుజరాత్ సీఎం అయిన తర్వాత ప్రారంభమైన 'డీప్‌స్టేట్' నమూనా నేడు దేశమంతా యథేచ్ఛగా విస్తరించింది. ఇప్పుడు మన రాష్ట్రంలో అదే హాట్‌టాపిక్. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అన్నట్టు పైకిఎన్ని తిట్లు, శాపనార్థాలు పెట్టుకున్నా మోడీ దారిలోనే గులాబీబాస్ వెళ్లారనేందుకు

ఇప్పటి ప్రధాని, అప్పటి గుజరాత్ సీఎం అయిన నరేంద్ర మోడీ తన ముఖ్యకార్యదర్శి పీకే మిశ్రా సహకారంతో ఫోన్‌ట్యాపింగ్‌ను చట్టబద్ధం చేసే వికృత ప్రక్రియకు 2003లోనే శ్రీకారం చుట్టారు. ఆ బిల్లును అప్పటి ప్రధాని వాజ్‌పెయి నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తూ, మళ్లీ గుజరాత్ అసెంబ్లీకి తిప్పిపంపారు.2008లో ప్రతిభాపాటిల్, 2015లో ప్రణబ్‌ముఖర్జీలూ వెనక్కికొట్టారు. చివరకు 2019లో రాంనాథ్ కోవింద్ చేత ఆమోదముద్ర వేయించుకుని పబ్బం గడుపుకునే పనిలో ఉన్నారు. ప్రతిపక్షనేతలు శంకర్‌సింగ్ వాఘేలా, హరేన్‌పాండ్యా లాంటి నేతల ఫోన్లు ట్యాప్ చేయడానికి ఆ బిల్లులను తెచ్చినట్టు రుజువైంది.

నిదర్శనం నేడు చర్చనీయాంశమైన ఫోన్ ట్యాపింగ్ లొల్లి.

కేంద్రంలోనీ మోడీ సర్కారు రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూనే ఉంది. తన వికృత చేష్టలను కొనసాగిస్తున్నది. రాష్ట్రంలోని గత బీఆర్ఎస్ సర్కారు తమ అధికారాన్ని శాశ్వతం చేసుకోవడానికి పాలన అడ్డంగా నడిపిందని చెప్పడానికి ఫోన్ ట్యాపింగే సాక్ష్యం. ఒకవైపు ఈడీ, ఐటీ, సీబీఐని ఉసిగొల్పి మోడీ, ఫోన్‌ట్యాపింగ్ ద్వారా కేసీఆర్ ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయని చెప్పడానికి ప్రస్తుతం దేశం, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలే నిదర్శనం. రాజ్యంలో పరిపాలనను సక్రమంగా అందించడానికి, శాంతిభద్రతలు కాపాడటానికి పోలీసులు, సైన్యం తదితర రాజ్యాంగ వ్యవస్థలు కావాల్సి రావచ్చు. అయితే వీటిని స్వార్థ రాజకీయాల కోసం దుర్వినియోగం చేయడం ప్రజాస్వామ్య భారతంలో పరిపాటైంది. సాధారణంగా శాంతిభద్రతల కోసం, తమ పరిపాలన ఎలా ఉందో తెలుసుకోవడం, ప్రజలు ఏమీ కోరుకుంటున్నారో అంచనా వేయడం కోసం ఇంటెలిజెన్స్ వ్యవస్థ(నిఘా)ను వాడుకుంటారు.ఆ సంగతి వదిలేసి ప్రతిపక్షాలు, హక్కుల సంస్థల ప్రతినిధులు, మేధావులు, జర్నలిస్టులను టార్గెట్ చేస్తున్నాయి. జైల్లో పెట్టి పైశాచికానందాన్ని పొందుతున్నాయి. దేశాన్ని సరైన దిశగా నడిపించే చేతగాక తప్పుడు విధానాలు, అణచివేత



చర్యలకు పాల్పడుతున్నాయి. అందుకే ప్రజల్లో నుంచి నిరసన, ఆందోళన గొంతుకలు ఉవ్వెత్తున లేస్తున్నాయి.

నేడు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ఢిల్లీ, జార్ఖండ్ ముఖ్యమంత్రులపైకి ఈడీ, ఐటీ, సీబీఐని ఉసిగొల్పింది. ఇతర బీజేపీయేతర రాష్ట్రాల్లో అడ్డంపెట్టుకుని ఇబ్బందుల పాల్జేసేందుకు నిరంతరం మోడీ సర్కారు ప్రయత్నిస్తూనే ఉంది. తెలంగాణ అందుకు మినహాయింపు కాదు. గత పదేండ్ల బీఆర్ఎస్ ఏలుబడిలో ఫోన్ ట్యాపింగ్ జోరుగానే సాగింది. ప్రణీత్‌రావు అరెస్ట్, రక్షకులే భక్షకుల వుతున్న వైనాన్ని తేల్చిచెప్పింది. సామాన్య ప్రజల ఆవేదన, ఆక్రందన వినేవారేరి!? ఏ తప్పుచేయకున్నా వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబాను ఏండ్ల తరబడి జైల్లో వేసిన ఘనత మోడీ సర్కారుదే కదా. ఇప్పటి ప్రధాని, అప్పటి గుజరాత్ సీఎం అయిన నరేంద్ర మోడీ తన ముఖ్యకార్యదర్శి పీకే మిశ్రా సహకారంతో ఫోన్‌ట్యాపింగ్‌ను చట్టబద్ధం చేసే వికృత ప్రక్రియకు 2003లోనే శ్రీకారం చుట్టారు. ఆ బిల్లును అప్పటి ప్రధాని వాజ్‌పెయి నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తూ, మళ్లీ గుజరాత్ అసెంబ్లీకి తిప్పిపంపారు. 2008లో ప్రతిభాపాటిల్, 2015లో ప్రణబ్‌ముఖర్జీలూ వెనక్కికొట్టారు. చివరకు 2019లో రాంనాథ్ కోవింద్ చేత ఆమోదముద్ర వేయించుకుని పబ్బం గడుపుకునే పనిలో ఉన్నారు. ప్రతిపక్షనేతలు శంకర్‌సింగ్ వాఘేలా, హరేన్‌పాండ్యా లాంటి నేతల ఫోన్లు ట్యాప్ చేయడానికి ఆ బిల్లులను తెచ్చినట్టు రుజువైంది.

బీఆర్ఎస్ పాలనలో అప్పటి ప్రతిపక్ష నేత, ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డితోపాటు సెలెబ్రిటీలు, వ్యాపారులు, జర్నలిస్టుల తదితర ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేయడం సహించరానిది. సీఎం ఇంటికి 300 మీటర్ల దూరంలో నిఘా డెన్‌ను నడపడం కూడా దుర్మార్గం.

వ్యక్తిత్వాలను మంటగలిపి, కుటుంబాలను రోడ్డుకీడ్చే పనులుచేసే రాజకీయ నేతలు, పోలీసు అధికారులను న్యాయస్థానాల బోనులో నిలబెట్టాల్సిందే. అక్రమార్కుల సొమ్ముతో హవాలా రాజ్యాలను నడిపే హక్కు అటు కేంద్రానికి, ఇటు రాష్ట్రానికి లేదు. అసలు ఫోన్ ట్యాపింగ్ చేయాలంటే కేంద్రం అనుమతి తప్పనిసరి. బీఆర్ఎస్ సర్కారుకు మోడీ ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇచ్చిందా? లేక లోపాయకారి ఒప్పందం మేరకు ఇద్దరూ కలిసే చేశారా? అలా కాకపోతే ఇజ్రాయిల్ నుంచి ఆధునిక పరికరాలను ప్రభాకర్‌రావు అండ్ కంపెనీ ఎలా తెచ్చారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. వ్యక్తిగత స్వేచ్ఛ అనేది రాజ్యాంగం సాకారం చేసిన ప్రాథమిక హక్కు. ఆ హక్కుకు భంగం కలిగితే, నేరుగా తమ మెట్లు ఎక్కొచ్చంటూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు అందరి మదిలో ఉండాలి. ఫోన్‌ట్యాపింగ్‌కు బాధ్యులైన ఎస్ఐబీ మాజీ చీఫ్‌తో సహా నిందితులందరినీ కోర్టుకీడ్చి చట్టప్రకారం శిక్షించాల్సిందే.

మాదక ద్రవ్యాలకు మార్కెట్‌గా మారిన భారత్?



ఎం కోటేశ్వరరావు
8331013288

బ్రెజిల్ నుంచి విశాఖ రేవుకు భారీ మొత్తంలో ఒక కంటెయినర్‌లో వచ్చిన మాదక ద్రవ్యాల గురించి ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు పెద్ద చర్చ జరుగుతోంది. సంధ్య ఆక్వా కంపెనీ చిరునామాతో వచ్చిన వాటి మార్కెట్ విలువ యాభై వేల నుంచి లక్ష కోట్ల రూపా యల వరకు ఉంటుందని చెబుతున్నారు. ఆక్వా మేత తయారీకి అవసరమైన పొడి ఈస్టు(పులియపెట్టేందుకు అవసరమైన శిలీంధ్రము)ను తెప్పించామే తప్ప దానిలో మాదక ద్రవ్యాల గురించి తమకు తెలియదని సదరు కంపెనీ చెబుతోంది. దీని వెనుక టీడీపీ, వైసీపీ, బీజేపీ నేతలు కంపెనీ యజమానులతో సంబంధాల గురించి పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. బ్రెజిల్ ఎన్నికల్లో లూలా గెలిచినపుడు వైసీపీ పక్ష నేతగా అభినందనలు పంపానే తప్ప వేరే సంబంధాలేవీ లేవని విజయసాయిరెడ్డి ప్రకటించుకున్నారు. సాక్షి పత్రిక వెలువరించిన కథనం తన

బ్రెజిల్‌లో ఇలాంటి ముఠాలను అడ్డుకొనేందుకు, రవాణా నిరోధానికి లూలా ప్రభుత్వం త్రివిధ దళాల నుంచి వేలాది మిలిటరీ, ఇతర భద్రతా సిబ్బందిని రేవులు, విమానాశ్రయాల్లో నియమించాల్సి వచ్చిందంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. 2023 నవంబరులో ప్రారంభించిన వేట ఈ ఏడాది మే నెల వరకు జరుగుతుందని లూలా ప్రకటించారు. దీన్ని అడ్డుకొనేందుకు మాఫియా గ్యాంగులు అనేక బస్సులు, ఒక రైలును దగ్ధం చేశాయి. అనేక నగరాల్లో ఈ శక్తుల ఆధీనంలో ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వ యంత్రాంగం పనిచేయలేని స్థితి ఉంది. ఒక వైపు ఈ ముఠాలతో చేతులు కలిపిన రాజకీయ ప్రత్యర్థులు, మరోవైపు ఈ గ్యాంగ్‌లను ఎదుర్కొనేందుకు లూలా పని చేయాల్సి వస్తోంది. ఈ అణచివేత కారణంగానే బ్రెజిల్ నుంచి విశాఖకు డ్రగ్స్ తరలించి ఉండవచ్చు.

ప్రతిష్ఠకు భంగం కలిగించినందున రూ.20కోట్లకు దావా వేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి ప్రకటించారు.వివరాలు పూర్తిగా తెలియకముందే చంద్రబాబు, లోకేష్ ముందుగానే స్పందించారంటే వారికి ముందే తెలుసు అన్నట్లుగా వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. విశాఖ రేవులో రాష్ట్ర అధికారులు సిబిఐకి సహకరించలేదనే విమర్శలు వచ్చాయి. వైసీపీ నేత అభినందనలు తెలిపారంటే మాదక ద్రవ్యాలతో లూలాకూ సంబంధం ఉండవచ్చనే అనుమానాలు కలిగే విధంగా కొన్ని పత్రికల్లో రాతలున్నాయి.

ప్రపంచాన్ని వేధిస్తున్న ప్రధాన సమస్యల్లో మాదక ద్రవ్యాల తయారీ, సరఫరా ఒకటి. లాటిన్ అమెరికాలో ముఠాలు అక్కడి ప్రభుత్వాల కూల్చివేతకు, ప్రజాస్వామ్యానికే ముప్పుగా ఈ ముఠాలు పరిణమించాయి. మనదేశ భద్రతకూ ప్రమాదం వస్తున్నదని అనేక మంది హెచ్చరిస్తున్నారు. గతంలో మనదేశం మాదకద్రవ్యాల సరఫరా మార్పిడి కేంద్రంగా ఉండగా ఇప్పుడు ఒక పెద్ద మార్కెట్‌గా కూడా రూపొందినట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే ఇటీవలి ఏండ్లలోభారీ మొత్తాలలో పట్టుబడు తున్నాయి. గతేడాది పాకిస్థాన్ నుంచి వచ్చిన రూ. 25వేల కోట్ల విలువగల మాదక ద్రవ్యాలను మన అధికారులు పట్టుకున్నారు. అంతకుముందు గుజరాత్‌లోని ముంద్రా రేవుకు వచ్చిన 21వేల విలువగల మూడువేల కిలోల మాదక ద్రవ్యాలను పట్టుకున్న అంశం తెలిసిందే. రవాణా జరుగుతున్నవాటిలో పట్టుకుంటున్న మొత్తాలు స్వల్పమే అన్న సంగతి తెలిసిందే.గతేడాది 650బిలియన్ డాలర్ల విలువ గల లావాదేవీలు జరిగినట్లు అంచనా. చట్టవిరుద్ధమైన ప్రపంచ ఆర్థిక కార్యకలాపాల్లో 30శాతమని అంచనా. మాదక ద్రవ్యాల ముఠాలు మనదేశంపై కేంద్రీకరి స్తున్నట్లు పట్టుబడుతున్న ఉదంతాలు వెల్లడిస్తున్నా యి. లాటిన్ అమెరికా దేశాల సంఘటిత ముఠాలు ఆసియా, అందులోనూ మనదేశం మీద కేంద్రీకరించటానికి కారణం నడమంత్రపు సిరి వచ్చిన కుటుంబాలు, వారి సంపదలు పెరగటంతో పాటు మాదక ద్రవ్యాల వాడకం కూడా పెరుగు తున్నది. అమెరికా, ఇతర ధనిక దేశాలలో వీటి వినియోగం గరిష్ట స్థాయికి చేరి మార్కెట్ పెరగకపోవటం, సింథటిక్ డ్రగ్స్‌కు ప్రాధాన్యత ఇవ్వటం వంటి కారణాలతో కొత్త మార్కెట్ల వేటలో మనదేశం మీద కేంద్రీకరించారు. కొకెయిన్ తయారీకి అవసరమైన కోకా ఉత్పత్తి, దిగుబడి ఇటీవలి కాలంలో లాటిన్ అమెరికాలో విపరీతంగా పెరిగింది.కొత్త ప్రాంతాలు, దేశాలకు అది విస్తరించింది. మార్కెట్‌లో పోటీ, సరఫరాకు కొత్త మార్గాలను వెతుకుతున్నారు.



మాదక ద్రవ్యాల మాఫియా కుట్రలకు బలైన వారిలో ప్రస్తుత బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డిసిల్వా ఒకరు. లాటిన్ అమెరికాలో అనేకమంది రాజకీయ నేతలూ, మాఫియా డాన్లకు పెద్దతేడా కనపడదు. అనేక దేశాల్లో వీరు ప్రజాస్వామిక, వామపక్ష నేతల సారథ్యంలో ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చివేయటం, అనేకమంది నేతల అపహరణ, హత్యల్లో భాగస్వాములు. బ్రెజిల్, మెక్సికో మాదక ద్రవ్య మాఫియాలకు పెట్టింది పేరు. వారు మిలిటరీతో సహా అన్ని రంగాలలో ప్రవేశించారు. అనేక దేశాల పాలకులను తెరవెనుక ఉండి నడిపించేది వారే.వామపక్ష ఉద్యమాలను అడ్డుకొనేందుకు అమెరికా ఇలాంటి శక్తులకు పూర్తి మద్దతు, అవసరమైన మారణాయుధాలను అందిస్తోంది. వారిని ప్రజాస్వామిక పరిరక్షకులుగా చిత్రిస్తోంది. బ్రెజిల్‌లో ఇలాంటి ముఠాలను అడ్డుకొనేందుకు, రవాణా నిరోధానికి లూలా ప్రభుత్వం త్రివిధ దళాల నుంచి వేలాది మిలిటరీ, ఇతర భద్రతా సిబ్బందిని రేవులు, విమానాశ్రయాల్లో నియమించాల్సి వచ్చిందంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. 2023 నవంబరులో ప్రారంభించిన వేట ఈ ఏడాది మే నెల వరకు జరుగుతుందని లూలా ప్రకటించారు. దీన్ని అడ్డుకొనేందుకు మాఫియా గ్యాంగులు అనేక బస్సులు, ఒక రైలును దగ్ధం చేశాయి. అనేక నగరాల్లో ఈ శక్తుల ఆధీనంలో ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వ యంత్రాంగం పనిచేయలేని స్థితి ఉంది. ఒక వైపు ఈ ముఠాలతో చేతులు కలిపిన రాజకీయ ప్రత్యర్థులు, మరోవైపు ఈ గ్యాంగ్‌లను ఎదుర్కొనేందుకు లూలా పని చేయాల్సి వస్తోంది. ఈ అణచివేత కారణంగానే బ్రెజిల్ నుంచి విశాఖకు డ్రగ్స్ తరలించి ఉండవచ్చు.

కరోనా మహమ్మారి తగ్గుముఖం పట్టిన తరువాత మాదక ద్రవ్యాల రవాణా విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా కొకెయిన్ పెద్ద ఎత్తున సరఫరా అవుతోంది. ఒక టన్ను ఆకు బొలీవియా వంటి చోట్ల వెయ్యి డాలర్లకు దొరికితే ఐరోపా రేవుల్లో 35వేల డాలర్లు పలుకుతోంది. అది వినియోగదారుల వద్దకు వచ్చేసరికి మరికొన్ని రెట్లు అవుతుంది. కోకా ఆకుల ఉత్పత్తి ప్రపంచ కేంద్రంగా లాటిన్ అమెరికా ఉంది. మిగతా వాటి ఉత్పత్తి కూడా ఎక్కువే. గతంలో కరీబియన్ ప్రాంతం నుంచి రవాణా జరిగితే ఇప్పుడు బ్రెజిల్ నుంచి ఎక్కువగా ఉంది. వంద సంవత్సరాల క్రితమే వీటిపై నిషేధం పెట్టినప్పటికీ పెరుగుతోంది తప్ప తగ్గటం లేదు. డ్రగ్స్ ముఠాలతో పాటు వారికి అవసరమైన ఆయుధాలను అందచేసే పరిశ్రమలు కూడా పెద్ద ఎత్తున లబ్దిపొందుతున్నాయి. ప్రస్తుతం మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, సరఫరా అన్నీ వికేంద్రీకరణ కావటంతో ఎక్కడైనా పట్టుబడిన వారు తప్పితే మిగతా నేరగాండ్లు తప్పించుకుంటున్నారు. బ్రెజిల్ అధ్యక్షుడిగా పనిచేసిన పచ్చి మితవాది జైర్ బోల్సనారో మాదక ద్రవ్యాల మాఫియాల సంబంధాలు జగమెరిగిన సత్యం. బోల్సనారో మీదే ప్రస్తుత వామపక్ష అధ్యక్షుడు లూలా గెలిచాడు. బోల్సనారో ఏలుబడిలో రియో నగర శివార్లలో మాఫియా ముఠాలు పదిహేడు లక్షల మంది నివసించే బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్ నగరమంతటి ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకున్నట్లు విశ్లేషకులు వెల్లడిం చారు. అక్కడ వారే సర్వస్వం. ఇలాంటి వారు ప్రజాస్వామ్యానికి ముప్పు అని వేరే చెప్పనవసరం లేదు. ఇలాంటి గ్యాంగుల ఉన్నందునే నేరాలు అదుపులో ఉంటున్నట్లు గతంలో బోల్సనారో బహిరంగంగా ప్రశంసలు కురింపిం చాడు. తుపాకులపై ఉన్న ఆంక్షలు తొలగించి వాటిని సులభంగా కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించాడు.

మూడు దశాబ్దాల క్రితం 1993లో బ్రెజిల్ సావోపాలో నగర జైల్లో నేరగాండ్ల మధ్య కొట్లాట జరిగింది. కారణమేమిటంటే ఫస్ట్ కాపిటల్ కమాండ్ అనే కొత్త మాఫియా ఏర్పడటమే. ఇప్పుడది లాటిన్ అమెరికాలో, ప్రపంచంలో అతిపెద్ద ముఠాగా ఎదిగింది.దానిలో నలభైవేల మంది జీవితకాల సభ్యులు, మరో అరవై వేల మంది దానితో సంబంధాలు కలిగి ఉన్నారు. వారు వివిధ దేశాల్లో విస్తరించారు.పోర్చుగల్ రాజధాని లిస్బన్ నగరంలోని జైళ్లలో ఈ ముఠాకు చెందిన వెయ్యి మంది ఉన్నారని అక్కడి అధికారులే గతేడాది వెల్లడించారు.ఈ ముఠా నైజీరియాలో కూడా పెద్దఎత్తున విస్తరించింది. మన దేశంలో అనేక మంది నైజీరియన్లు మాదకద్రవ్యాలతో పట్టుబడుతున్న సంగతి తెలిసిందే.కొందరు చెబుతున్న దాన్ని బట్టి ఒక నైజీరియన్ మనదేశంలో డ్రగ్‌మాఫియాను అదుపు చేస్తున్నట్లు వార్తలు. ప్రపంచంలో చీమ చిటుక్కుమన్నా పసిగట్టే శక్తి అమెరికా సిఐఎ, ఎఫ్‌బిఐలకు ఉందని చెబుతారు. పక్కనే ఉన్న మెక్సికో నుంచి వస్తున్న మాదకద్రవ్యాలను ఎందుకు అరికట్టలేక పోతోందన్నది ప్రశ్న. నిజానికి చేతగాక కాదు. ఆ ముఠాలతో అమెరికాలో ఉన్నవారికి ఉన్న లావాదేవీలే కారణం. అక్రమంగా ప్రవేశించేవారితో అమెరికాలోని పరిశ్రమలు, వ్యవసాయ క్షేత్రాలలో చౌకగా పనిచేయించుకుంటారు. మాదక ద్రవ్యాలను తెప్పించు కుంటారు. అమెరికా-మెక్సికో సరిహద్దులో డ్రగ్ మాఫియాదే రాజ్యం. వారికి తెలియకుండా అక్రమంగా ప్రవేశించేవారు ఉండరు. అక్కడి నుంచి మాదకద్రవ్యాల సరఫరా జరుగుతుంది. ఫెంటానిల్ అనే మత్తు పదార్ధం ఒక బిళ్ల తయారీకి పది సెంట్లు ఖర్చు అవుతుంది. దాన్ని ఔషధం పేరుతో నకిలీ మందుల చీటీలను సృష్టించి కొనుగోలు చేసి పది నుంచి 30 డాలర్ల వంతున అమ్ముతారు. పదికిలోల ఫెంటానిల్ 50వేల డాలర్లకు దొరికితే దాన్ని రెండు కోట్ల డాలర్లకు విక్రయిస్తారు. అమెరికాలో దీన్ని వాడి 2022లో లక్ష తొమ్మిదివేల మంది మరణించినట్లు నమోదైంది.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ దాన్ని ఆసరా చేసుకొని ఇష్టంలేని ప్రభుత్వాలను కూల్చేందుకు, ప్రజా ఉద్యమాలను దెబ్బతీసేందుకు ముఠాలను అనేక దేశాల్లో అమెరికా ప్రోత్సహించింది. చివరికి అవి ఏకుమేకైనట్లుగా సంఘటిత ముఠాలుగా ఏర్పడి దేశాలనే శాసించే స్థితికి చేరాయి.తమలో తాము ఘర్షణ పడకుండా ఎవరి ప్రాంతంలో వారు దందా చేసుకొనేందుకు స్వతంత్ర (కార్టెల్స్) సంస్థలను ఏర్పాటు చేసుకొనే స్థాయికి ఎదిగాయి.అమెరికాలో తొలిసారి 1968లో అధ్యక్షుడిగా గెలిచిన రిచర్డ్ నిక్సన్ విధిలేని పరిస్థితిలో మాదక ద్రవ్యాలు పౌరుల తొలిశత్రువు అని ప్రకటించాడు. అప్పటికే హెరాయిన్, మార్జువానా అమెరికాలో విపరీతంగా పెరిగి, కొకెయిన్ రంగంలోకి వచ్చింది. మార్కెట్ ఎంతో లాభసాటిగా ఉండటంతో కార్టెల్స్‌కు శ్రీకారం చుట్టారు. ఇవి

అమెరికాలో తొలిసారి 1968లో అధ్యక్షుడిగా గెలిచిన రిచర్డ్ నిక్సన్ విధిలేని పరిస్థితిలో మాదక ద్రవ్యాలు పౌరుల తొలిశత్రువు అని ప్రకటించాడు. అప్పటికే హెరాయిన్, మార్జువానా అమెరికాలో విపరీతంగా పెరిగి, కొకెయిన్ రంగంలోకి వచ్చింది. మార్కెట్ ఎంతో లాభసాటిగా ఉండటంతో కార్టెల్స్‌కు శ్రీకారం చుట్టారు. ఇవి ఎంతగా ఎదిగాయంటే కరీబియన్ ప్రాంతంలో కొన్ని దీవులను కొనుగోలు చేసి అక్కడ ఆధునిక ప్రయోగశాలలను ఏర్పాటు చేసి సరకు రవాణాకు విమానాలను కూడా కొనుగోలు చేశాయి. అలాంటి సంస్థలలో విబేధాలు తలెత్తి మార్కెట్ ఆక్రమణకు కొత్త సంస్థలను ఉనికిలోకి తెచ్చారు. ప్రత్యర్థులను అంతం చేసేందుకు సాయుధ ముఠాలనూ రంగంలోకి తెచ్చారు. మాదక ద్రవ్యాల వ్యాపారం లాభసాటిగా ఉండటంతో ఉగ్రవాద సంస్థలు ఆ వైపు మళ్లాయి. అందువలన అవిచేసే కార్యకలాపాలను నార్కో టెర్రరిజం అని పిలుస్తున్నారు.

ఎంతగా ఎదిగాయంటే కరీబియన్ ప్రాంతంలో కొన్ని దీవులను కొనుగోలు చేసి అక్కడ ఆధునిక ప్రయోగశాలలను ఏర్పాటు చేసి సరకు రవాణాకు విమానాలను కూడా కొనుగోలు చేశాయి. అలాంటి సంస్థలలో విబేధాలు తలెత్తి మార్కెట్ ఆక్రమణకు కొత్త సంస్థలను ఉనికిలోకి తెచ్చారు. ప్రత్యర్థులను అంతం చేసేందుకు సాయుధ ముఠాలనూ రంగంలోకి తెచ్చారు. మాదక ద్రవ్యాల వ్యాపారం లాభసాటిగా ఉండటంతో ఉగ్రవాద సంస్థలు ఆ వైపు మళ్లాయి. అందువలన అవిచేసే కార్యకలాపాలను నార్కో టెర్రరిజం అని పిలుస్తున్నారు. ఆఫ్ఘనిస్తాన్ పాలకుల కోరిక మేరకు జోక్యం చేసుకున్న సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా అక్కడ తాలిబాన్లను ప్రోత్సహించిన అమెరికా వారి చేత మాదక ద్రవ్యాలను కూడా ప్రోత్సహించింది. తరువాత వారే అమెరికాకు వ్యతిరేకంగా మారిన సంగతి తెలిసిందే.



జీవితమే ఒక నాటకరంగం

కావ్యేషు నాటకం రమ్యమ్..
పండితుడు పామరుడు భేదం లేని
తాదాత్మ్యతనందించే
అద్భుత ప్రక్రియ
హావభావ ప్రకటనల
స్థలం రంగస్థలం
అది మాట్లాడితే కావ్యాలు మనసు
రంగస్థలంలో శాశ్వతాలై పోతాయి
జీవిత సత్యాలు విచ్చుకొంటాయి
నిజానిజాలతో కండ్లు
తెరుచుకొంటాయి


రంగులు పులిమి రంగస్థలం తెరిస్తే
బాధలన్నీ ముఖాల వెనకే దాచుకున్న
స్వంత ముఖం లేని బహుముఖాలు
ధరించిన ఆహార్యానికి అనుగుణంగా
ఆంగికం అభినయం వాచకం..
అలవోకగా వొలికించే కళాకారులు
చప్పట్లు తప్ప పచ్చనోట్లు ఆశించరు
నిజానికి వాళ్ళ జీవితమే ఒక నాటకం

ఆత్మానుభూతిని పొందగలిగే ప్రదర్శనే
కళాకారుడి నిజ అంతరంగ నిదర్శనం
జాతి, మత, భాష, ప్రాంతాలకు అతీతం
ధర్మార్థ కామ మోక్షాల్ని చూపే సాధనం
కండ్లముందే ఆదే మన నిత్యజీవితం!!

(నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం)

- భీమవరపు పురుషోత్తమ్
సెల్: 9949800253

బడా కార్పొరేట్ల కోసమే 'వందేభారత్'!



డి.రమేష్‌బాబు
9822684142

ప్రధాని నరేంద్రమోడీ బడా కార్పొరేట్లకు హామీలివ్వడానికి జాతి ప్రయోజనాలను తుంగలో తొక్కారు. వందే భారత్ రైళ్ల ప్రవేశం ఈ విధానాలకు అనుగుణంగానే ఉంది. దేశాభివృద్ధికి వందేభారత్ రైళ్లను నడుపుతున్నట్లు ప్రభుత్వం చేస్తున్న ప్రచారం వాస్తవాలను దాచిపెట్టి, ఎన్నికల లాభాల కోసం ప్రజలను తప్పుదారి పట్టించడమే. మార్చి 2024 నాటికి, 41 వందే భారత్ రైళ్లు వినియోగంలోకి వచ్చాయి. ఇందులో పదహారు రైళ్లు 16- బోగీల సర్వీసులు, ఇరవై ఐదు 8- బోగీల సర్వీసులు. అత్యంత ప్రచారంలో ఉన్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రభుత్వ ఉద్దేశాలను బట్టబయలు చేస్తోంది. ఇది ప్రభుత్వ పెట్టుబడులను పణంగా పెట్టి రైల్వే ఆస్తులను కార్పొరేట్‌లకు అప్పగించే లోతైన కుట్ర తప్ప మరొకటి కాదు. శతాబ్ది దూరం, రాజధాని ఎక్స్‌ప్రెస్‌లలో లభించే అదే ప్రయోజనాలతో వందేభారత్ రైళ్ల అధిక టిక్కెట్ ధరలు ప్రజాధనాన్ని దోచుకోవడమే. రైలువేగాన్ని సాధించడం కోచ్‌ల నిర్మాణం ద్వారా కాదు, కానీ ఈ రైళ్లకు లైన్‌క్లియర్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా జరుగుతుంది. దేశం నిజమైన అభివృద్ధి కోసం గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ నడిచే ప్యాసింజర్ రైళ్లను వందే భారత్ రైళ్ల వేగాన్ని పొందడానికి రద్దు చేయడం వాస్తవం.

ఆత్మనిర్భర్ గురించి మోడీ వాగ్దానంలోని వాస్తవమెంత?

స్వావలంబనతో కూడిన భారతదేశాన్ని నిర్ధారించడంలో మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం వైఫల్యం అనేక విధాలుగా బహిర్గతం చేయబడింది. మోడీ ఆత్మ-నిర్భర్ భారత్ కాంట్రాక్ట్ సిబ్బందిని నిరంతర దోపిడీకి గురిచేస్తోంది. ఇది కార్పొరేట్ల ప్రయోజనాలకనుగుణంగా స్వదేశీ తయారీ యూనిట్లను నిర్వీర్యం చేయడాన్ని మరింత బహిర్గ తం చేస్తోంది. భారతీయ రైల్వే కోచ్‌ల సేకరణ ప్రక్రియలో ఇటీవలి పరిణామాలు ప్రభుత్వం, కార్పొరేట్‌ల మధ్య అనుబంధాన్ని రుజువు చేస్తున్నాయి. ఏప్రిల్ 2022లో, భారతీయ రైల్వేలు రూ.26వేల కోట్ల అంచనా వ్యయంతో 200 వందే భారత్ ట్రెన్‌సెట్‌ల రూపకల్పన, తయారీకి టెండర్లు జారీ చేసింది. ఈ అంచనాలో ఉత్పత్తి ఖర్చులు మా త్రమే కాకుండా, రైళ్ల తయారీకి ప్రతిపాదించబడిన లాతూర్ లోని మరత్వాడా రైల్‌కోచ్ ఫ్యాక్టరీ, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ పెరంబూర్‌లో మౌలిక సదు పాయాల నవీకరణలు కూడా ఉన్నాయి. కాంట్రాక్టర్లకు 35 ఏండ్ల వ్యవధిలో వాటి నిర్వహణ కోసం అదనంగా రూ.32వేలు కోట్లు అందజేశారు.

రష్యన్ కంపెనీ టీఎంహెచ్, భారతదేశానికి చెందిన రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్‌లతో కూడిన కన్సార్టియం స్లీపర్ వేరియంట్‌లతో సహా 120 వందే భారత్ రైళ్ల ఉత్పత్తికి ఆర్డర్‌ను పొందింది. ఇది చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, కపుర్తలాలోని రైల్‌కోచ్ ఫ్యాక్టరీ, రాయ్ బరేలీలోని మోడ్రన్ కోచ్ ఫ్యాక్టరీ వంటి దేశీయ తయారీ యూనిట్లను మూసివేసే ప్రమాదం ఉంది. నైపుణ్యానికి ప్రసిద్ధి చెందిన చెన్నయ్‌లోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ గతంలో మొదటి వందే భారత్ రైళ్లను ఉత్పత్తి చేసింది. ఈ ఫ్యాక్టరీలన్నింటిలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు ప్రపంచ స్థాయి కోచ్‌లను తయారు చేయగలవు. 19వేల మంది శాశ్వత సిబ్బంది బలం, అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన, స్వదేశీ రోలింగ్ స్టాక్‌ను స్థిరంగా అందించింది. 2021-2022 ఆర్థిక సంవత్సరంలోనే, ఈ యూనిట్లు సమిష్టిగా 7,903 కోచ్‌లను తయారు చేశాయి, వాటి సాంకేతిక నైపుణ్యం, సామర్థ్యాన్ని ప్రదర్శిస్తాయి. ఈ కాంట్రాక్టు ప్రకారం ప్రభుత్వం ఆధీనంలో ఉన్న 45 మరమ్మతు వర్క్‌షాప్‌లు, 212 మెయింటెనెన్స్ డిపోలలో ప్రస్తుతం పనిచేస్తున్న 5.5 లక్షల మెకానికల్ అండ్ ఎలక్ట్రికల్ శాశ్వత సిబ్బంది జీవనోపాధి మీద తీవ్ర ప్రభావం చూపుతుంది. రానున్న కాలంలో ఈ పోస్టలను కాంట్రాక్ట్ పద్ధతిలో నింపుతారు.

ఒక సాధారణ లెక్క ప్రకారం, ఈ కాంట్రాక్ కార్మికులు వారి సేవలను కొనసాగించడానికి తమ చట్టబద్ధమైన సంపాదన నుంచి కాంట్రాక్టర్‌కు, ఒక్కొక్కరు ప్రతి నెలా రూ.పదివేలు లంచంగా తిరిగి చెల్లిస్తున్నారు. ప్రతిష్టాత్మకమైన 41 వందే భారత్ రైళ్లలో పనిచేస్తున్న 800 మంది కాంట్రాక్ట్ సర్వీస్ ప్రొవైడర్లను పరిశీలిస్తే, బడా కాంట్రాక్టర్లు దోచుకున్న ప్రజాధనం మొత్తం ఏడాదికి 9.60 కోట్లు. ఈ లెక్కన కాంట్రాక్ట్ వర్కర్స్ విధినిర్వహణ చూస్తే వాస్తవంగా రోజుకు 20 గంటలు, అంటే వందే భారత్ రైలు బయలుదేరి స్టేషన్ నుండి మరల అదే స్టేషన్‌కు తిరిగి వచ్చేదాకా విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారు. దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు "సబ్‌కా సాత్..సబ్‌కా వికాస్' కథనాలు కాం ట్రాక్ట్ సిబ్బందిని కార్పొరేట్ సంస్థ వికాస్ కోసం దోపిడీ చేయడమేనని.



నిస్సందేహంగా ఈ ఆత్మనిర్భర్ భారతదేశాన్ని నాశనం చేస్తుంది.నిరుద్యోగ యువతకు సురక్షిత మైన ఉపాధి అవకాశాలను అందించాలనే జాతీయ ఆవశ్యకతను దెబ్బతీస్తుంది..

సబ్‌కా సాత్..సబ్‌కా వికాస్ హామీ ఎక్కడ?

'సబ్‌కా సాత్..సబ్‌కా వికాస్' అనే నినాదంతో మోడీ మొత్తం 41 రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. మోడీ కంటి ఎదురుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస జీతాలు, 8 గంటల పని, ఓటి చెల్లింపు, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు దొరకటం లేదు. మరెందుకు జోక్యం చేసుకోవటం లేదు. వందే భారత్ రైళ్లలో ప్రాథమిక సేవలందించడానికి బాధ్యత వహించే వ్యక్తుల దోపిడీకి దారితీసే కాంట్రాక్ట్ మీద ఎందుకు మౌనం వహిస్తున్నాడు? కాంట్రాక్టు నిర్మాణాల అమానవీయ పనులను రద్దు చేస్తామని, కాంట్రాక్టు కార్మికులకు ఆయన ఎందుకు హామీ ఇవ్వరు? వారు రోజుకు 20 గంటలకు పైగా పనిచేస్తారు. వందే భారత్ చుట్టూ జరుగుతున్న అత్యున్నత ప్రచారం అనేక వాస్తవాలను దాచిపెడుతోంది. కాంట్రాక్ట్ ఒప్పందం ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులు కనీస వేతనాలు, బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర సామాజిక ప్రయోజ నాల వంటి ప్రస్తుత కార్మిక చట్టాల ప్రకారం పొందా లి. అయితే, కాంట్రాక్టర్లు కుదుర్చుకున్న ఒప్పందాన్ని పాటించకపోవడం, వాటిని పరిష్కరిం చడంలో రైల్వేలేబర్ అధికారులు ఎటువంటి బాధ్యత లేకుండా మౌనం వహించడం జరుగుతున్న వాస్తవం.

ఒక సాధారణ లెక్క ప్రకారం, ఈ కాంట్రాక్ కార్మికులు వారి సేవలను కొనసాగించడానికి తమ చట్టబద్ధమైన సంపాదన నుంచి కాంట్రాక్టర్‌కు, ఒక్కొక్కరు ప్రతి నెలా రూ.పదివేలు లంచంగా తిరిగి చెల్లిస్తున్నారు. ప్రతిష్టాత్మకమైన 41 వందే భారత్ రైళ్లలో పనిచేస్తున్న 800 మంది కాంట్రాక్ట్ సర్వీస్ ప్రొవైడర్లను పరిశీలిస్తే, బడా కాంట్రాక్టర్లు దోచుకున్న ప్రజాధనం మొత్తం ఏడాదికి 9.60 కోట్లు. ఈ లెక్కన కాంట్రాక్ట్ వర్కర్స్ విధినిర్వహణ చూస్తే వాస్తవంగా రోజుకు 20 గంటలు, అంటే వందే భారత్ రైలు బయలుదేరి స్టేషన్ నుండి మరల అదే స్టేషన్‌కు తిరిగి వచ్చేదాకా విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారు. దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు "సబ్‌కా సాత్..సబ్‌కా వికాస్' కథనాలు కాం ట్రాక్ట్ సిబ్బందిని కార్పొరేట్ సంస్థ వికాస్ కోసం దోపిడీ చేయడమేనని. దీని కోసం మోడీ నాయకత్వంలోని ప్రభుత్వం కాంట్రాక్ట్ సిబ్బందితో శాశ్వత సిబ్బందిని తొలగించే విధానా లను రూపొందిస్తోంది. మొత్తం రైల్వే వ్యవస్థలో దాదాపు ఐదు లక్షల మంది కాంట్రాక్టు కార్మికులు సేవలందించే బాధ్యతలను నిర్వహిస్తున్నారు. వేల కోట్ల రూపాయల ప్రజాధనం ఎలాంటి తనిఖీలు లేకుండానే కార్పొరేట్ సంస్థలకు బదిలీ చేయబడిం దని ఇది రుజువు చేస్తోంది. ఇలాంటి అభివృద్ధి దేశ శ్రేయస్సు కోసం కాదని మనం ఇప్పుడు గ్రహించాలి.

సురక్షిత ఉద్యోగాల కల్పన, ఉత్పాదక యూనిట్లను బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాలను పట్టణ ప్రాంతాలతో అనుసంధానం చేయడం, ఛార్జీలు, సీని యర్ సిటిజన్లు, విద్యార్థులు, ఇతర బలహీన వర్గాలకు రాయితీలు కల్పించడం ద్వారా రైల్వేలను బలోపేతం చేయడం ద్వారా దేశం అభివృద్ధి చెందుతుంది. రైల్వేలను పరిరక్షించడం, యువత రానికి సురక్షితమైన ఉపాధి అవకాశాలను సృష్టించడం, ప్రభుత్వ ఆస్తులను కాపాడటం, జాతీయ స్వావలంబనను పెంపొందించడం, వంటి వాటికి ప్రాధాన్యతనివ్వని సర్కార్‌ని ఎంత తొందరగా వదిలించుకుంటే అంత మంచిది.

ప్రజాధనంతో నిర్మించిన లాభదాయకమైన జాతీయ ఆస్తులను అప్పగించడం ద్వారా కార్పొరేట్లకు భారీ లాభాలను ఆర్జించాలని ఇది ఉద్దేశించబడింది.

ఈ వ్యూహం దేశ సంక్షేమానికి హాని కలిగించడమే కాకుండా అభివృద్ధి ముసుగులో చేసే ఈ మతక ప్రచారం దేశ సంక్షేమం కోసం కాదని, కేవలం రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం కోసమేనని కూడా ప్రజలు గ్రహించాలి. సురక్షిత ఉద్యోగాల కల్పన, ఉత్పాదక యూనిట్లను బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాలను పట్టణ ప్రాంతాలతో అనుసంధానం చేయడం, ఛార్జీలు, సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, ఇతర బలహీన వర్గాలకు రాయితీలు కల్పించడం ద్వారా రైల్వేలను బలోపేతం చేయడం ద్వారా దేశం అభివృద్ధి చెందుతుంది. రైల్వేలను పరిరక్షించడం, యువతరానికి సురక్షితమైన ఉపాధి అవకాశాలను సృష్టించడం, ప్రభుత్వ ఆస్తులను కాపాడటం, జాతీయ స్వావలంబనను పెంపొందించడం, వంటి వాటికి ప్రాధాన్యతనివ్వని సర్కార్‌ని ఎంత తొందరగా వదిలించుకుంటే అంత మంచిది.

హైకోర్టు జడ్జిగా జస్టిస్ సుజోయ్ పాల్ ప్రమాణం

నవతెలంగాణ -హైదరాబాద్

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుజోయ్ పాల్‌తో మంగళవారం హైకోర్టు ఫస్ట్ కోర్టు హాల్లో చీఫ్ జస్టిస్ అలోక్ ఆరథే ప్రమాణ స్వీకారం చేయించారు. మధ్యప్రదేశ్ హైకోర్టు నుంచి జస్టిస్ సుజోయ్ పాల్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. 1090లో లాయర్‌గా ఎన్‌రోల్ అయిన ఆయన అదే మధ్యప్రదేశ్ హైకోర్టుకు 2011 మే 27న న్యాయమూర్తి అయ్యారు. జస్టిస్ సుజోయ్ పాల్ పదవీ స్వీకరణోత్సవానికి హైకోర్టు న్యాయమూర్తులు, ఏజీ, బార్ కౌన్సిల్ చైర్మెన్, అదనపు సొలిసిటర్ జనరల్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, జస్టిస్ సుజోయ్ పాల్ కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఆ తర్వాత ఫస్ట్ కోర్టులో చీఫ్ జస్టిస్‌తో కలిసి జస్టిస్ సుజోయ్ పాల్ కేసుల్ని విచారించారు. ఈ నెల 28న కలకత్తా హైకోర్టు నుంచి బదిలీపై రాబోయే జస్టిస్ మౌసమీ భట్టాచార్య ప్రమాణస్వీకారం చేస్తారు.

ధాన్యానికి రూ.500 బోనస్ దక్కేనా!

(మొదటిపేజీ తరువాయి)

చెల్లించడం, రూ.2 లక్షల రుణ మాఫీ చేయడంతో పాటు ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ కూడా చెల్లిస్తామని చెప్పిన మాట మీద ప్రభుత్వం నిలబడాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటి వరకు ఇచ్చిన హామీల్లో కొన్ని మాత్రమే అమలయ్యాయి. రైతు భరోసా సాయం పెంచుతామని చెప్పిన ప్రభుత్వం పాత పద్ధతిలోనే సాయం చేసింది. రూ.2 లక్షల రుణమాఫీ ప్రక్రియ అమలుకాలేదు. కనీసం తక్కువ భారంపడే బోనస్ చెల్లించే విషయంలోనైనా నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను నెపంగా చూపి రైతులకు బోనస్ అందని ద్రాక్ష చేయడం సరైంది కాదని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి.

బోనస్ ఇవ్వకపోతే తీవ్రంగా నష్టపోనున్న రైతులు

రైతుల నుంచి సేకరించే ధాన్యానికి కేంద్రం ప్రకటించిన కనీస మద్ధతు ధర (ఎంఎస్‌పీ) చెల్లిస్తారు. ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2183 ఎంఎస్‌పీ ఉంది. కేంద్రం ప్రకటించిన మద్ధతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను కలిపి రైతులకు చెల్లించాలి. రాష్ట్రంలో 2023-24 యాసంగి సీజన్‌లో 66.70 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయాలని పౌరసరఫరాల సంస్థ లక్ష్యంగా నిర్దేశించింది. అయితే గతేడాది యాసంగి కంటే ఈ సీజన్‌లో ధాన్యం దిగుబడులు తక్కువ వచ్చే అవకాశముందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. గతేడాది యాసంగిలో 66.85 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఎందుకంటే ఈ సీజన్‌లో నీటి ఎద్దడి సమస్య తలెత్తి సాగు చేసిన వరి పైర్లు ఎండిపోయాయి. చాలా చోట్ల రిజర్వాయర్లలో నీటి లభ్యత లేకపోవడంతో సాగు విస్తీర్ణం కూడా తగ్గింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలో క్రాఫ్ హాలిడే ప్రకటించారు. మిగతా అనేక ప్రాజెక్టుల పరిధిలోనూ ఇలాగే జరిగింది. ఇటీవల కురిసిన అకాల వడగండ్ల వాన వల్ల కూడా రాష్ట్రంలో 7 లక్షల ఎకరాల్లో వరి పైర్లు దెబ్బతిన్నాయని గుర్తించారు. ఇలాంటి పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. ధాన్యం పండించిన రైతులకు గిట్టుబాటు ధర దక్కట్లేదు. కేంద్ర ప్రభుత్వం ఏటా కనీస మద్ధతు ధరల్ని ప్రకటిస్తుంది. 2023-24లో వరి ధాన్యం క్వింటాల్ ధర రూ.2183 ఉంది. 2022-23లో రూ.2060, 2021-22లో రూ.1960 ఎంఎస్‌పీ ఉంది. కేంద్రం ప్రకటించిన రూ.2183 ఎంఎస్‌పీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.500 బోనస్ కలిపి క్వింటల్‌కు రూ.2683 చొప్పున రైతులకు చెల్లించాల్సి ఉంది. కేంద్రం ప్రకటించిన మద్ధతు ధర గిట్టుబాటు కాని పరిస్థితి ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం రూ.500 బోనస్ చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

బోనస్ చెల్లించి ధాన్యం కొనాలి: జయరాజు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు

యాసంగి సీజన్ సేకరించే ధాన్యానికి మద్ధతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ చెల్లించాలి. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్ నుంచే బోనస్ చెల్లించాలి. రాష్ట్రంలో కరువు పరిస్థితుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం ప్రభుత్వం బోనస్ చెల్లించైనా ఆదుకోవాల్సిన బాధ్యత ఉంది. ఎన్నికల కోడ్ నెపంతో రైతులకు బోనస్ ఇవ్వకపోవడం సరైంది కాదు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన

- కాలువలకు నీరిచ్చి పంటలను కాపాడాలని డిమాండ్
- అధికారుల హామీ



నవతెలంగాణ-మంథని/గంగాధర

సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని.. కాలువలకు నీరు విడుదల చేసి ఆదుకోవాలంటూ రైతులు మంగళవారం మంథని, గంగాధర మండలాల్లో ఆందోళన చేశారు. కొద్ది రోజుల్లో చేతికొచ్చే సమయంలో పొలాలు వాడుబడుతున్నాయని, పెట్టిన పెట్టుబడి, చేసిన కష్టం మట్టిపాలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే నీరు విడుదల చేయాలని కోరారు. ఉన్నతాధికారులకు చెప్పి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. వివరాలిలా ఉన్నాయి..

ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని పోచమ్మవాడ, మల్లెపల్లి గ్రామాల రైతులు మంథని గోదావరిఖని-ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే.. వరి పొట్ట దశకు వచ్చిన సమయంలో నీటి కష్టాలు మొదలయ్యాయని.. కాలువల ద్వారా సాగునీరు అందించకుంటే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సాగునీరు విడుదల చేస్తామంటేనే తాము పంటలు సాగు చేశామన్నారు. కానీ ఇప్పుడు సాగునీరు ఇవ్వడం లేదన్నారు. వెంటనే అధికారులు, ప్రభుత్వం స్పందించి సాగునీరు అందించి పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేశారు. సమస్యలను సంబంధిత అధికారులకు వివరిస్తామని, రైతులకు నీళ్లు అందేలా చూస్తామని మంథని సీఐ హామీ ఇచ్చినప్పటికీ రైతులు ఆందోళన విరమించలేదు. ఈఈ బలరాం సంఘటన స్థలానికి చేరుకొని సంబంధిత పైఅధికారులతో మాట్లాడి సాగునీరు అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు రాస్తారోకో విరమించారు.

కరీంనగర్ జిల్లా గంగాధర

వరద కాల్వకు నీరు విడుదల చేయాలంటూ కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల-కొండన్నపల్లి వరద కాల్వ బ్రిడ్జిపై రైతులు ధర్నా చేపట్టారు. ప్రభుత్వంతోపాటు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తక్షణమే స్పందించి వరద కాలువకు నీరు విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. నీరివ్వకుంటే పంటలు ఎండిపోతాయని, తాము పడిన శ్రమ, పెట్టుబడులు కోల్పోవల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

కేసీఆర్ కలిసిన కడియం కావ్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్‌ఎస్ అధ్యక్షులు కేసీఆర్‌ను ఆ పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య కలిసారు. మంగళవారం హైదరాబాద్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో ఆయన్ని కలిసి.. వరంగల్ టికెట్ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ప్రచారం, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సందర్భంగా కేసీఆర్ కావ్యకు దిశా నిర్దేశం చేశారు.

టెట్ ఫీజును రద్దు చేయాలి : బీఆర్‌ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టెట్ ఫీజును వెంటనే రద్దు చేయాలని బీఆర్‌ఎస్ నేతలు వాసుదేవరెడ్డి, సంజీవ్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళ వారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ టెట్‌తో పాటు ఏ ఉద్యోగ పరీక్షకూ ఫీజులు వసూలు చేయబోమని మ్యానిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి రాగానే అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తోందని విమర్శించారు. టెట్ పరీక్ష ఫీజును గతంలో కంటె 150 శాతం పెంచారని ఆందోళన వ్యక్తం చేశారు.

తాగునీటికి ఇబ్బందుల్లేవు

- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు : సీఎస్ శాంతి కుమారి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గతేడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా రాష్ట్రంలోని మూడు ప్రధాన రిజర్వాయర్లలో సరిపడా నీటి లభ్యత ఉన్నందున ప్రస్తుత వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్లతో మంగళవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా సమీక్షించారు. రాష్ట్ర పురపాలక , పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, మున్సిపల్ శాఖ డైరెక్టర్ దివ్య, జలమండలి ఎండి సుదర్శన్ రెడ్డి తదితర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటికే "సమ్మర్ యాక్షన్ ప్లాన్" ను రూపొందించి జిల్లాలకు తగినన్ని నిధులను విడుదల చేశామని తెలిపారు. ఇప్పటికే బోరు బావుల ఫ్లషింగ్, పైపుల మరమ్మతులు పూర్తయ్యాయని చెప్పారు. నిర్వహణ పరమైన లోపాలను ఎప్పటికప్పుడు వెంటనే సవరించి నిరంతర నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతీ రోజు గ్రామాలు, పట్టణాలలో తాగునీటి సరఫరాపై సంబంధిత క్షేత్ర స్థాయి అధికారులు, నోడల్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించాలని ఆదేశించారు. వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంజూరు చేసిన పనులన్నీ సకాలంలో పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధానంగా ఆపరేషన్, మెయింటెనెన్స్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

ఇతర రాష్ట్రాల్లో ఎదురవుతున్న తాగునీటి సమస్యను మన రాష్ట్రానికి కూడా అన్వయిస్తూ పత్రికల్లో ఆందోళనకరమైన వార్తా కథనాలు వస్తున్నాయని సీఎస్ ఈ సందర్భంగా తెలిపారు. అయితే రాష్ట్రంలో ఈసారి లోటు వర్షపాతం ఉన్నా, ఇక్కడి ప్రధాన జలాశయాలు ఎస్ఆర్ఎస్‌పీ, శ్రీపాద ఎల్లంపల్లి, నాగార్జున సాగర్‌లలో గతేడాది మాదిరిగానే నీటి మట్టాలున్నాయని వివరించారు. అందువల్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అయినప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లను కూడా రూపొందించుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. కొన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో నిర్వహణపరంగా లోపాలొచ్చాయనీ, వీటిని వెంటనే పరిష్కరించాలని వివరించారు. . నీటి సమస్యలపై వివిధ మాధ్యమాల ద్వారా వచ్చే వార్తలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు.

ఏప్రిల్ రెండో వారం అనంతరం రిజర్వాయర్ల నుండి ఎమర్జెన్సీ పంపింగ్‌ను చేపడతామని శాంతికుమారి తెలిపారు. హైదరాబాద్ మహా నగరంలో కూడా సరిపడా నీటిని సరఫరా చేస్తున్నామనీ, అయితే, కమర్షియల్ అవసరాల నిమిత్తం డిమాండ్ ఎక్కువగా ఉందని జలమండలి అధికారులు తెలిపారు.

ఎంఎస్‌ఎంఈలకు సకాలంలో బకాయిల చెల్లింపులు

- ఏప్రిల్ 1 నుంచి నూతన నిబంధనలు
- అమలును వాయిదా వేయాలని కోరిన వ్యాపారులు



న్యూఢిల్లీ : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) రంగానికి సకాలంలో బకాయిల చెల్లింపులు జరిగేలా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన నిబంధనలను అమలు చేయబోతోంది. ఇవి వచ్చే నెల 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయి. దీని ప్రకారం ఎంఎస్‌ఎంఈలకు బకాయి పడిన కంపెనీలు 45 రోజుల్లోగా వాటిని చెల్లించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో బకాయిలపై పన్ను మినహాయింపులు ఇవ్వరు. ఎంఎస్‌ఎంఈలకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడడానికి ఫైనాన్స్ చట్టం ఆదాయపన్ను చట్టానికి సవరణను తీసుకొచ్చింది. అందుకోసం ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 43బీలో క్లాజ్ (హెచ్)ని చేర్చింది.

ఈ క్లాజు ప్రకారం ఎంఎస్‌ఎంఈలకు జరగాల్సిన ఏ చెల్లింపులైనా 45 రోజుల్లో పరిష్కారం కాకపోతే ఆ బకాయిలు చెల్లించే వరకూ వాటికి పన్ను మినహాయింపులు వర్తించవు. ఎంఎస్‌ఎంఈలకు బడా కంపెనీలు సకాలంలో బకాయిలు చెల్లించేలా చూడడమే దీని ఉద్దేశం. దీనివల్ల చిన్న చిన్న వ్యాపారాలకు అనువైన ఆర్థిక వాతావరణం ఏర్పడుతుంది. 2006వ సంవత్సరపు ఎంఎస్‌ఎంఈడీ చట్టం కింద నమోదైన కంపెనీల నుంచి వస్తువులు, సేవల కొనుగోలుకు సంబంధించిన లావాదేవీలకు సెక్షన్ 43బీ (హెచ్) వర్తిస్తుంది.ఆదాయపన్ను చట్టంలో ఈ సెక్షన్‌ను గత సంవత్సరం ప్రవేశపెట్టారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సకాలంలో బకాయిలు చెల్లించేలా చూడడమే దీని లక్ష్యం. ఎంఎస్‌ఎంఈలకు సకాలంలో సొమ్ము చెల్లించని పక్షంలో బడా కంపెనీలు తమ పన్ను ఆదాయం నుండి ఆ ఖర్చును మినహాయించలేవు. దీనివల్ల పన్ను భారం పెరుగుతుంది. మన దేశంలోని కంపెనీలు చెల్లింపులు జరిపినా లేకపోయినా తాము పెట్టిన ఖర్చులను నమోదు చేస్తుంటాయి. ఎంఎస్‌ఎంఈడీ చట్టంలోని సెక్షన్ 15, తాజాగా ఆదాయపన్ను చట్టంలో చేర్చిన సెక్షన్ ప్రకారం ఎంఎస్‌ఎంఈ సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలను 15 రోజుల్లో పరిష్కరించాల్సి ఉంటుంది. లేదా పరస్పర అంగీకారంతో 45 రోజుల్లో పరిష్కరించుకోవచ్చు. కాగా ఈ క్లాజును 2025 ఏప్రిల్ వరకూ అమలు చేయవద్దని వ్యాపారుల సంఘం సీఏఐటీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరింది. వ్యాపారులకు వర్తించే చట్టంపై, కొన్ని నిబంధనలపై స్పష్టత లేనందున అమలును వాయిదా వేయాలని విజ్ఞప్తి చేసింది. నూతన క్లాజు నేపథ్యంలో ఎంఎస్‌ఎంఈ సంస్థలకు ఇచ్చిన ఆర్డర్లను రిటైల్ వ్యాపారులు రద్దు చేసుకునే అవకాశం ఉన్నదని వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం (సీఎంఏఐ) ఆందోళన వ్యక్తం చేసింది. రిటైల్ పరిశ్రమ సాధారణంగా బకాయిల చెల్లింపునకు 90-120 రోజుల సమయం తీసుకుంటుందని, కొన్ని సందర్భాలలో దానిని 180 రోజులకు పొడిగిస్తుందని గుర్తు చేసింది. అలాంటప్పుడు 45 రోజుల్లోనే బకాయిలు చెల్లించాలని గడువు విధించడం సరికాదని అభిప్రాయపడింది.

ఎన్నికలకోడ్ ముగియగానే ...

- మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లకు పదోన్నతులు చేపట్టాలి: మంచాల రవీందర్ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల కోడ్ ముగియగానే రాష్ట్రంలో ల్యాబ్ టెక్నీషియన్ల పదోన్నతులను చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్ కోరారు. మంగళవారం హైదరాబాద్ కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ క్యాలెండర్‌ను డీఎంఈ డాక్టర్ వాణి, అకడమిక్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ శివరామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లకు సంబంధించి ఎన్నో ఖాళీలున్నప్పటికీ అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో పెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు హరినాథ్ మాట్లాడుతూ పని భారం ఉన్నప్పటికీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లు మెరుగైన సేవలందిస్తున్నారని తెలిపారు. డాక్టర్ వాణి మాట్లాడుతూ రోగ నిర్ధారణలో కీలక పాత్ర పోషిస్తున్నారంటూ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లను అభినందించారు. డీహెచ్ డాక్టర్ రవీంద్రనాయక్ తదితర ఉన్నతాధికారులలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్, ఉపాధ్యక్షులు పురుషోత్తం, ప్రవీణ్, బసప్ప, కార్యవర్గ సభ్యులు భాస్కర్, కౌసరున్నీసా, ముజీబ్, శ్రీనివాస్, నరసయ్య, రత్నమాల, కవిత, విజయ భాస్కర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



నాగేంద్ర పారిశ్రామిక శిక్షణా కేంద్రం సీజ్

- అస్తి పన్ను చెల్లించకపోవడంతో అధికారుల చర్యలు

నవతెలంగాణ-మిర్యాలగూడ

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మున్సిపల్ పరిధిలో శ్రీనివాసనగర్ కాలనీలోని నాగేంద్ర పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీసి) యాజమాన్యం ఆస్తిపన్ను చెల్లించక పోవడంతో కేంద్రాన్ని మున్సిపల్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. ఐటీసి సుమారు రూ.2,86,392 బకాయి ఉండగా ప్రభుత్వం వడ్డీ రాయితీ వల్ల రూ.93,564 మాఫీ ఉంటుందని రూ.1,92,828 చెల్లించాల్సి ఉంటుందని చెప్పినా యాజమాన్యం స్పందించలేదు. దాంతో కేంద్రానికి తాళాలు వేశామనిమున్సిపల్ కమిషనర్ ఎండి.యూసుఫ్ తెలిపారు. భారీ బకాయిలున్న వారికి రెడ్ నోటీసులు ఇచ్చిన అనంతరం స్పందన లేకపోతే సీజ్ చేస్తున్నామని చెప్పారు. బకాయిదారులకు గౌరవంగా నోటీసులు ఇచ్చిన తర్వాతనే సీలు వేస్తున్నామన్నారు. పన్నులు చెల్లించేందుకు బకాయిదారులు ముందుకు రావాలని, సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాకేష్, రవి, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

కోదాడ కోర్టులో షార్ట్‌సర్క్యూట్

- బీరువాలోని పత్రాలు దహనం



నవతెలంగాణ-కోదాడరూరల్

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని కోర్టులో అగ్నిప్రమాదం విషయం మంగళవారం వెలుగుజూసింది. బీరువాలో ఉన్న కోర్టుకు సంబంధించిన వివిధ పత్రాలు కాలిపోయాయి. విద్యుత్‌బోర్డులో జరిగిన షార్ట్ సర్క్యూట్ కారణంగా బోర్డుకు ఆనుకునే బీరువా ఉండటంతో, మంటలు అంటుకొని, లోపల ఉన్న ట్రై పూర్తిగా కాలిపోయింది.(ప్రమాదం జరిగిన తీరును ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.శ్యాంసుందర్, పట్టణ సీఐ రాము పరిశీలించారు. మూడ్రోజులు కోర్టు సెలవులు కావడంతో సిబ్బంది మంగళవారం గమనించారు. అంతేగాకుండా బార్ కౌన్సిల్ ఎన్నికలు జరుగుతుండటంతో అటువైపు పరిశీలించకపోవడంతో ఇలా జరిగి ఉండొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

50 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి

- పీఆర్సీ కమిటీకి జీజేఎల్‌ఏ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగులకు కనీస వేతనం రూ.35 వేలు నిర్ణయిస్తూ 50 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్ల సంఘం (జీజేఎల్‌ఏ) తెలంగాణ కోరింది. ఈ మేరకు పీఆర్సీ కమిటీ చైర్మెన్ శివశంకర్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి మధుసూదన్‌రెడ్డి కలిసి ప్రతిపాదనలను సమర్పించారు. జూనియర్ లెక్చరర్ పేరును లెక్చరర్ ఇన్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్‌గా మార్చాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో 15 శాతం, మున్సిపాల్టీల్లో 18 శాతం, జిల్లా కేంద్రాల్లో 20 శాతం, జీహెచ్‌ఎంసీ పరిధిలో 27 శాతం ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ) చెల్లించాలని తెలిపారు. గ్రాట్యూటీ రూ.25 లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం 5/10/15/20/25గా ఉండాలని సూచించారు.


గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రత్యేక అలవెన్స్‌ను చెల్లించాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. దాంతో ప్రాథమిక విద్య నుంచి ఇంటర్మీడియెట్ వరకు సమగ్ర విద్యాభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అమెరికా రక్షణ బడ్జెట్ ప్రపంచ యుద్ధం కోసమా?

- నెల్లూరు నరసింహారావు

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ శనివారం నాడు సంతకం చేసిన బడ్జెట్ చరిత్రలో అతిపెద్ద మొత్తాన్ని సైనిక వ్యయం కోసం అందిస్తుంది. ఫెడరల్ ప్రభుత్వంలో ఆరు విభాగాలకు కేటాయించిన 1.2 ట్రిలియన్ల డాలర్లలో అమెరికా రక్షణ మంత్రిత్వ శాఖకు (పెంటగాన్) మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ అంటే 825 బిల్లియన్లు అందుతాయి. ఇతర ఆరు సమాఖ్య విభాగాలకు సంబంధించి బైడెన్ మార్చి 8న సంతకం చేసిన ప్రత్యేక బడ్జెట్ బిల్లులో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనర్జీ నిర్వహిస్తున్న అణ్వాయుధ కార్యక్రమాలకు ఉద్దేశింపబడిన 23.8 బిలియన్లు ఉన్నాయి. ఇతర విభాగాలు, ఏజెంట్ల ద్వారా సైనిక- గూఢచార కార్యకలాపాల కోసం చేసిన కేటాయింపులన్నింటినీ కలిపి లెక్కించినప్పుడు అమెరికా రక్షణ బడ్జెట్ మొత్తం 1 ట్రిలియన్ డాలర్ల మొత్తాన్ని అధిగమించే అవకాశం ఉంది. అయితే వాస్తవ సంఖ్య రహస్యంగానే ఉంటుంది. ఎందుకంటే సైనిక సంబంధిత వ్యయంలో ఎక్కువ భాగం నిఘా, సైనిక ఉపగ్రహ ప్రయోగాలు, ఇతర కార్యకలాపాలుగా వర్గీకరించబడి ఉంటుంది.

అమెరికా సైనిక వ్యయానికి సంబంధించి బహిరంగంగా లభించే గణాంకాల ఆధారంగా చూసినప్పటికీ అది అనూహ్య స్థాయిలోనే ఉంటుంది. మొత్తం ప్రపంచ సైనిక వ్యయంలో ఒక్క అమెరికా వాటానే 39 శాతం ఉంది. ఇది అమెరికా తరువాత అత్యున్నత స్థాయిలో సైనిక వ్యయం చేస్తున్న 11 దేశాల మొత్తం సైనిక వ్యయాన్ని కలిపిన దానితో సమానం. ప్రపంచ గణాంకాలు సమగ్రంగా అందుబాటులో వున్న 2022లో అమెరికా చేసిన సైనిక వ్యయం మొత్తం 877 బిలియన్లతో పోలిస్తే, చైనా 292 బిలియన్లు, రష్యా 86.4 బిలియన్లు తమతమ రక్షణ వ్యయంగా ఖర్చు చేసినట్లు స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అంచనా వేసింది.



అమెరికా, దాని మిత్ర దేశాల సైనిక వ్యయంతో పోల్చినప్పుడు రష్యా చేస్తున్న సైనిక వ్యయం నామమాత్రమే అని చెప్పకతప్పదు. అమెరికా నాయకత్వంలోని నాటో కూటమి దేశాల 300 బిలియన్ల సంయుక్త సైనిక వ్యయం, ఆసియాలో అమెరికా మిత్రదేశాలు (క్వాడ్ అని పిలవబడే ఇండియా, జపాన్, ఆస్ట్రేలియా) చేస్తున్న 160 బిలియన్ల సైనిక వ్యయం, అలాగే మధ్యప్రాచ్యంలో అమెరికా కనుసన్నల్లో మెలిగే సౌదీ అరేబియా, ఇజ్రాయిల్, ఖతార్, యుఏఇ కలిపి చేస్తున్న -130 బిలియన్ల సైనిక వ్యయం- అంటే అమెరికా, దాని ప్రధాన మిత్రదేశాల సంయుక్త సైనిక వ్యయం అంతా కలిపి చూసినప్పుడు అది 1.5 ట్రిలియన్ డాలర్ల మొత్తాన్ని మించి ఉంటుంది. ఇది మొత్తం ప్రపంచంలోని సైనిక వ్యయంలో మూడింట రెండు వంతులుంటుంది.

రష్యా, చైనాల సంయుక్త సైనిక వ్యయం కంటే ఇది నాలుగు రెట్లు ఎక్కువ. ఈ స్థాయిలో అమెరికా, దాని మిత్ర దేశాలు చేస్తున్న సైనిక వ్యయం ప్రపంచ యుద్ధానికి సన్నద్ధం కావటంగా తప్ప మరోలా భావించలేము. సుదీర్ఘ

చారిత్రక క్రమంలో అమెరికన్ సామ్రాజ్యవాద ఆర్థిక స్థితి గణనీయంగా క్షీణించింది. రెండో ప్రపంచ యుద్ధం ముగిసేనాటికి ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో దాదాపు 50 శాతంగావున్న అమెరికా వాటా 1960 కల్లా 40 శాతానికి, 1971 కల్లా 27 శాతానికి పడిపోయింది. ప్రెసిడెంట్ రిచర్డ్ నిక్సన్ చెల్లింపుల లోటు పెరుగుతున్న కారణంగా డాలర్‌ను బంగారంగా మార్చుకునే విధానాన్ని రద్దు చేశాడు. గత సంవత్సరం ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో అమెరికా వాటా కేవలం 15 శాతంగా వుంది. రాబోయే సంవత్సరాల్లో అది మరింతగా క్షీణిస్తుందని అంచనా వేస్తున్నారు. అయితే మానవ హనన ఆయుధాల ఉత్పత్తిలో, క్షణాల్లో పచ్చని జీవితాలను బూడిదగా మార్చగల కచ్చిత తత్వ క్షిపణుల సృష్టిలో అమెరికాకు సాటిగానీ, దానికి సమీపంలోగానీ మరో దేశం లేదు.

క్షీణిస్తున్న అమెరికా ఆర్థిక స్థితి, అది చేస్తున్న భారీ సైనిక వ్యయం మధ్యగల ఈ వైరుధ్యం అమెరికా తన విదేశాంగ విధానంలో అనుసరిస్తున్న క్రూరత్వాన్ని వివరిస్తుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థను అధిగమించనున్న చైనాను దెబ్బ కొట్టే విషయంలోను, చైనా మిత్రదేశాలైన రష్యా, ఇరాన్, ఉత్తర కొరియాలను లొంగదీసుకోవటానికి ప్రయత్నించే విషయంలోను అమెరికాలోని రెండు ప్రధాన పెట్టుబడిదారీ పార్టీలైన డెమొక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య ఏకాభిప్రాయం ఉంది. వీలైనంత త్వరగా చైనాను రెచ్చగొట్టి, ఆ దేశంతో ఘర్షణకు దిగాలని అమెరికా ద్రవ్య పెట్టుబడిదారీ వర్గం, దాని రాజకీయ నాయకత్వం ప్రయత్నిస్తున్నాయి. ఎందుకంటే మౌలిక ధోరణులు అమెరికాకు వ్యతిరేకంగా ఉన్నాయి. సమయం మించిపోతోంది. అమెరికా తన సైనిక బలగాలను ఉపయోగించడం పట్ల విముఖంగా ఉందని



లేదా ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధ విస్తరణను నిరోధించడానికి ప్రయత్నిస్తున్నదని లేదా గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమాన్ని ఆపడానికి ప్రయత్నిస్తున్నదని బైడెన్ ప్రభుత్వం, అమెరికా కార్పొరేట్ మీడియా చెబుతున్న కట్టుకథలలో కనీస నిజాయితీ లేదనేది వాస్తవం.అమెరికా సామ్రాజ్యవాదం యొక్క నిజమైన క్రూరత్వం తాజాగా ఆమోదించబడిన పెంటగాన్ బడ్జెట్‌లోని ఒక ముఖ్య నిబంధనలో నిక్షిప్తమైవుంది. యునైటెడ్ నేషన్స్ రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ (యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ) కోసం అమెరికా చేస్తున్న సహాయంలో ఒక్క పైసా కూడా అదనంగా ఇవ్వ కూడదని కాంగ్రెస్‌లోని డెమొక్రాట్‌లు, రిపబ్లికన్లు నిర్ణయించారు. ఈ సంస్థ గాజాలోని 2.3 మిలియన్ల జనాభాతో సహా ప్రతిరోజూ మిలియన్ల పాలస్తీనియన్ శరణార్థులకు ఆహారం అందిస్తుంది. బైడెన్, డొనాల్డ్ ట్రంప్‌ల మధ్య ఎన్నికల సంవత్సరంలో పరస్పరం బురద జల్లుకోవటం ఎంతగా ఉన్నప్పటికీ సామూహిక ఆకలిని ఆయుధంగా మలచటంలో డెమొక్రాట్లు, రిపబ్లికన్లు ఐక్యంగానే ఉన్నారు.

బీజేపీని ఆపే సత్తా కాంగ్రెస్‌కు లేదు..



(మొదటిపేజీ తరువాయి)

పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు ఈ కార్య క్రమానికి హాజరయ్యారు. అయితే త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ (మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ కుమారుడు) ఈ సమావేశానికి హాజరు కాలేదు. మాజీ మంత్రి తలసాని కూడా మీటింగు మధ్యలోనే వెళ్లిపోవటం గమనార్హం. సభకు అధ్యక్షత వహించిన మాగంటి గోపీనాథ్, సీనియర్ నేత రావుల శ్రీధర్ రెడ్డికి మధ్య కొంత వాగ్వాదం చోటు చేసుకోవటం చర్చనీయాంశమైంది. సమావేశంలో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ...రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా, సీఎం రేవంత్‌పైనా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇటీవలే పార్టీ మారి కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై ఆయన అసహనం, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి ప్రస్తుతం చాలా విచిత్రంగా ఉందని అన్నారు. ఆ పార్టీ అగ్రనేత రాహుల్.. మోడీని చౌకీదార్ చోర్ అని అంటుంటే, రేవంత్ మాత్రం ప్రధానిని బడేభాయ్ అంటూ సంబోధిస్తున్నారని గుర్తు చేశారు. ఆదానీ అనే వ్యక్తి మంచోడు కాదని రాహుల్ విమర్శిస్తుంటే..రేవంత్ మాత్రం ఆయనతో ఒప్పందాలు చేసుకుంటున్నారని విమర్శించారు. ఇసుక దందా, రైస్ మిల్లర్లను బ్లాక్ మెయిల్ చేయటం, బిల్డర్లను, రియల్టర్లను బెదిరించటం లాంటి వార్తలను బయటకు పొక్కనీయకుండా కాంగ్రెస్ అడ్డుకుంటోందని ఆయన చెప్పారు. వాటి పేరు చెప్పి ఆ పార్టీ నేతలు డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. పురపాలక శాఖను పర్యవేక్షిస్తున్న సీఎం రేవంత్ మూడు నెలలుగా ఎందుకు భవనాలకు అనుమతులనివ్వటం లేదని ప్రశ్నించారు. ఇలాంటి వాటికి సమాధానం చెప్పకుండా పేగులు మెడలేసుకుంటా... అంటూ ఆయన అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యక్తి మనకు సీఎంగా ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలను అమలు చేయటానికి చేతగాని ముఖ్యమంత్రి అలాంటి అంశాలను పక్కదోవ పట్టించటానికి ఫోన్ ట్యాపింగులు, స్కాములు అంటూ పత్రికల్లో వార్తలు రాయించుకుంటున్నారని విమర్శించారు. 'ఎవరు ఏ తప్పు చేసినా ఉపేక్షించాల్సిన అవసరం లేదు. మీ చేతిలో అధికారం ఉంది. చర్యలు తీసుకోండి...' అంటూ సీఎంకు సవాల్ విసిరారు.

దానం పచ్చి అవకాశవాది...

కష్టకాలంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే దానం నాగేందర్ పచ్చి అవకాశవాదంటూ కేటీఆర్ విరుచుకుపడ్డారు. రాజకీయాల్లో సికింద్రాబాద్ అంటేనే పద్మారావు పేరు గుర్తుకొస్తుందని అన్నారు. 24 ఏండ్ల నుంచి పార్టీకి హైదరాబాద్‌లో ఆయన అండగా ఉంటూ వస్తున్నారని చెప్పారు. సికింద్రాబాద్ లోక్‌సభ నుంచి ఆయన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌ను వీడటం తప్పని దానం తెలుసుకునే రోజు దగ్గరలోనే ఉందని అన్నారు. ఆయన అధికారం కోసం ఆశపడి, తనకు ఓట్లేసిన ప్రజలను సైతం మోసం చేసి కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. గతంలో ఒక పార్టీని వీడి ఆసిఫ్‌నగర్ నుంచి పోటీ చేసి ఓటమిపాలైన విషయాన్ని దానం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. రెండు పడవల ప్రయాణం ఎప్పుడు కూడా మంచిది కాదనే విషయాన్ని ఆయన అర్థం చేసుకోవాలని సూచించారు. దానంపై స్పీకర్‌కు ఇచ్చిన ఫిర్యాదుపై ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే పదవికి ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలంటూ కోరారు. ఈ విషయంలో అవసరమైతే సుప్రీంకోర్టు దాకానైనా వెళతామని అన్నారు. మూడు నెలల్లోగా ఖైరతాబాద్ ఉప ఎన్నిక వస్తుందనీ, కార్యకర్తలందరూ సిద్ధంగా ఉండి, పార్టీకి ద్రోహం చేసిన దానంకు బుద్ధి చెప్పాలని సూచించారు. గత ఐదేండ్ల నుంచి ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి తెలంగాణకు, సికింద్రాబాద్‌కు చేసిందేమీ లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆయనకు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. రాముడిని అడ్డం పెట్టుకుని బీజేపీ చేస్తున్న రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 'ఇప్పటిదాకా బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే.. అందుకే కవితను అరెస్టు చేయలేదంటూ కాంగ్రెస్ నేతలు చెప్పుకొచ్చారు, ఇప్పుడు ఆమెను అరెస్టు చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు ఏం చెబుతారు...?' అంటూ ప్రశ్నించారు. బీజేపీ తమపైనా, తమ పార్టీపైనా పగబట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రూప్స్-1 దరఖాస్తుల సవరణకు నేడు ఆఖరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 దరఖాస్తుల సవరణ ప్రక్రియ గడువు బుధవారం సాయంత్రం ఐదుగంటలతో ముగియనుంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-1 దరఖాస్తుల సవరణ ప్రక్రియ ఈనెల 23 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సవరణ గడువు ముగిసిన తర్వాత పొడిగింపు ఉండబోదని స్పష్టం చేశారు. ఆ తర్వాత ఎలాంటి సవరణలకు అవకాశం లేదనీ, దరఖాస్తుల్లోని సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తామని వివరించారు. ఈ ప్రక్రియ మానవుల ప్రమేయం ఉండబోదని తెలిపారు. గ్రూప్-1 దరఖాస్తుల సవరణకు టీఎస్‌పీఎస్సీ (షషష్.ంజూంఎ.స్త్రశీఙ.ఱఅ) వెబ్‌సైట్‌ను ఉపయోగించాలని సూచించారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1కు 4.03 లక్షల దరఖాస్తులొచ్చాయి. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన, మెయిన్స్ రాతపరీక్షను అక్టోబర్ 21న నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది.

పేస్కేల్ లోపాలు సవరించండి

- ఎమ్‌డీ సజ్జనార్‌కు టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ లేఖ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ కార్మికులకు ప్రకటించిన 2017 వేతన సవరణ పే స్కేల్ ఫిక్సేషన్‌లోని లోపాలను సవరించాలని టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పూర్తి వివరాలతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం ఆయన కార్యాలయంలో అందచేసినట్టు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని గతంలో తాము కోరామనీ, కానీ 2017 వేతన సవరణలో రూ.16,500 మాత్రమే పరిగణనలోకి తీసుకుని, వేతన సవరణ చేశారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు 2018లో నిర్ణయించిన కనీస వేతనం రూ.19వేలను కూడా పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఇంక్రిమెంటు రేట్లు బేసిక్ పైన అన్ని స్థాయిల్లో 5 శాతం ఉండేలా చూడాలని కోరితే, పాత ఇంక్రిమెంట్లనే చిన్న చిన్న మార్పులతో సర్క్యులర్ విడుదల చేశారని తెలిపారు. వివిధ కేడర్లలోని ఉద్యోగులందరికీ దీనివల్ల నష్టం జరుగుతుందన్నారు. సీనియర్, జూనియర్ లను కూడా ఒకే స్కేలులో ఉంచారన్నారు. 2024 జనవరి డీఏ వెంటనే అమలు చేయాలని కోరారు. 2013 వేతన సవరణ బకాయిల బాండ్ల కాలపరిమితి ముగిసినా, ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదనీ, దీనిపై స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటన చేసినా, అమలు కాలేదన్నారు. ఈ అనుభవం దృష్ట్యా 2017 వేతన సవరణ బకాయిలు సొమ్ము లెక్కించి, ఏ కార్మికునికి ఎంత మొత్తం చెల్లించాల్సి వుంటుందో, ఎప్పుడు పేమెంటు చేస్తారో ధృవీకరిస్తూ అధికారికంగా కాపీలు ఇవ్వాలని కోరారు.

నేడు రాజేంద్రనగర్‌లో హైకోర్టు నూతన భవనానికి శంకుస్థాపన

- సుప్రీంకోర్టు సీజే రాక

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ హైకోర్టు నూతన భవనానికి బుధవారం రాజేంద్రనగర్‌లో శంకుస్థాపన జరగనుంది. ఈమేరకు హైకోర్టు రిజిస్ట్రార్(మేనేజ్‌మెంట్) మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం సాయంత్రం 5:30 గంటలకు సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్ డివై చాంద్రచూడ్ చేతుల మీదుగా శంకుస్థాపన చేపట్టనున్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేతోపాటు సుప్రీంకోర్టు జడ్జీలు, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. ఈమేరకు అన్నీ ఏర్పాట్లు పూర్తయ్యాయి. బార్ అసోసియేషన్ జారీ చేసిన పాసులు కలిగిన వారు మాత్రమే శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనాలని హైకోర్టు రిజిస్ట్రార్ తెలియజేశారు.

మెదక్ గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయం

- కాంగ్రెసోళ్లు ఏం మొఖంపెట్టుకుని ఓట్లడుగుతరు
- ఏ ఒక్క హామీ కూడా అమలు చేసిందిలేదు
- బీజేపీ అభ్యర్థి మంచోడైతే దుబ్బాకలో ఎందుకు ఓడిండు
- పేదల సంక్షేమం కోసం రూ.100 కోట్లతో నిధి ఏర్పాటు చేయడం గొప్ప విషయం : మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మెదక్ గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని, ఏ ఒక్క హామీ కూడా అమలు చేయని కాంగ్రెసోళ్లు ఏం మొఖం పెట్టుకుని ప్రజల్ని ఓట్లు అడుగుతారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరైన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలన్నీ నీటి మూటలయ్యాయని విమర్శించారు. హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో కచ్చితంగా అమలు చేస్తామని చెప్పి మాట తప్పారని అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ, రైతు బంధుకు బదులు రైతు భరోసా కింద రూ.15 వేలు ఇస్తామని మాట తప్పిందని తెలిపారు. కనీసం రైతులకు బోనస్ కూడా ఇవ్వని కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. 24 గంటల కరెంట్, పెంచిన పింఛన్ ఇవ్వని కాంగ్రెస్ వాళ్లు ఏ మొఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారన్నారు.

కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే హామీలు అమలు చేయకున్నా ఒప్పుకున్నట్టు అవుతుందని, ఇది ప్రజలు గ్రహించాలని కోరారు. చోటేబాయి.. బడే బాయి.. రేవంత్‌రెడ్డి మోడీతో ఏం అన్నాడో ప్రజలు గమనించాలని, గుజరాత్ మోడల్ అభివృద్ధి చేసేందుకు సాయపడాలని కోరడమంటే అదానీకి దోచి పెట్టడమా అని ప్రశ్నించారు. రేవంత్ మంత్రివర్గంలో ముస్లీం మైనార్టీలకు ప్రాతినిధ్యం లేదన్నారు. రైతులు, ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. పంటలెండి రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు మంచొడైతే దుబ్బాకలో ఎందుకు గెల్వలేదన్నారు.

ఆయన పనితీరు బాగలేదనే ప్రజలు 54 వేల ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పేద పిల్లల చదువులు, సంక్షేమం కోసం రూ.100 కోట్ల నిధి ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. వెంకట్రామిరెడ్డి పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. రూ.100 కోట్ల నిధులతో పీవీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేస్తానన్నారు. నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తానన్నారు. ప్రజాధరణ చూసే పార్టీ తనకు ఎంపీ టికెట్ ఇచ్చిందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింత ప్రభాకర్, ఎమ్మెల్సీ జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, నాయకులు ముఖీం పాల్గొన్నారు.

టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించలేదు

- నేటినుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- వాటి సమర్పణకు తుది గడువు ఏప్రిల్ 10

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో బుధవారం నుంచి ప్రారంభం కానుంది. వాటి సమర్పణకు తుది గడువు వచ్చేనెల పదో తేదీ వరకు ఉన్నది. ఈనెల 22న టెట్ పూర్తిస్థాయి నోటిఫికేషన్‌ను విద్యాశాఖ విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే టెట్ దరఖాస్తు ఫీజును భారీగా పెంచడం పట్ల అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక పేపర్ రాస్తే రూ.వెయ్యి, రెండు రాయాలనుకుంటే రూ.రెండు వేలు చెల్లించాలని విద్యాశాఖ ప్రకటించింది. దీనిపై తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. గతంలో ఒక పేపర్‌కు రూ.200, రెండు పేపర్లు రాస్తే రూ.300 దరఖాస్తు ఫీజు ఉన్నది. టెట్ దరఖాస్తు ఫీజును భారీగా పెంచడాన్ని విద్యార్థి, యువజన సంఘాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నిర్ణయాన్ని పునరాలోచన చేసి నిరుద్యోగ అభ్యర్థులపై భారం లేకుండా చూడాలని కోరుతున్నాయి. ఫీజు పెంపుపై పెద్దఎత్తున వ్యతిరేకత వచ్చినా, అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం తగ్గించకపోవడం గమనార్హం. మే 20 నుంచి జూన్ మూడో తేదీ వరకు టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

బలుపు, అహంకారం తగ్గలేదు

- కేటీఆర్‌పై ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పినా మాజీ మంత్రి కేటీఆర్‌కు బలుపు, అహంకారం తగ్గలేదని పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌పై ఆయన మతి భ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'బీఆర్ఎస్ పార్టీ చిన్నాభిన్నమైనా వారికి ఇంకా సిగ్గు రావట్లేదు. చెల్లెలు కవిత జైలుకు పోయారు. కేసులు చుట్టుముడుతున్నాయి. దీంతో కేటీఆర్ బుర్ర పని చేయడం లేదు. తీవ్ర నిరాశ నిస్పృహ గురై ఆయన నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు' అని ఎద్దేవా చేశారు.

ఫోన్ ట్యాపింగ్‌పై సమగ్ర విచారణ జరపాలి

- దోషులు ఎంతటి వారైనా శిక్షించాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపైన సమగ్ర విచారణ జరిపి, దోషులు ఎంతటి వారైనా బయటకు తీసి శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రత్యర్థులను బలహీనపరిచేందుకు గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వెలుగు చూస్తున్న విషయాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి సమీపంలో ఇళ్లు అద్దెకు తీసుకుని ఆధునిక పరికరాలతో వారి ఇంట్లో ఏం మాట్లాడుకునేవారో రికార్డు చేశారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ముగ్గురు పోలీసు ఉన్నతాధికారులు అరెస్టు కావడం, ఇంటెలిజెన్స్ మాజీ ఛీఫ్ పేరు రావడం దారుణమని పేర్కొన్నారు. నిఘా వ్యవహారం ఇంత లోతుగా ఉండడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత ఆందోళనకరమని తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఇజ్రాయెల్ సాఫ్ట్‌వేర్ పెగాసెస్‌తో రాజకీయ ప్రత్యర్థులు, జర్నలిస్టుల ఫోన్‌లు ట్యాపింగ్ చేయించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం కూడా అదే బాటలో నడిచిందని తెలిపారు. రాష్ట్రంలో ట్యాపింగ్ వ్యవహారం కేవలం పోలీసులు సొంతంగా చేసింది కాదనీ, దీని వెనుక ఉన్న వ్యక్తులు, కారణాలపై రాష్ట్ర ప్రభుత్వం లోతుగా దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. గతంలో రాజకీయ అవసరాల కోసం ఫోన్ ట్యాపింగ్ చేసిన కేసులో కర్నాటక మాజీ సీఎం రామకృష్ణ హెగ్డే రాజీనామా చేయాల్సి వచ్చిందని గుర్తు చేశారు. భవిష్యత్తులో రాజకీయ నాయకులు, ప్రత్యర్థులు, ప్రజాసంఘాలపై ఫోన్ ట్యాపింగ్ చేయకుండా వ్యవస్థలు సక్రమంగా నడిచే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

మోడీ, అమిత్ షా రాజనీతిజ్ఞులుగా నిరూపించుకోవాలి

- సోనమ్ వాంగ్‌చుక్
- 21 రోజుల నిరాహార దీక్ష విరమణ



లధక్ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తమని తాము రాజకీయ నీతిజ్ఞులుగా నిరూపించుకోవాలని లధక్ చెందిన ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేశారు. లధక్‌కు రాష్ట్రహోదా, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చడం వంటి నాలుగు డిమాండ్లతో 21 రోజులుగా చేస్తున్న నిరాహార దీక్షను సోనమ్ వాంగ్‌చుక్ మంగళవారం విరమించారు. పై డిమాండ్ల కోసం తన పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. మంగళవారం వాంగ్‌చుక్ చాలా బలహీనంగా కనిపించారు. నిరాహార దీక్ష విరమణకు ముందు ఎక్స్‌లో ఆయన ఒక వీడియో పోస్ట్ చేశారు. 'ప్రస్తుతం మనదేశానికి చిత్తశుద్ధి, దూరదృష్టి, వివేకం ఉన్న రాజనీతిజ్ఞులు కావాలి. కేవలం హ్రస్వదృష్టి ఉన్న రాజకీయ నాయకులు కాదు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా త్వరలో తాము రాజనీతిజ్ఞులు అని నిరూపించుకుంటారని ఆశిస్తున్నా' అని సోనమ్ వాంగ్‌చుక్ తెలిపారు. లడఖ్ ప్రజలకు బిజెపి, మోడీ చేసిన వాగ్దానాలను గుర్తుచేశారు. 'మోడీ రామభక్తునిగా చెప్పుకుంటారు. ప్రాణాలు కోల్పోయినా మాట తప్పకూడదు' అనే రాముని బోధనను మోడీ అనుసరించాలి' అని అన్నారు. ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం-లధక్ నాయకుల మధ్య చర్చలు విఫలమైన తరువాత ఈ నెల 6న ఆయన నిరాహార దీక్ష ప్రారంభించారు. మంగళవారం ముందుగా నిరాహార దీక్ష చేస్తున్న వాంగ్‌చుక్‌ను నటులు ప్రకాశ్‌రాజ్ పరామర్శించారు. వాంగ్‌చుక్‌కు మద్దతు తెలిపారు. ప్రభుత్వాలు తమ వాగ్దానాలను నిలబెట్టుకోనప్పుడు ప్రజలు ఐక్యంగా ఉండి, తమ గళాన్ని పెంచడం తప్ప మరో మార్గం లేదని ప్రకాశ్‌రాజ్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ రోజు తన పుట్టినరోజని, వాంగ్‌చుక్‌కు మద్దతు ఇవ్వడమే తన ప్రాధాన్యత అని చెప్పారు.

అడవుల్లో చెలరేగుతున్న మంటలు

- జాతీయ రహదారిపై కమ్ముకున్న పొగ

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలుగా నెలకొన్న పస్రా, తాడ్వాయి, ఏటూరునాగారం కమలాపురం ప్రాంతాల్లోని అడవుల్లో కారుచిచ్చు చెలరేగుతుంది.. ఒకేసారి పొగ రోడ్లపైకి రావడంతో వాహనదారులు అనేక అవస్థలు పడుతూ ప్రయాణిస్తున్నారు. పస్రా నుంచి ఏటూర్‌నాగారం వరకు వ్యాపించి ఉన్న అడవిలో సుమారు 30 కిలోమీటర్ల మేర మంటలు లేస్తున్నాయి.

ఐపీఎల్ మ్యాచ్‌కు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్‌కు 60 స్పెషల్ బస్సులు
- నేడు సన్‌రైజర్స్ హైదరాబాద్-ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య పోరు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో నేటి నుంచి ఐపీఎల్ సందడి మొదలుకానుంది. బుధవారం సాయంత్రం ఉప్పల్ స్టేడియం వేదికగా సన్ రైజర్స్ హైదరాబాద్-ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. హైదరాబాద్ సొంతగడ్డపై తొలి మ్యాచ్ కావడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్యాన్స్ ఎంతో ఉత్సాహంతో ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో క్రికెట్ ప్రియులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు నగరంలోని వివిద ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియానికి టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. హైదరాబాద్‌లోని 24 డిపోల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి స్టేడియానికి 60 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు టీఎస్ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ అవకాశాన్ని క్రికెట్ అభిమానులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు ఇదే విషయాన్ని ఎక్స్(ట్విట్టర్) వేదికగా టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సైతం ప్రకటించారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు నగరంలోని వివిధ డిపోల నుంచి బస్సులు ప్రారంభమై.. తిరిగి రాత్రి 11:30 గంటలకు స్టేడియం నుంచి బయలుదేరుతాయి. వచ్చే నెల 5వ తేదీన జరిగే మ్యాచ్‌కు సైతం ఇవే సర్వీసులను యథావిధిగా నడపనున్నారు. ఆర్టీసీ బస్సుల్లో క్షేమంగా, సురక్షితంగా ఉప్పల్ స్టేడియానికి చేరుకోవాలని, ప్రయివేట్ వాహనాల్లో ప్రయాణించి ట్రాఫిక్, పార్కింగ్ ఇబ్బందుల్లో పడొద్దని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు.

మ్యాచ్ అనంతరం క్రికెట్ వీక్షకులకు అవసరమైన సూచనలు చేయడానికి స్టేడియం వద్ద ఉప్పల్, బడంగ్‌పేట్, హయత్‌నగర్-1కు చెందిన డిపో మేనేజర్లను ఇన్‌చార్జీలుగా నియమించారు. ఇతర ఎదైనా సమాచారం కోసం కోఠి, రైతిఫైల్‌లో ప్రత్యేక సహాయ కేంద్రాలు కూడా ఏర్పాటు చేశారు.

మెట్రో అదనపు సర్వీసులు..

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ను దృష్టిలో పెట్టుకుని మెట్రో రైళ్లను అర్ధరాత్రి వరకు నడపనున్నారని సమాచారం. రాత్రి 7.30 గంటలకు మొదలయ్యే మ్యాచ్‌ను చూసేందుకు మధ్యాహ్నం నుంచే ప్రేక్షకులు స్టేడియం వద్దకు చేరుకునే అవకాశం ఉంది. మ్యాచ్‌కు 3 గంటల ముందు నుంచే ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతి ఇవ్వనున్నట్టు పోలీసులు చెబుతున్నారు. దీంతో మధ్యాహ్నం 12.30 నుంచే రైళ్ల ఫ్రీక్వెన్సీని మెట్రో అధికారులు పెంచనున్నారు. ఎప్పటిలాగే నాగోల్-అమీర్‌పేట మార్గంలో ఎక్కువ సంఖ్యలో రైళ్లను నడుపనున్నారు. అయితే దీనిపై మెట్రో అధికారులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

రైతు సమస్యలు, నీటిపారుదల ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా?

- హరీశ్‌రావుకు మంత్రి జూపల్లి సవాల్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతు సమస్యలు, నీటి పారుదల ప్రాజెక్టులు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై చర్చకు సిద్ధమా? మాజీ మంత్రి హరీశ్‌రావుకు మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. సమయం, తేదీ, వేదిక ఎక్కడో చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వీరపల్లి శంకర్, వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డితో కలిసి విలేకర్లతో ఆయన మాట్లాడారు. పంట నష్ట పరిహారం ఇవ్వకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తామన్న హరీశ్‌రావు వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అసలు సినిమా ముందుందనీ, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిని బయటపెడతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతల తప్పులన్నీ బయట పెట్టాక తలకాయ ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు సచివాలయాన్ని ముట్టడించడం కాదనీ, పదేండ్లుగా రాష్ట్ర ఖజానాను బీఆర్ఎస్ నాయకులు ముట్టడించారని ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వం రాయలసీమకు నీళ్ల తరలించుకుపోతుంటే మాజీ సీఎం కేసీఆర్ గుడ్లు అప్పగించి చూశారని విమర్శించారు. కొత్త ప్రాజెక్టులను పూర్తి చేయలేదన్నారు. పాత ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేశారని విమర్శించారు. పదేండ్లలో ఎప్పుడైనా పంట నష్టానికి పరిహారం ఇచ్చారా? ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమాను అమలు చేశారా ? అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి కోసమే హరీశ్‌రావు అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ అనాలోచిత నిర్ణయాల వల్లే తెలంగాణలో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులకు రైతుల గురించి, వ్యవసాయం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని తెలిపారు. గతంలో వరి వేస్తే ఉరి అన్నది మీరు కాదా? రైతులకు వరి వేయద్దని చెప్పి.... ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో వరి వేసింది ఎవరో అందరికీ తెలిసిందేనన్నారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పంట నష్టంపై సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, పంట నష్టంపై సమగ్ర నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారని గుర్తు చేశారు. నివేదిక రాగానే రైతులకు ఎకరానికి రూ.10 వేల నష్ట పరిహారం చెల్లిస్తామన్నారు. వచ్చే వాన కాలం సీజన్ నుంచి పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. అన్నదాతల కష్టాలు, కడగండ్లు గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాపమేనన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు ఆగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేండ్లలో 6,651 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ కుంగుబాటు మీ పాపం కాదా? వర్షం కాలం సీజన్‌లో అధికారంలో ఉంది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా? మరి ప్రాజెక్టుల్లో నీళ్ల ఎందుకు నింపలేకపోయారని నిలదీశారు. ప్రతీ నీటిని బొట్టును ఒడిసి పడితామని చెప్పి...సకాలంలో ప్రాజెక్టులను పూర్తి చేయలేదన్నారు. కట్టిన ప్రాజెక్టులను కూడా కూలిపోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. పాలమూర్ - రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆదరబాదరగా పాలమూర్ - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారనీ, కానీ ఒక్క ఎకరానికి కూడా నీళ్లివ్వలేకపోయారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

వెలుగు చూడని హింస, నేరాలు !



- వృద్ధ మహిళలు, వికలాంగుల హింసపై డేటా రూపొందించాలి : డబ్ల్యుహెచ్‌ఓ సమీక్ష వెల్లడి

న్యూయార్క్ : వృద్ధ మహిళలు, అంగ వైకల్యంతో బాధ పడుతున్న మహిళలు ఎక్కువగా లైంగిక హింసకు గురవుతున్నారని, అటువంటి వారి పట్ల మరింతగా దృష్టి సారించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) పేర్కొంది. అంతేకాకుండా ఇలాంటివారు అదనంగా మరికొన్ని ముప్పులను కూడా ఎదుర్కొంటున్నారని, తమ సంరక్షకుల చేతుల్లోనో లేదా ఆరోగ్య నిపుణుల చేతుల్లోనో కూడా వీరు అనేక దూషణలు, వేధింపులు భరిస్తున్నారని తెలిపింది. అలాంటి వారికి వేసుకోవాల్సిన మందులు ఇవ్వకుండా నిలిపివేయడం, చేతి కర్ర, వీల్ ఛైర్ వంటి సహాయ పరికరాలు అందుబాటులో లేకుండా చేయడం, ఆర్థిక పరమైన అవకతవకలకు పాల్పడడం, తిట్లు ఛీత్కారాలకు దిగడం వంటివి చోటు చేసుకుంటున్నాయని పేర్కొంది. ఇలాంటి మహిళలను గుర్తించడం, వారి ప్రత్యేక అవసరాలను తీర్చడం, వారి బాధలు, కష్టాలను గుర్తించడానికి దేశాల వ్యాప్తంగా మరింత మెరుగైన పరిశోధనలు జరగాలని డబ్ల్యుహెచ్‌ఓ కోరింది. అంతర్జాతీయ, జాతీయ హింస సంబంధిత డేటాలో ఇటువంటి వారి గురించిన సమాచారం ఏదీ రాదని, వారి పరిస్థితులు, సమస్యలన్నీ కూడా ఎలాంటి పరిష్కారకాలు లేకుండా లోలోపలే వుండిపోతున్నాయని పేర్కొంది. ముఖ్యంగా తక్కువ, ఒక మోస్తరు ఆదాయాలు కలిగిన దేశాల్లో ఇటువంటి వారి గురించి డేటా అస్సలు వుండదని తెలిపింది. అధిక ఆదాయం కలిగిన దేశాలు, ప్రాంతాల్లోనే ఇటువంటి వృద్ధ, వికలాంగ మహిళలకు సంబంధించిన సమాచారం బయటకు వస్తోందని తెలిపింది. 60ఏళ్ళు అంతకు పైబడిన మహిళలపై డబ్ల్యుహెచ్‌ఓ ఒక సమీక్ష నిర్వహించింది. లైంగిక భాగస్వామి శారీరక హింస, వేధింపులనేవి అత్యంత తరచుగా కనబడే రూపాల్లో ఒకటని పేర్కొంది. భాగస్వాములు మరింత వయస్సు మీరినవారైతే ఒక్కోసారి మానసిక హింస రూపాల్లో లేదా వదిలిపెట్టేస్తామనే బెదిరింపుల రూపాల్లో కూడా బయటపడుతూ వుంటోందని పేర్కొంది. ఇలాంటి హింస చోటు చేసుకున్నపుడు సాధారణంగా వృద్ధులు, వికలాంగులు ఒంటరిగానే వుంటారు. అందువల్ల వారు తప్పించుకోవడం లేదా వీటి గురించి ఫిర్యాదు చేయడమనేది చాలా కష్టమవుతుందని పేర్కొంది. పైగా సమాజంలో వుండే వివక్ష, కళంకం వంటివి ఇలాంటి సమాచారం లేదా సేవలు అందించే అవకాశాలను తగ్గించేస్తోందని డబ్ల్యుహెచ్‌ఓలో టెక్నికల్ ఆఫీసర్ లియాన్‌మేరీ సార్దినా పేర్కొన్నారు. ఇలాంటి గ్రూపుల్లో ఈ తరహా హింస చాలా ఎక్కువగానే నెలకొందని అందుబాటులో వున్న డేటా తెలియచేస్తోందని అన్నారు. ప్రస్తుతం మహిళలపై జరిగే హింస ఇటువంటి వారికి సంబంధించిన సమాచారం కేవలం 10శాతమే వుంటోందని అన్నారు. వీరికి సంబంధించిన సర్వేలు చేపట్టడానికి వీలుగా సర్వ మాడ్యూల్స్‌ను కూడా డబ్ల్యుహెచ్‌ఓ రూపొందించింది.

టెన్త్ పరీక్షలకు 99.72 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా మంగళవారం ఐదోరోజు ఫిజికల్ సైన్స్ పరీక్షను నిర్వహించామని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 4,95,146 మంది దరఖాస్తు చేస్తే, 4,93,769 (99.72 శాతం) మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. 1,377 (0.28 శాతం) మంది గైర్హాజరయ్యారని వివరించారు. ప్రయివేటు విద్యార్థుల్లో 7,524 మంది దరఖాస్తు చేసుకుంటే, 6,592 (87.61 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. 932 (12.39 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఐదోరోజు ఒక్క మాల్‌ప్రాక్టీస్ కేసు కూడా నమోదు కాలేదనీ, పరీక్షల సిబ్బందిలో ఎవరినీ విధుల నుంచి తొలగించలేదని వివరించారు. ఈ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తెలిపారు.

పిలిస్తే పలికే నాయకుడు క్యామ మల్లేష్ : బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

పేదల ఆశాజ్యోతి, అభివృద్ధి ప్రదాత, పిలిస్తే పలికే నాయకుడు క్యామ మల్లేష్ అని పెద్ద అంబర్‌పేట మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు అన్నారు. భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా క్యామ మల్లేష్‌ను మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించడంతో పెద్ద అంబర్ పేటకు చెందిన బీఆర్ఎస్ నాయకులు చెరుకూరి జగన్, కంచర్ల సత్యనారాయణ రెడ్డి, దేశారం బాలకృష్ణ, పండుగల రాము, యంజాల రాము, నగేష్‌లు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చెరుకూరు జగన్ మాట్లాడుతూ క్యామ మల్లేష్ గెలుపు కోసం సమిష్టిగా కృషి చేస్తామని అన్నారు. ప్రజా సమస్యలపై అనేక సంవత్సరాలుగా పోరాడుతూ ఎలాంటి స్వార్థం, కల్మషం లేని నాయకుడన్నారు. భువనగిరి పార్లమెంట్ చరిత్రలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.



ఆధ్యాత్మికతను అలవర్చుకోవడం వలన ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కేపురంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో పాల్గొని మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్ గుప్తా, దేవాలయ చైర్మన్ జగిని రమేష్ గుప్తా, నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద శర్మ, నియోజకవర్గ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఊర్మిళా రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, జగన్, మహేందర్ రెడ్డి, ఋషి, యాదవ రెడ్డి, మురిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. **నవతెలంగాణ - చైతన్యపురి**

చంపాపేట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ - సంతోష్ నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. సుడిగాలి పర్యటనలో భాగంగా మంగళవారం పలు కాలనీలు, బస్తీలల్లో పర్యటించి..బాక్స్ డ్రైనేజీ వ్యవస్థ పరిశుభ్రత, పరిరక్షణను పరిశీలించారు. తర్వాత ఎం.ఆర్.ఆర్.కాలనీ, పద్మనగర్, ఉదయ్‌నగర్, సూర్యనగర్ కాలనీల యందు పర్యటించి..పలు సమస్యలను తెలుసుకున్నారు. చంపాపేట డివిజన్ పరిధిలోని ఉదయ్‌నగర్ కాలనీ నందు చుట్టుపక్కల కాలనీవాసులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఎస్ఎన్‌డీపీ పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొనిరావాలని అన్నారు. సింగిరెడ్డి శివారెడ్డి వెనుక ఉన్న సూర్య నగర్ కాలనీ వద్ద ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి చేయాలని కోరారు. అలాగే అక్కడ ఉన్న నాలా పక్కన పార్క్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు ఫోన్ చేసి ఆదేశాలు జారీ చేశారు. అవసరం ఉన్నచోట నూతన రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుంకోజు కృష్ణమాచారి, ఒరుగంటి వెంకటేష్, డివిజన్ అధ్యక్షులు రాజిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు రోజా రెడ్డి, సదానంద్ రెడ్డి, శ్రీనాథ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోపాల్ ముదిరాజ్, కాలనీల పలు అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద నివారణకు పటిష్టమైన చర్యలు

- జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్



నవతెలంగాణ - సిటీబ్యూరో

నగరంలో వీధి కుక్కల బెడద నుండి ప్రజలు సురక్షితంగా ఉండేలా జీహెచ్ఎంసీ పటిష్టమైన చర్యలు చేపట్టిందని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో అడిషనల్ కమిషనర్ రవి కిరణ్, వెటర్నరీ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశమై వీధి కుక్కల బెడద, కుక్క కాటు నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ వీధికుక్కల ప్రమాదాల బారిన పడకుండా ప్రజలకు రక్షణ కల్పించడానికి వెటర్నరీ శాఖ వీధి కుక్కలకు స్టెరిలైజేషన్, యాంటి బర్త్ కంట్రోల్ (ఏ.బీ.సీ) చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీధి కుక్కలకు రెగ్యులర్‌గా వ్యాక్సిన్ వేయాలని వెటర్నరీ అధికారులకు సూచించారు. కుక్కల దాడులు ఎందుకు జరుగుతున్నాయి అన్న దానిపై అధ్యయనం చేయాలన్నారు. కుక్క కాటుకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు, వీధి కుక్కల బెడద నివారణకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలన్న దానిపై పలు సూచనలు ఇవ్వాలని కోరారు. వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు.

మటన్, చికెన్ షాపుల నుండి వచ్చే వ్యర్థాలను ఖాళీ స్థలంలో పారవేయకుండా చూడాలని, ఎప్పటి కప్పుడు తొలగించే చర్యలు తీసుకోవాలి, ఆయా చెత్తను ప్రతీరోజు రాత్రి వేళలో ఎత్తి వేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కుక్కల బెడద నివారణకు కమ్యూనిటీ ప్రజల నుంచి సహకారం తీసుకోవాలని వారు సూచించారు. పెంపుడు కుక్కలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వాటికి వ్యాక్సినేషన్ వేయించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఫీడర్ స్వచ్ఛంద సంస్థల రిజిస్ట్రేషన్, కమ్యూనిటీ అడాప్షన్‌పై డోర్ టు డోర్ క్యాంపెయిన్‌తో ప్రజలకు అవగాహన కల్పించాలని వారు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కోర్ కమిటీ ఏర్పాటు తర్వాత సలహాలు, సూచనలతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపి ప్రభుత్వ అనుమతితో అమలుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వెటర్నరీ చీఫ్ డా.అబ్దుల్ వకీల్, బ్లూ క్రాస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అక్కినేని అమల, కుమారి, పీపుల్ ఫర్ యానిమల్స్ ప్రతినిధి వి.వాసంతి, కమాండో కెన్నల్స్ ఫిలిప్ బట్, యానిమల్ ఎయిడ్ సొసైటీ ప్రతినిధి అర్చన నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైశ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తా



- చైర్మెన్ కల్వ సుజాత గుప్త

నవతెలంగాణ - చైతన్యపురి

వైశ్యుల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్త అన్నారు. కర్మన్‌ఘాట్ లక్ష్మి కన్వెన్షన్‌లో వైశ్య వికాస వేదిక చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్త ఆధ్వర్యంలో తెలంగాణ వైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కల్వ సుజాత గుప్తను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వంలో వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయలేదని, వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని కొనియాడారు. కార్పొరేషన్ ద్వారా పేద వైశ్యుల విద్య, వైద్యం, ఇండ్ల సహకారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వైశ్య వికాస వేదిక చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తా మట్లాడుతూ వైశ్య కార్పొరేషన్ ఏర్పాటుతోపాటు వైశ్య కమిషన్ కూడా ఏర్పాటు చేయాలని కోరారు. జనాభా ప్రాతిపదికన వైశ్యులకు రాజకీయంలో కూడా సమాన హక్కు, సమాన వాటా అందించాలన్నారు. రాష్ట్ర జనాభాలో నాలుగు శాతం వాటాగా 30 లక్షల జనాభా ఉన్న వైశ్యులకు రాజకీయంగా సరైన ప్రాతినిధ్యం దక్కట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాచం సుష్మగుప్త, కల్వ శంకర్, వైశ్య వికాస వేదిక జనరల్ సెక్రటరీ నంగునూరు రమేష్, సభ్యులు రామ్ నరేష్, శ్రీనివాస్, కొత్త రవి, కోడమూరి దయాకర్, కాచం సాయి, వివిధ జిల్లాల నుండి వైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రూ.16,04,590 నగదు పట్టివేత

- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

నవతెలంగాణ - సిటీబ్యూరో

జిల్లాలో ఎన్నికల ఎన్‌ఫోర్సుమెంట్ బృందాల ద్వారా మంగళవారం రూ. 16,04,590నగదు, రూ.2,32,582 విలువ గల వివిధ రకాల వస్తువులతోపాటు 291.85 లీటర్ల లిక్కర్ సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.2,40,86,390ల నగదు, రూ. 35,24,153 విలువ గల విలువైన వస్తువులను సీజ్ చేసినట్టు వివరించారు. 1336.91లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకొని 94 మందిపై కేసులు నమోదు చేసి 96 మందిని అరెస్ట్ చేయగా, 110 ఎఫ్.ఐ.ఆర్‌లు నమోదు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన నాటి నుండి ఇప్పటి వరకు సీజ్ చేసిన నగదులో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు రూ. 1,05,82,090, పోలీస్ అధికారులు రూ.1,33,54,300, ఎస్ఎస్‌టీ టీమ్ రూ.1,50,000 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. నగదు, ఇతర వస్తువుల రవాణాపై 137 ఫిర్యాదులు రాగా వాటిని పరిశీలించి పరిష్కారం చేసినట్లు పేర్కొన్నారు.

ధర్మబిక్షం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



- వర్కర్స్ పార్టీ డిమాండ్

నవతెలంగాణ - ఎల్బీనగర్

తెలంగాణ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ బొమ్మగాని ధర్మబిక్షం విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు రాయబండి పాండురంగా చారి, వీ.సీ.కే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలకర శ్రీనివాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామ్రేడ్ ధర్మబిక్షం 13వ వర్ధంతిని కొత్తపేటలో వర్కర్స్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర నాయకులు ఎస్వీ రాములు అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో బలమైన పోరాటాలు నిర్వహించి కామ్రేడ్ ధర్మబిక్షం చరిత్ర సృష్టించారని గుర్తుచేశారు. భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాటంలో పేద ప్రజల పక్షాన ఉద్యమాలకు ఊపిరిపోసిందని కొనియాడారు. మరొకవైపు దున్నేవానికి భూమి, గీసేవానికి చెట్టు అనే నినాదంతో పార్లమెంట్ వరకు తీసుకపోయిన నాయకుడు అని అన్నారు. చేతి వృత్తిదారులకు అండగా నిలిచి, హక్కులు కోసం సాధించేవరకు ఉద్యమించారని చెప్పారు. వారి ఆశయాలను, సిద్ధాంతాలను ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత మనందరీపై ఉందన్నారు. నివాళులర్పించిన వారిలో వర్కర్స్ పార్టీ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పూజారి శ్రీను, వీకేసీ పార్టీ నాయకులు మచ్చ దేవేందర్, చెరుపల్లి ఆనంద్, మల్లాపురం వెంకటేష్ యాదవ్, వర్కర్స్ పార్టీ నాయకులు మమ్మద్ ఇస్మాయిల్, వర్రే ఇస్తారి, మునుకుంట్ల మురళి, విజయలక్ష్మి, పురుషోత్తం చారి తదితరులు పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం'



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని తుర్కయంజాల్ మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ మర్రి మాధవి మహేందర్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మున్సిపాలిటీ 8వ వార్డులో కమిషనర్ బి.సత్యనారాయణ రెడ్డితో కలిసి అరుంధతి కాలనీ, బృందావన్ కాలనీ, వైట్ ఫీల్డ్, సరిగమ సిటీ తదితర కాలనీలల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాధవి మహేందర్ రెడ్డి, కమిషనర్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకుండా ప్రతి ఒక్కరూ జూట్ బ్యాగులను ఉపయోగించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త ఆటోలోనే వేయాలని కోరారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో రోడ్డుకు ఇరువైపులా పొదలను తొలగించుట, గుంతలను పూడ్చుట, రోడ్లను చదును చేయుట, ప్లాస్టిక్ సేకరణ, రోడ్లను శుభ్ర పరుచుట, కాలనీలల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయుట, దోమల లార్వాను నియంత్రించే రసాయనాలను పిచికారి చేయుట వంటి కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఈఈ హరీష్, నగేష్, జవాన్ మధు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పెంచిన టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి

- ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య యాదవ్, గ్యార నరేష్



నవతెలంగాణ - సంతోషనగర్

పెంచిన టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలని ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య యాదవ్, గ్యార నరేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం వారు మాట్లాడుతూ టెట్ పరీక్ష ఫీజును అధికంగా పెంచడం వలన నిరుద్యోగులపై పెను భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఒక పేపర్‌కు రూ.200, 2 పేపర్లకు 300 ఫీజు ఉండేదని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు ఒక పేపర్‌కు రూ.1000, రెండు పేపర్లకు 2000 రూపాయల ఫీజు పెట్టడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశ పరీక్షలు ఫీజులు తగ్గించి, తక్కువ ఫీజులతో పోటీ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారని గుర్తుచేశారు. కానీ ఎన్నికల హామీకి విరుద్ధంగా అధిక ఫీజు పెట్టారని మండిపడ్డారు. ఇప్పటికే బీఆర్ఎస్ పాలనలో పరీక్ష ఫీజులు కట్టి, కోచింగ్ తీసుకొని పరీక్షల్లో అవకతవకల వలన నిరుద్యోగులు ఆర్థికభారంతో ఉన్నారని తెలిపారు. రేపటి నుంచి టెట్ పరీక్ష ఫీజు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో పాత ఫీజునే తీసుకోవాలని కోరారు. అదే విధంగా పరీక్ష సెంటర్లను కూడా నిరుద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా సెంటర్ల సంఖ్య కూడా పెంచాలన్నారు.



శాస్త్రీయమైన పద్ధతిలో వేతన సవరణ జరగాలి

- తెలంగాణ రాష్ట్ర మెడికల్, పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్1 వ్యవస్థాపక అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి



నవతెలంగాణ- నాగోల్

అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక సంఘాల సూచన మేరకు శాస్త్రీయమైన పద్ధతిలో వేతన సవరణ జరగాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రెండోవ వేతన సవరణ సంఘం చైర్మన్ ఎన్.శివశంకర్ ఆధ్వర్యంలో ఐఏఎస్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందజేసినట్టు తెలంగాణ మెడికల్, పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ వన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధనలో ఉద్యోగులు ఉద్యోగ నిబంధనలను పక్కన పెట్టి మరి పోరాటం చేశారని కొనియాడారు. ప్రతి ఐదేండ్లకు సవరించాల్సిన వేతనాలను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం 01-7-2018 నుండి రావాల్సిన మొదటి పే రివిజన్ 30 నెలలు ఆలస్యం జరగడం వలన రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక వర్గం దారుణంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ -19తో రెండు దఫాలుగా వచ్చిన కరోనా మహమ్మారి నుండి ప్రాణాలకు తెగించి ప్రజానీకానికి సేవలందించినందుకు వైద్య, ఆరోగ్య శాఖ ఫీల్డ్ సిబ్బందికి (తెలంగాణ ఇంక్రిమెంట్ లాగా) స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. ఎంపీహెచ్‌ఏ (ఎఫ్)లకు ఒకే క్యాడర్ నందు 12 ఏండ్ల సర్వీస్ పూర్తి అయినప్పటికీ ఎస్‌పీపీఏ 1 గ్రేడ్ ఇవ్వకుండా ఎల్ హెచ్‌వి ట్రైనింగ్‌తో ముడి పెడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.

వైద్య, ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్ఎం ఔట్ సోర్సింగ్ కాంటింజెంట్ ఉద్యోగులకు కూడా వేతన సవరణ వర్తింప చేయాలి. అదేవిధంగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు 180 రోజులకు సూచించాలని కోరారు. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ మరియు వేజెస్ కమిటీ సిఫార్సుల మేరకు కనీస వేతనం రూ.30000 అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ అసోసియేట్ ప్రెసిడెంట్ జి. రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. సోమయ్య, రాష్ట్ర మహిళా నాయకురాలు యాదమ్మ, ఖమ్మం జిల్లా కోశాధికారి సందీప్, ఉపాధ్యక్షుడు సురేష్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మల్లయ్య, కోశాధికారి రామచంద్రయ్య, నిజామాబాద్ నాయకులు సోమశేఖర్ పాల్గొన్నారు.

శ్రీహిల్స్ కాలనీ అధ్యక్షుడిగా వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడలోని శ్రీహిల్స్ కాలనీలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో జరిగిన నూతన కార్యవర్గం ఎన్నికల్లో అధ్యక్షుడిగా నడింపల్లి వెంకటేష్ గౌడ్ విజయం సాధించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ జనరల్ సెక్రెటరీగా కోట్ల శ్యామ్ రావు, కోశాధికారిగా చల్లమల వెంకట్ రెడ్డిని ఎన్నుకున్నట్టు తెలిపారు. కాలనీ సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకుని రావాలని కాలనీవాసులకు సూచించారు. ఎన్నికలు నిర్వహించిన రవీంద్ర చారి, శ్రీధర్ రెడ్డిలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు కేతావత్ బహుగుణ నాయక్, శివానందరెడ్డి, జంగాచారి, బాల నారాయణ, కేశవరావు, వనం శ్రీనివాసులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



4న 'సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్' అవార్డుల ప్రదానం

నవతెలంగాణ - సిటీబ్యూరో

ప్రముఖ సామాజిక సేవా సంస్థ సుచిరిండియా ఫౌండేషన్ 31వ సర్ సీవీ రామన్ టాలెంట్ సెర్చ్ పరీక్షను జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ పాఠశాలల్లో నిర్వహించింది. 1500 పాఠశాలల నుంచి లక్ష మంది విద్యార్థులు పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా, తెలుగు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన 31వ జాతీయ స్థాయి సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షల్లో 16 మందికి గోల్డ్ మెడల్స్, 16 మంది ర్యాంకేర్స్‌కి, 396 డిస్ట్రిక్ ర్యాంకేర్స్‌కి, 8 మందికి ఛత్రలయా పురస్కార్ అవార్డ్స్, 8 మందికి గురు బ్రహ్మ అవార్డ్స్, రాష్ట్రా స్థాయి



మెడల్స్, జిల్లా స్థాయి ర్యాంక్స్ వచ్చిన యువ టాలెంట్ విద్యార్థులకు శ్రీ సత్యసాయి నిగమాగమంలో అవార్డులు ప్రదానం చేయనున్నట్టు సూచిరిండియా ఫౌండేషన్ నిర్వహకులు లయన్ కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డాక్టర్ జి. సతీష్‌రెడ్డి, రక్షా మంత్రికి మాజీ సైంటిఫిక్ అడ్వైజర్, సెక్రెటరీ డీడీ చైర్మెన్ డీఆర్‌డీవో హెచ్‌ఈ, నికోలాయ్ హ్రిస్టోవ్ యాంకోవ్, భారతదేశానికి రిపబ్లిక్ ఆఫ్ బల్గేరియా అంబాసిడర్ అసాధారణ అండ్ ప్లీనిపోటెన్షియరీ, చంద్రబోస్ అస్కార్ అవార్డు గ్రహీత, టాలీవుడ్ గీత రచయిత, గాయకుడు పాల్గొననున్నారు.



హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన చేవెళ్ళ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. నవతెలంగాణ-బడంగ్‌పేట్

బాలాపూర్‌లో వేదాంత జ్ఞాన సభలు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, సద్గురు మలయాళ స్వామి భక్త బృందం సంయుక్తంగా బాలాపూర్ ఎస్‌పీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న 98వ శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభలు మంగళవారం 2వ రోజు భక్తి శ్రద్ధలతో కొనసాగాయి. పరమ పూజ్యశ్రీ పరిపూర్ణానందగిరి స్వాముల వారిచే భగవద్గీత అధ్యాయాల సామూహిక పారాయణ చేశారు. అనంతరం దేవీ ఉపాసకులు బ్రహ్మశ్రీ మురుకుంట్ల రాజేశ్వర శర్మ నేతృత్వంలో ఆయుష హెూమం, భక్తులచే సామూహిక మృత్యుం జయ యజ్ఞం నిర్వహించారు. అనంతరం జరిగిన ప్రత్యేక స్త్రీల సభలో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన మాతాజీలు సనాతన ధర్మము గురించి వివరించారు. ఈ సభలో ప్రముఖ ఆధ్యాత్మిక వక్త,మాతృశ్రీ కొంపెల్ల మాధవీలత ఉపన్యాసం భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆమెను నిర్వాహకులు ఘనంగా పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించి అమ్మవారి త్రిశూలాన్ని బహుకరించారు. పూజ్యశ్రీ పరిపూర్ణానందగిరి స్వామి వారికీ భక్తులు మహేష్, సులోచన, సాయికిరణ్ దంపతులు తులాభారం చేశారు.



'వెల్ నెస్ లీగ్ విజేతలను ప్రకటించిన మెడిబడ్డీ'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

దేశంలోని అతిపెద్ద డిజిటల్ హెల్త్ కేర్ ప్లాట్‌ఫారమ్ అయిన మెడిబడ్డీ తమ వెల్‌నెస్ లీగ్ (ఎండబ్ల్యూఎల్)-2023 విజేతలను ప్రకటించినట్లు మెడబడ్డీ వెల్ నెస్ ప్రతినిధి సుచిత్ర అయ్యర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండబ్ల్యూఎల్ తొలి ఎడిషన్ ముగియడంతో మెడిబడ్డీ ప్రచారం అద్భుతమైన విజయాన్ని అందుకుందన్నారు. కార్పొరేట్ సంస్థల నుండి అపూర్వమైన స్పందన వస్తుందన్నారు. మొదటి ఎడిషన్‌లో 150 పైగా నగరాల్లోని మొత్తం 500 కార్పొరేట్‌లు ఉత్సాహంగా పాల్గొని, గొప్ప విజయాన్ని అందించారన్నారు. ఈ లీగ్ ఆకట్టుకునే రీతిలో దాదాపు 61,000 లక్షల పైగా రిజిస్ట్రేషన్‌లను పొందిందని, ఇది ఉద్యోగులు తమ ఆరోగ్యం, వెల్ నెస్ కు ప్రాధాన్యత ఇవ్వడంలో చూపుతున్న బలమైన ఆసక్తిని ప్రతిబింబిస్తుందని, దాదాపు రెండున్నర నెలల పాటు సాగిన లీగ్‌లో 55,000 మందికి పైగా ఔత్సాహికులు వివిధ కార్యకలాపాలు, సవాళ్లలో చురుకుగా పాల్గొన్నారు.ప్రతి క్రీడా కారుడికి శారీరక శ్రమ, ఆరోగ్యకరమైన ఆహారం నుండి మానసిక ఆరోగ్య శ్రేయస్సు వంటి కు కార్యకలాపాలలో వారి భాగస్వామ్యం ఆధారంగా పాయింట్లు ఇవ్వబడ్డాయని, ఈ విజేతలు ఉద్యోగి శ్రేయస్సును ప్రోత్సహించడానికి ఉన్నత ప్రమాణాలను ఏర్పరచడమే కాకుండా తమ రోజువారీ జీవితంలో ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడానికి వారి సహచరులను ప్రేరేపించారని పేర్కొన్నారు.

సివరేజీ సమస్య పరిష్కారాన్ని ప్రత్యేక చర్యలు

- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

సివరేజీ సమస్య పరిష్కారాన్ని ప్రత్యేక చర్యలు తీసుకుంటామని గాంధీ నగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. డివిజన్‌లోని వివి గిరి నగర్ బస్తీలో ఏర్పడుతున్న సివరేజీ సమస్యలపై స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు వాటర్ వర్క్స్ మేనేజర్ కృష్ణ మోహన్‌తో కలిసి కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ బస్తీలో పర్యటించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. బస్తీలో సివరేజీ సమస్య పునరావృత్తం కాకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, నాయకులు ఎం.ఉమేష్, సాయి కుమార్, స్థానిక బస్తీ వాసులు శ్రీనివాస్, సాయి కృష్ణ, శాంతి కుమార్,సాయి తరుణ్ పలువురు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 46ను ప్రభుత్వం రద్దు చేయాలి

- బాధితుల డిమాండ్



నవతెలంగాణ-ముషీరాబాద్

జీవో నెంబర్ 46ను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయకుండా నిరుద్యోగులకు అన్యాయం చేస్తుందని జీవో నెంబర్ 46 బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను ఆదుకోవాలని పత్రిక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. కానిస్టేబుల్ లో పోస్ట్ కోడ్ 24కు సంబంధించిన తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీఎస్ఎస్‌పీ) పోస్టులకు సంబంధించిన జీవో నెంబర్ 46 కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉండగానే వాళ్లకు ట్రైనింగ్ డేట్లు ప్రకటించడం అనేది అన్యాయమని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను భయాందోళన గురి చేయడమే బోర్డు పనిగా పెట్టుకుందన్నారు. కేసు ఫైనల్ జడ్జిమెంట్ వచ్చే వరకు శిక్షణను నిలిపివేయాలని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తుందని వాపోయారు. రాబోయే ఎంపీ ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల పక్షాన నిలబడాలని కోరుకుంటున్నామన్నారు. లేదంటే రాబోయే ఎంపీ ఎన్నికల్లో ప్రతి ఒక్క నియోజకవర్గంలో 100 మంది నిరుద్యోగులు నామినేషన్ వేసి ఎన్నికల్లో నిలబడి కాంగ్రెస్ పార్టీని ఓడిస్తామని నిరుద్యోగులు హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికార అధికారంలోకి రాగానే జీవో నెంబర్ 46 ని రద్దు చేస్తామని చెప్పి గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఓడిస్తామన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాణిక్ రావు..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో హైదారాబాద్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పి.మాణిక్ రావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనం తరం మాణిక్‌రావు రేవంత్ రెడ్డికి, ఎంపీ రంజిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించినందుకు తెలంగాణ భవన్‌లో అఖిల భారత యాదవ మహాసభ అంబర్‌పేట కన్వీనర్ జంగాల అనిల్ కుమార్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. నవతెలంగాణ-అంబర్‌పేట

నిజాం కళాశాల గ్రౌండ్‌లో

పోస్టల్ బ్యాలెట్ కేంద్రాల ఏర్పాటు

- ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగుల కోసం ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో ఎన్నికల డ్యూటీలో ఉన్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు నగరంలోని బషీర్‌బాగ్ లోని నిజాం కళాశాల గ్రౌండ్‌లో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం బషీర్ బాగ్ లోని నిజాం కళాశాల గ్రౌండ్‌ను ఆయన సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి పాటిల్ హేమంత్ కేశవ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంటరీ అసెంబ్లీ సెగ్మెంట్లు, కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్, రాష్ట్రంలోని ఇతర పార్లమెంటరీ నియోజవర్గాలకు చెందిన ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ పేపర్లను ఇచ్చేందుకు నిజాం కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ మే 7, 8, 9, 10 తేదీల్లో, మే 11, 12 తేదిల్లో రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు (ఆర్‌సీడీసీ) సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్స్, సికిం ద్రాబాద్ పార్లమెంటరీ అసెంబ్లీ సెగ్మెంట్లు, కంటోన్మెంట్ 1, రాష్ట్రంలోని ఇతర పార్లమెంటరీ నియోజవర్గాలకు చెందిన ఎన్నికలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కోసం 15 మొత్తం 30 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. పిడబ్ల్యుడి వారికోసం కళాశాల గ్రౌండ్ లోని 2వ గేట్, అందరి కోసం గేట్ నెంబర్ 4 ద్వారా కేంద్రాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలలో ఇబ్బందులు కలగకుండా బ్యారి కేటింగ్, పోల్ డ్యూటీ ఉన్న వారికి భోజనాలు ఏర్పాటు చేయాలని, తాగునీరు, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీఓ కే మహిపాల్, స్పెష ల్ డిప్యూటీ కలెక్టర్, నాంపల్లి తాసిల్దార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాములు, పోలీస్, రెవెన్యూ అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయ్యిందని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. మంగళవారం తన ఛాంబర్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారుల సమక్షంలో పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఏప్రిల్ 1, 2 తేదీల్లో నియోజక వర్గ స్థాయిలో శిక్షణ ఇవ్వాలని, ఎన్నికల విధులు నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ అందించి పోస్టల్ బ్యాలెట్ పై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ ఆదేశించారు. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మొత్తం 3,986 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, ఎలక్షన్ అడిషనల్ కమిషనర్ మంగతాయారు, ట్రైనింగ్ నోడల్ అధికారి సునంద, డీప్యూటీ కలెక్టర్ అర్చన, జిల్లా స్థాయి శిక్షణ అధికారులు మమత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా తనను ప్రకటించిన సందర్భంగా మంగళవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి ఎమ్మెల్యే కెటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపిన గడ్డం శ్రీనివాస్ యాదవ్, ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

తెలుగు డాక్టర్‌కు సొసైటీ ఆఫ్ సర్జికల్ ఆంకాలజీ అమెరికా పిలుపు



నవతెలంగాణ-బంజారా హిల్స్

సొసైటీ ఆఫ్ సర్జికల్ ఆంకాలజీ యూఎస్ఏ వారి పిలుపు 2024వ వార్షికోత్సవ ప్రసంగాన్ని ఇవ్వాలని తెలుగు రాష్ట్రాలకు చెందిన బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ అండ్ ఇండస్ట్రీ మెడికల్ డైరెక్టర్, డా.టి సుబ్రహ్మణ్యేశ్వర రావు, ప్రత్యేక ఆహ్వానం అందుకొని అరుదైన గౌరవం సాధించిన ఘనత ఆయనకు దక్కింది. డా. టి యస్ రావు లాన్సెట్ వారి గ్లోబల్ ఆంకాలజీ కమిషన్ అంబాసిడర్‌గా క్యాన్సర్ శస్త్ర చికిత్సా పద్ధతులను మెరుగు పరచడం విస్తరించడానికి చేసిన కృషిని గుర్తించి తమ 2024 వార్షిక సమావే శంలో దక్షిణాసియా దేశాలలో క్యాన్సర్ సర్జన్స్ కు శిక్షణ అన్న అంశంపై ప్రసం గించాలన్న అరుదైన గౌరవాన్ని సొసైటీ ఆఫ్ సర్జికల్ ఆంకాలజీ, యుఎస్ఏ వారు అందించారని ఆసుపత్రి యాజమాన్యం ప్రకటించింది. ఆహ్వానం మేరకు జార్జియా వరల్డ్ కాంగ్రెస్ సెంటర్, అట్లాంటా నగరం, జార్జియా రాష్ట్రంలో జరిగిన 2024 వార్షిక సమావేశంలో ప్రసంగించిన డా. టి యస్ రావు దక్షిణాసియాలో క్యాన్సర్ సర్జన్స్‌కు అవసరమైన శిక్షణా పద్ధతులను మెరుగు పరచడానికి తీసుకోవాల్సిన పలు చర్యలను వివరిస్తూ ఈ విషయంలో తన అనుభవాలను పంచుకొన్నారు. సొసైటీ ఆఫ్ సర్జికల్ ఆంకాలజీ, యుఎస్ఏ లాంటి సంస్థ యొక్క వార్షిక సమావేశంలో పాల్గొని ఉపన్యసించి ఇంతటి అరుదైన గౌరవాన్ని సాధించిన డా.టియస్ రావును నేడు హాస్పిటల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో పాటు అనంతరం సొసైటీ ఆఫ్ సర్జికల్ ఆంకాలజీ వారి 2024 వార్షిక సమావేశంలో పాల్గొన్న వైద్యులు డా. కెవివి యస్ రాజు, డా. సృజన్ శుక్లా, డా. బి మధునారాయణ లను కూడా అబినందిస్తు మంగళవారం బంజారా హిల్స్ లోని ఆసుపత్రిలో సత్కరించారు.

దోమలగూడ హనుమాన్ దేవాలయం హుండీ లక్కింపు



నవతెలంగాణ- ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం కవాడిగూడ డివిజన్ దోమలగూడ శ్రీ హనుమాన్ దేవాలయం హుండీ లక్కింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఆరు మాసాలకు సంబంధించిన ఈ హుండీ లక్కింపు కార్యక్రమాన్ని ఆలయ ఈవో ఎం.దేవనాథ్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖలు పర్యవేక్షించారు. ఆలయం ఆదాయం లక్షా 43 వేల 570 రూపాయలు వచ్చిందని ఆలయ ఈవో ఎం.దేవనాథం, ఇన్ స్పెక్టర్ సురేఖ తెలిపారు. ఈ హుండీ లక్కింపు కార్యక్ర మంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గొల్లగడ్డ రాజశేఖర్ గౌడ్, భక్తులు కెఆర్‌కె.ప్రసాద్, వేణుగోపాల్, పరమేశ్వర్, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మీ నారాయణ, సంతోష్ కుమార్, రా హుల్, విడి.నరసింహారావు, వెంకట్ రెడ్డి, సంజయ్ సింగ్, లక్ష్మణ్, సురేష్, శేఖర్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

యశోదా ఆర్గానిక్ సంస్థకు ఇన్నోవేటివ్ అవార్డు



నవతెలంగాణ-ముషీరాబాద్

ది కనెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని యశోదా ఆర్గానిక్స్ సంస్థకు ఇన్నోవేటివ్ బిజినెస్ అవార్డును అందజేశారు. డిపార్టుమెంట్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ ఆఫ్ తెలంగాణ స్టేట్ హెడ్ జయేష్ రంజన్, మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మెన్ జస్టిస్ జి.చంద్రయ్య చేతుల మీదుగా యశోధా ఆర్గానిక్స్ ప్రొపరేటర్ జి. అశోక్ కుమార్ ఈ అవార్డును అందుకున్నారు. అనంతరం బాగ్‌లింగంపల్లి లోని యశోదా ఆర్గానిక్స్ సంస్థలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అశోక్ కుమార్ మాట్లాడుతూ గత ఆరేళ్లగా గానుగ నూనెలు, ఆర్గానిక్ సిరిధాన్యాలు, పప్పులు తదితర వస్తువులను సరసమైన ధరలకు విక్రయిస్తున్నందుకు ఈ అవార్డును ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. కల్తీ లేని ఆహార పదార్థాలను అందజేస్తున్నందుకు తమను గుర్తించి ఇన్నోవేటివ్ అవార్డు ఇవ్వడం ఆనందాయకమన్నారు. మరింతగా కల్తీ లేని ఆహార పదార్థాలను విక్రయిస్తు తమ సేవలను విస్తృతం చేస్తామని తెలిపారు.

'ఎంఎల్ఆర్ఐటీ'లో 28 వరకు జీఐ మహెూత్సవ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఈ నెల 26- 28వ తేదీ కాలేజీకి చెందిన ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో జీఐ (జియోగ్రాఫికల్ ఇండికేషన్) మహెూత్సవ్‌ను మూడు రోజుల పాటు కాలేజీలో నిర్వహించనున్నారు. మొదటి రోజు కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. భారత ప్రభుత్వ చిన్న, మాధ్యమిక పరిశ్రమల శాఖ వారు జియోగ్రాఫికల్ ఇండికేషన్ వస్తువులు, ఉత్పత్తులను ప్రోత్సహించాలని తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా కళాశాలలో మూడు రోజుల పాటు 58 స్టాల్స్‌లో పలు రకాల జియోగ్రాఫికల్ ఇండికేషన్ వస్తువులు, ఉత్పత్తులను ప్రదర్శిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ ఈ స్టాల్‌ను సందర్శించి ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎంఎల్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జీఐ మహెూత్సవ్ గ్రాండ్ ప్రారంభోత్సవం ఒక అద్భుతంగా జరిగింది. ఉత్సాహంతో, సంస్కృతి, సంప్రదాయం, ఆవిష్కరణలతో ప్రారంభమైంది. ఎంఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మెన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ట్రెజరర్ మర్రి మమతారెడ్డి, డైరెక్టర్ శ్రేయారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ రావు, డాక్టర్ వివేక్ ఆనంద్ సహా గౌరవ అతిథులకు ఈ వేడుక స్వాగతం పలికింది. ఐపీఎఫ్‌సీ ఎంఎల్ఆర్ఐటీ హెడ్, కపిటి ఓవర్సీస్ సీఈఓ సురేష్ కపిటి, బోల్డ్ నైట్ వ్యవస్థాపకుడు, ఈసీఓ నవీన్ కుమార్ తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్‌చార్జి డాక్టర్ వై. బలరామ్, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ శుభాంగిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకునే కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.. సాంస్కృతిక ప్రదర్శనతోపాటు, సందర్శకులు చేనేత ప్రదర్శనలను మెచ్చుకున్నారు. సాంప్రదాయ భారతీయ వస్త్రాల వెనుక ఉన్న క్లిష్టమైన హస్తకళలను చూశారు. ఈ వెంట్‌లోలో మొత్తం 58 స్టాల్స్ ఉన్నాయి. ప్రతి ఒక్కటి ప్రత్యేకమైన ఉత్పత్తులు, అనుభవాలను అందిస్తోంది. తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్-టీఎస్‌సీఓ, కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, పోచంపల్లి, నిర్మల్ పెయింటింగ్స్, కొండపల్లి టాయ్స్, సింగరేణి స్టాల్, మరెన్నో ముఖ్యమైన స్టాల్స్‌లో ఉన్నాయి. ఈ జీఐ మహెూత్సవ్ సంస్కృతి, వ్యవస్థాపకత సామరస్య సమ్మేళనానికి నాంది పలికింది. ఆకర్షణీయమైన ప్రదర్శనలు, క్లిష్టమైన ప్రదర్శనలు, హృదయపూర్వక అభినందనల ద్వారా, ఈ ఈవెంట్ భారతదేశం గొప్ప వారసత్వం, వినూత్న స్ఫూర్తిని జరుపుకోవడానికి ఒక శక్తివంతమైన స్వరాన్ని సెట్ చేసింది. ఈ సందర్భంగా కాలేజీ వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఈ ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు స్థానిక విక్రేతలను ప్రోత్సహిస్తాయనీ, పెంచుతాయని తెలిపారు. ప్రతి అంశంలో సమాజ ప్రయోజనాల కోసం పని చేసే వేదిక అని తెలిపారు.

కేసీఆర్ గొప్ప నాయకుడు..

ఆయన పక్కన ఉన్నవాళ్లే భ్రష్టు పట్టించారు

- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



నవతెలంగాణ-బంజారా హిల్స్

కెసిఆర్ గొప్ప నాయకుడని ఆయన పక్కన ఉన్న వాళ్లే కేసీఆర్‌ను భ్రష్టు పట్టించారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. సికింద్రాబాద్ ఎంపీగా గెలిచి పార్లమెంట్‌కి వెళ్తానని దానం అన్నారు. తన అభ్యర్థిత్వంపై కేటీఆర్ న్యాయస్థానానికి వెళ్లితే తాను న్యాయస్థానంలోనే సమాధానం చెప్తానన్నారు. వాళ్ల చేసింది సభబైతే ఇప్పుడు జరుగుతున్నది సబబేనన్నారు. ముఖ్యమంత్రిపై అనవసర ఆరోపణలు చేయడం సరికాదని మూడు నెలల్లో ముఖ్యమంత్రి రూ.3500 కోట్లు సంపాదిస్తే పది సంవత్సరాలలో వాళ్ల ఎన్ని సంపాదించి ఉండొచ్చు అని ప్రశ్నించారు. తాను ఆస్తులు కాపాడుకోవడానికి పార్టీ మారినట్లు వస్తున్న ఆరోపణలో నిజం లేదని, బీఆర్ఎస్‌లో చేరిన తర్వాత తాను ఆస్తులు కూడా పెట్టినట్టు చూపిస్తే అంతా వదులుకునేందుకు సిద్ధమన్నారు. బీఆర్ఎస్‌లో ఓ కార్యకర్తలాగానే పని చేశానని, ఇప్పుడు ఓ కార్యకర్తలాగానే పని చేస్తూ ఎంపీగా పోటీకి సిద్ధమైనట్లు ప్రకటించారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికలలో తనదే విజయమని అనంతరం ఖైరతాబాద్ కు ఉప ఎన్నిక జరగడం అందులో తమ పార్టీకి చెందిన అభ్యర్థి విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు. కవిత అరెస్టుపై మీడియా ప్రశ్నించగా ఒక ఆడబిడ్డ గురించి తను మాట్లాడలేనని తెలిపారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇచ్చిన ఇఫ్తార్ విందులో జేబుదొంగలు, వారి పనుల్లో బీజీ అయ్యారు.. సుమారు 8 నుండి 10 వరకు సెల్ ఫోన్లు పోయినట్టు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు.

పాడైపోయిన రోడ్లకు బీటీ ప్యాచ్ వర్క్‌లు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజా సింగ్, జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆదేశాలతో ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామని జాంబాగ్ డివిజన్ జనరల్ సెక్రెటరీ కె.రామకృష్ణ (కట్టప్ప) తెలిపారు. మంగళవారం జాంబాగ్ డివిజన్ లోనీ ఎస్బిఐ బ్యాంక్ దగ్గర పుసలాబస్తి జాంబాగ్ రోడ్ లో పాడైపోయిన రోడ్లకు బీటీ ప్యాచ్ వర్క్‌లు వేశారు. ఈ ప్రవీణ్ బాబు, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

సిటీ కాలేజీలో ఘనంగా హెూలీ వేడుకలు



నవతెలంగాణ-ధూల్‌పేట్

పాతబస్తీలోని సిటీ కళాశాలలో హెూలీ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సభావట్ కళ్యాణ్ ఆధ్వర్యంలో కళాశాలలో చదువుకునే విద్యార్థులందరూ కలిసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాటలకు నృత్యాలు చేస్తూ ఆటపాటలతో సందడి చేశారు. కళాశాలలో ప్రతి పండుగను విద్యార్థులందరూ ఇలానే కలిసికట్టుగా జరుపుకుంటామని వారు తెలిపారు.



కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీకి చెందిన ఎస్‌ఎల్‌ఎఫ్ లీడర్ సుందరి తన అనుచరులు 30మందితో కలసి కాంగ్రెస్ నాయకురాలు రజిత అధ్వర్యంలో బాలానగర్ పార్టీ కార్యాలయంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరుతున్న మహిళలకు కాంగ్రెస్ పార్టీ కండువా వేసి స్వాగతించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పని చేసి అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనకు ఆకార్షితులై పార్టీలో చేరిన మహిళలకు మరోసారి స్వాగతం పలుకుతునన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బాలానగర్

నేడు జేఎన్‌టీయూ హెచ్‌లో మెగా హెల్త్ క్యాంపు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్‌టీయూ యూనివర్సిటీలో నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్‌ఎస్‌ఎస్)యూనివర్సిటీ యూనిట్ ఈ నెల 27, 28 తేదీల్లో యూనివర్సిటీ క్యాంపస్‌లో గల హెల్త్ సెంటర్‌లో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగామ్ కోర్డినేటర్ డాక్టర్ ఎస్.శోభా రాణి తెలియచేసారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు యూనివర్సిటీ పబ్లిక్ రిలేషన్ ఆఫీస్ డాక్టర్ ప్రసన్న, యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.పద్మావతిలు మాట్లాడుతూ ఈ మెగా హెల్త్ క్యాంపు లో అపోలో హాస్పిటల్స్, వాసన్ ఐ కేర్,ఎంఎన్జే కాన్సర్ హాస్పిటల్ వారు వారి వారి అనుభవం గల వైద్యులచే పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మెగా హెల్త్ క్యాప్ లో బీపీ, ఆర్బిఎస్, బీఎంఐ, క్యాడియాలజీ, ఈసీజీ ఈకో, డెర్మా టాజీ, కాస్ మీటలాజీ, బోన్ డిస్సి, డెంటల్ చెకప్, మహిళలకు కాన్సర్ చెకప్, బ్రెస్ట్ సోనోమమ్మొ గ్రఫీ, తదితర అనేక పరీక్షలు నిర్వహించనున్నారు. యూనివర్సిటీ ఉద్యోగస్తులు, కాలేజీ విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నాలని తెలిపారు. యూనివర్సిటీలోని ప్రతీ ఒక్కరు ఇట్టి అవకాశం ఉపయోగం చేసుకోవాలన్నారు.

షాపూర్‌నగర్‌లో వ్యాపారుల తోపుడు బండ్లు తొలగింపు



- వీధి వ్యాపారులు దుకాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే
- సంఘటనలు పునరావృతమైతే పోరాటం చేస్తాం..

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అధికారుల అత్యుత్సాహం రెక్కాడితే గానీ డొక్కాడని పేద ప్రజల బ్రతుకులను చిదిమేసింది. షాపూర్ నగర్ మార్కెట్ రోడ్డులో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా మున్సిపల్ అధికారులు, సిబ్బంది మంగళవారం ఉదయం పేద వీధివ్యాపారుల వ్యాపారాలను తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేపీ.వివేకానంద షాపూర్ నగర్ మార్కెట్ రోడ్డులోని దుకాణ సముదాయాలను పరిశీలించారు. అనంతరం వ్యాపారులతో కలిసి గాజులరామారం సర్కి ల్ కార్యాలయానికి చేరుకొని ఉప కమిషనర్ మల్లా రెడ్డితో సమస్య తీవ్రతను చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ షాపూర్ నగర్ మార్కెట్ రోడ్డులో అనేకమంది వీధి వ్యాపారులు కూరగాయలు, పూలు, పండ్లను అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. వీరిని వీధి వ్యాపారులుగా కొనసాగిస్తూ జీహెచ్ఎంసీ అధికారులు గతంలో గుర్తింపు కార్డులను కూడా అందజేశారన్నారు. కానీ నేడు మున్సిపల్ అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా షాపూర్ నగర్ మున్సిపల్ షాపూర్ నగర్ మార్కెట్ రోడ్డులోని తోపుడు బండ్లు, రోడ్డు పక్కన ఉన్న దుకాణాలపై విచక్షణారహితంగా దాడులు నిర్వహించి, సామాగ్రిని, తోపుడు బండ్లను విరగొట్టి నానా హంగామా చేశారని, సదరు అధికారు లపై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే వీధి వ్యాపారుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, జనరల్ సెక్రెటరీ సిద్దిక్, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, ప్రభుదాస్, చిన్న చౌదరి, గోవర్ధన్ రెడ్డి, సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డపై మూడోసారి బీఆర్ఎస్ జెండా

- శేరిలింగంపల్లి గడ్డ బీఆర్ఎస్ పార్టీ అడ్డా
- చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం
- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకేపూడి గాంధీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో, ఆయన నివాసంలో జరిగిన సమావేశంలో కార్పొరేటర్లు హమీద్ పటేల్, రాగం నాగేందర్ యాదవ్, జూపల్లి సత్యనారాయణ, నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్లు సాయి బాబా, మాధవరం రంగారావు, ఆయా డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, గౌరవ అధ్యక్షులతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు, ముక్తకంఠంతో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తూ వస్తుందని, ఈ సారి కూడా పార్టీ అభ్యర్థిని గెలిపించి కేసీఆర్‌కి కానుకగా ఇస్తామన్నారు. పార్టీ రెండు సార్లు అవకాశం ఇచ్చిన ఇద్దరు నేతలు ఇప్పుడు ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్నారని, ఆ ఇద్దరిని ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటుందని, కేసీఆర్‌ని ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు.

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్దాం అని, అందరిని సమన్వయం చేసుకుంటూ ప్రజలలోకి వెళ్లాలని పేర్కొన్నారు. ప్రతీ గడప గడపకి వెళ్లి తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసీఆర్ చేసిన, అభివృద్ధిని వివరిస్తూ ఓట్లు అడుగుదాం అని ఎమ్మెల్యే తెలియచేసారు. కేసీఆర్ బీసీ సామాజిక వర్గానికి పెద్ద పీట వేశారు అని, బీసీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను నిలబెట్టడం జరిగింది అని తెలిపారు. అందరూ కలిసి కట్టుగా పనిచేసి, సమిష్టి కృషితో పని చేద్దామని గాంధీ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులు సంజీవ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బాలింగ్ గౌతమ్ గౌడ్, బిఎస్ఎన్ కిరణ్ యాదవ్, రాజు నాయక్, లక్ష్మీనారాయణ, భాస్కర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వాల హరీష్ రావు, గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, లక్ష్మారెడ్డి, గంగాధర్, భిక్షపతి ముదిరాజు, పోతుల రాజేందర్, వేణు, జిల్లా గణేష్, కాశీనాథ్ యాదవ్, నిమ్మల రామ కృష్ణ గౌడ్, చిన్నోళ్ల శ్రీనివాస్, చంద్రిక ప్రసాద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత



- పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి

నవతెలంగాణ-కూకట్‌పల్లి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రా రెడ్డి అన్నారు. మంగళవారం బస్తీలోని శ్రీ శ్రీ శ్రీ వీరాంజనేయ శివాలయంలో ఆవరణలో గల కమిటీ హాల్లో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల ఆధ్వర్యంలో, పరిసరాల పరిశుభ్రత పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి చంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీలోని ప్రతి ఒక్కరు ఇంట్లో నిత్యం పేరుకుపోయే చెత్తాచెదారాన్ని రోజు ఇంటి ముందుకు వచ్చే జీహెచ్ఎంసీ చెత్త రిక్షాల్లో వేయాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేయడం ద్వారా పరిసరాలు అపరిశుభ్రంగా మారి క్రిమి కీటకాలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే ఆస్కారం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దీనిని దృష్టిలో పెట్టుకుని నిత్యం పేరుకుపోయే చెత్తను చెత్త రిక్షాల్లో మాత్రమే వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నరసింహులు ముదిరాజ్ పాపిరెడ్డి నగర్ ఎస్ఐఎఫ్ అధ్యక్షురాలు వి.శోభారాణి, నల్ల పోచమ్మ ఎస్ఐఎఫ్ అధ్యక్షురాలు టి.పద్మ, జై హనుమాన్ ఎస్ఐఎఫ్ అధ్యక్షురాలు రేణుక, కార్యదర్శులు వెంకటలక్ష్మి, లక్ష్మి సంధ్య కోశాధికారి సౌజన్య, ఆర్పీలు రాణి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



గ్రేటర్ హైదరాబాద్ కూకట్‌పల్లి నియోజకవర్గంలో బాలానగర్ డివిజన్ పరిధిలో ప్రజలు పరిసరాల పరిశుభ్రతు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా బాలానగర్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఎండి. ఖాజా అన్నారు.

నవతెలంగాణ-బాలానగర్

మొదటి ర్యాండమైజేషన్ పూర్తి



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది మొదటి రాండమైజేషన్ పూర్తి చేసినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఎన్ఐసీ, వీసీ హాల్‌లో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 2,425 పోలింగ్ కేంద్రాలకు మొత్తం 13,226 మందిని మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ సిబ్బందిని కేటాయించినట్టు తెలిపారు. ర్యాండమైజేషన్ ద్వారా నియమించిన వారికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి, ఎన్నికల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల భవితకు తల్లిదండ్రులే పునాదులు



- లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్, ప్రముఖ సామాజికవేత్త లయన్ జె.జగన్మోహన్ రెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

చిన్నారి విద్యార్థుల భవితకు తల్లిదండ్రులే పునాదులని, విద్యార్థులు భావితరాలకు దిక్సూచిగా నిలవాలని లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్, ప్రముఖ సామాజికవేత్త,లయన్ జె.జగన్మోహన్ రెడ్డి సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ పద్మానగర్ ఫేజ్1లోని మెమోరీస్ ఫ్యూచర్ కిడ్స్ పాఠశాల (ఎంఎఫ్‌కెయస్ యాన్యువల్ ఫెస్ట్...2024) వార్షికోత్సవ వేడుకలు చింతల్ డివిజన్ వైఎంఎస్ కాలనీలోని ఎల్.ఎస్.ఫంక్షన్ హాల్ లో చిన్నారి విద్యార్థుల కేరింతల నడుమ ఉల్లాసంగా... ఉత్సాహంగా.. కొనసాగింది. పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ కె. అరుణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వార్షికోత్సవ వేడుకలకు ఆయనతోపాటు మేడ్చల్ జిల్లా ట్రస్మ అధ్యక్షులు, పాఠశాల కరస్పాండెంట్ లయన్ కే.రామేశ్వర్ రెడ్డి పలువురు లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ట్రస్మా ప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించా రు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇంట్లో ఉపాధ్యాయుల పాత్ర పోషించాలని, ఉపాధ్యాయులు పాఠశాలలో తల్లిదండ్రుల పాత్ర పోషిస్తూ క్రమశిక్షణతో కూడిన విద్య అందించాలన్నారు. విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా ప్రోత్సహిస్తేనే వారు ఉన్నతులుగా ఎదుగుతారన్నారు. దీంతోపాటు తల్లిదండ్రులు వారి పిల్లల ముందు ఎంతో బాధ్యతతో మెలగాలని, వారు చెప్పే మాటల్లో అబద్ధాలు,వ్యంగ్య విషయాలు ఉంటే బాల్యం నుండే విద్యార్థులు అలవర్చుకుంటారనే స్పృహతో జాగ్రత్తలు పాటించాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదల కనబరిస్తే సమాజం గర్వించే పౌరులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు.పాఠశాల కరస్పాండెంట్,మేడ్చల్ జిల్లా ట్రస్మ అధ్యక్షులు లయన్ కే.రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుండే పిల్లలలోని నైపుణ్యతను వెలికి తీసే విధంగా ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు కృషి చేయాలని విద్యతో పాటు సామాజిక విలువలు నేర్పాలని సూచించారు. నర్సరీ నుంచి రెండవ తరగతి విద్యార్థులతో నిర్వహిస్తున్న మెమోరీస్ ఫ్యూచర్ కిడ్స్ పాఠశాల ఉపాధ్యాయులను వారు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం చిన్నారి విద్యార్థులు వేసిన స్టెప్పులు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు లయన్ హనుమంత్ రెడ్డి, లయన్ శ్రీనివాస్ రెడ్డి,లయన్ బీర్రు ఆంజనేయులు, లయన్ వినోద్ జాదవ్‌తోపాటు పలు పాఠశాల కరస్పాండెంట్లు దయాకర్, భాషా, నరసింహులు పాఠశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



గొల్ల కురుమలను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి



- ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

సీఎం రేవంత్ రెడ్డి గొల్ల కురుమలను మోసం చేశారని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే గొర్రెల పంపిణీ చేస్తానన్న మాటను తుంగలో తొక్కారన్నారు. గొల్ల కురుమలు అప్పులు తీసుకొచ్చి డీడీలు తీసి ఏండ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు నేటికీ గొర్రెలను పంపిణీ చేయకపోవడం సరికాదనీ, తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే డీడీలు కట్టిన లబ్ధిదారుల ఖాతాలో వడ్డీతో సహా డబ్బులు చెల్లించేలా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. నేటికీ సీఎం రేవంత్ రెడ్డి గొల్ల కురుమలను రాజకీయంగా అణిచివేస్తున్నారన్నారు. యాదవులకు మంత్రివర్గంలో చోటు కల్పించలేదన్నారు. కనీసం నామినేటెడ్ పదవుల్లో కూడా అవకాశం ఇవ్వలేదన్నారు. గొర్రెలను పంపిణీ చేయకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ నిజాంపేట్ మాజీ ఎంపీటీసీ ఆవుల సురేష్ యాదవ్ 150 మంది అనుచరులతో, బక్క మల్లేష్, యస్.కుమార్ యాదవ్, బీఆర్ ఎస్ పార్టీ నుండ్ మేకల వెంకటేష్ ఫంక్షన్ హాల్‌లో పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి సమీక్ష సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావు, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

నవతెలంగాణ-దుండిగల్

బంగారు మైసమ్మ వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

యాంత్రిక జీవనానికి అలవాటు పడిన ప్రజలు ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత పొందుతారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. మంగళవారం గాజులరామారం డివిజన్ మెట్ కాని గూడ,రాజీవ్ గాంధీనగర్ లోని బంగారుమైసమ్మ దేవాలయ వార్షికోత్సవ వేడుకలకు ఆయనతోపాటు స్థానిక కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరిలు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మ వారి చల్లని దీవెనలతో నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విజయ రాంరెడ్డి, పాక్స్ డైరెక్టర్ పరిష శ్రీనివాస్ యాదవ్, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ యస్. కమలాకర్, చిన్న చౌదరి, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

25 నుంచి 31 వరకు ఎల్లమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్ డివిజన్, పరిధిలోని ఏపీహెచ్బి కాలనీలో గల శ్రీ రేణుకఎల్లమ్మ తల్లి సహితశ్రీ కామాక్షి సమేత పశుపతనాధ, విజయ గణపతి, అభయాంజనేయ స్వామి, దేవస్థానంలో ఈ నెల 25 నుండి 31 వరకు వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మెన్ నాగిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా 28న గురువారం ఆలయ విగ్రహ యంత్ర, ధ్వజ ప్రతిష్ఠోత్సవంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు పలు రాజకీయ ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు హాజరవుతారన్నారు. 31న ఆదివారం ఒగ్గు వారిచే అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో ఈ వేడుకలకు హాజరుకావాలని ఆయన కోరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు చేశారు.

రుమటాలాజికల్ వ్యాధులపై అవగాహన



నవతెలంగాణ-సిటీబ్యూరో

పిల్లల్లో రుమటాలాజికల్ వ్యాధులపై అంకుర హాస్పిటల్ అవగాహన కల్పిస్తుంది. తల్లిదండ్రులు, వైద్యులు, ప్రాథమిక అభ్యాసకులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన అతి పిన్న వయస్కురాలు మాలావత్ పూర్ణ రుమాటిక్ వ్యాధులతో బాధపడుతున్న పిల్లలలో ఆశ, స్థితిస్థాపకతను ప్రేరేపించారు. అంకుర హాస్పిటల్ ఫర్ విమెన్ అండ్ చైల్డ్‌లో పీడియాట్రిక్ రుమటాలజిస్ట్, ఇమ్యునాలజిస్ట్ డాక్టర్ అంజని గుమ్మడి మాట్లాడుతూ "పిల్లలలో రుమాటిక్ వ్యాధుల బలహీనతను తగ్గించడానికి ఏకైక మార్గం నిపుణులతో సత్వర రోగనిర్ధారణ, సత్వర చికిత్స, ఇది పిల్లలు దాదాపు సాధారణ జీవితాలను గడపడానికి అనుమతిస్తుంది. ఈ వ్యాధి ప్రగతిశీలం కావటంతో ఈ పిల్లలకు పీడియాట్రిక్ రుమటాలజిస్ట్‌లతో నిశిత పర్యవేక్షణ అవసరం" అని తెలిపారు.

మూత్ర నాళాల అంటువ్యాధులు సాధారణ ఆరోగ్య సమస్య

నవతెలంగాణ-సిటీబ్యూరో



మూత్ర నాళాల అంటువ్యాధులు సాధార ఆరోగ్య సమస్య అని అని ఓమ్నీ హాస్పిటల్స్ యూరాలజీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 50 శాతం మహిళల్లో ఈ వ్యాధి ఉన్నట్టు తెలిపారు. బ్యాక్టీరియా మూత్ర నాళాల్లోకి ప్రవేశించి అభివృద్ధి చెందినప్పుడు ఈ అంటు వ్యాధులు వస్తాయని తెలిపారు. చికిత్స చేయకుండా వదిలేస్తే అసౌకర్యం, నొప్పి, కొన్నిసార్లు తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందని తెలిపారు. పూర్తిగా నివారించడానికి యూటీఐలు సవాలుగా ఉన్నప్పటికీ, వ్యక్తులు వారి ప్రమాదాన్ని తగ్గించడానికి, మూత్ర నాళాల ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి అనేక వ్యూహాలను అమలు చేయొచ్చు అని తెలిపారు.

జలమండలి, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ జల ప్రతిజ్ఞ

పాల్గొన్న జలమండలి ఎస్ఆర్ నగర్ డివిజన్ మేనేజర్ ఎస్.హరిశంకర్

నవతెలంగాణ-హైదరాబాద్

జలమండలి, గాంధీ జ్ఞాన ప్రతిష్ట ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం 2024 కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం కేఎల్ఎన్ పార్కులో వాకర్స్, సీనియర్ సిటిజన్స్, వివిధ స్వచ్ఛంద ప్రతినిధులను ఆహ్వానించి నీటి సంరక్షణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జలమండలి జనరల్ మేనేజర్ ఎస్.హరి శంకర్ పాల్గొని అందరిచే జల ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడుగంటిపోతున్న భూగర్భ జలాలను అభివృద్ధి చేసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రతి మనిషి నీటిని కాపాడుకోవాల్సిన సామాజిక బాధ్యతగాగుర్తించిఅవసరమైనంత,అవసరమైనచోట పొదుపుగా నీళ్లు వాడుకోవాలని సూచించారు.

భిక్షాటన చేసే పిల్లలను స్వగ్రామాలకు తరలింపు

- వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలని సూచన

నవతెలంగాణ-సిటీబ్యూరో

బాల, బాలికలతో భిక్షాటన చేయించకుండా వారి బంగారు భవిష్యత్తు కోసం బాగా చదివించి ప్రయోజకులను చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. నగరంలోని ప్యారడైజ్, ప్యాట్నీ, జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, అఫ్జల్ గంజ్,సుల్తాన్ బజార్, మైత్రివనం, బల్కంపేట్ టెంపుల్, ఐఎస్ సదన్, మలక్ పేట్, చంద్రాయన గుట్ట, పెద్దమ్మ దేవాలయం వద్ద భిక్షాటన చేస్తు న్న వీధి బాలలు, వారి తల్లులను ప్రత్యేక డ్రైవ్ ద్వారా గుర్తించి హైదరాబాద్ కాచిగూడ నింబోలిగడ్డలోని జువైనల్ గర్ల్స్ హోమ్ వద్దమంగళవారం ప్రత్యేక బస్సులో మహారాష్ట్రలోని షోలాపూర్‌లోని వారి స్వగ్రామాలకు తరలించారు. ఈ మేరకు వాహనాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. 19 మంది చిన్నారులు ఆరుగురు తల్లి / సంరక్షకులను ప్రత్యేక బస్సులో సొంత రాష్ట్రం మహారాష్ట్రకు పంపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వీధి బాలలు వారి తల్లులతో మాట్లాడుతూ పిల్లలతో భిక్షాటన చేయించకుండా వారిని బాగా చదివించాలని, చదువుతోనే సమాజంలో వారికి మంచి గుర్తింపు వస్తుందన్నారు. బాగా చదివి డాక్టర్లు, ఇంజనీర్లు న్యాయవాదులులుగా ఎదగాలని పిల్లలకు సూచించారు. చదువుతోనే మంచి ఉద్యోగాలు దొరుకుతాయని దాని ద్వారా కుటుంబ భవిష్యత్తు బాగుంటుం దన్నారు. జీవితంలో ఒడుదోడుగులు వస్తాయని ఎప్పుడూ అధైర్యపడకుండా ముందుకు సాగిపోవాలని అప్పుడే జీవితంలో సుఖ శాంతులతో జీవించవచ్చని అన్నారు. జీవితంలో విద్య అత్యంత అవసరం అని, విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పిల్లలకు మధ్యాహ్న భోజనంతోపాటు ఎన్నో సదుపాయాలు కల్పిస్తున్నందున ప్రతి ఒక్కరూ బాగా చదువుకోవాలి అన్నారు. అనంతరం జువైనల్ హోమ్ లో అన్ని గదులను పరిశీలించి అక్క డ చదువుతున్న బాలికలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, బాలికల హోమ్ సూపరింటెండెంట్ కృష్ణవేణి బాల రక్ష భవన్ అధికారి సుమలత, జిల్లా బాలల పరిరక్షణ విభాగం యంత్రాంగం,పోలీస్, జువైనల్ గర్ల్స్ హోమ్ సిబ్బంది పాల్గొన్నారు.



బీసీలను రాజ్యాధికారానికి దూరం చేస్తారా



- బీసీ కులాల జేఏసీ

నవతెలంగాణ-బంజారాహిల్స్

మార్పు కోరుకుంటున్న ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసం కృషి చేస్తారాని ఎన్నుకుంటే ఒకే వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు వ్యవహరిస్తున్న తీరు మార్చుకొని బీసీలకు రాజ్యాధికారానికి దూరం చేయవద్దని బీసీ కులాల జేఏసీ డిమాండ్ చేసింది. మంగళవారం సోమాజిగూడ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు విలేఖరుల సమావేశంలో బీసీ కులాల జేఏసీ చైర్మెన్ కుందరం గణేష్ చారి,అధ్యక్షతన ఏర్పాటైన సమావేశనికి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ హాజరై ప్రసంగించారు. వారు మాట్లాడారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇతర జాతులు మీ జండాలు మోసి జై జైలు కొట్టడనికేనా ఒకే వర్గానికి ఇంటికి వెళ్ళి మారి పార్టీలో ఆహ్వానిస్తున్నరాని ఎద్దేవా చేశారు. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు ముగ్గురికి పదవులు ఇచ్చి సంబండా వర్గాల ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తే బీసీల ఆగ్రహానికి గురికకా తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ గౌడ్,కే.శ్రీనివాస్ ముదిరాజ్, జజుల లింగయ్య,వారి కుప్పల మధు,ఎం ఎల్,రాజేష్,మహేష్,భారత్ తదితరులు పాల్గొన్నారు.

సుధారాణికి ఓయూ డాక్టరేట్

నవతెలంగాణ-ఓయూ



జన్యు శాస్త్రంలో చేసిన పరిశోధనలకుగాను సుధారాణికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. గద్వాల జిల్లా మేలచెర్వు గ్రామం భాగ్యమ్మ , ఏసేపుల రెండో కుమార్తె కే. సుధారాణి, ఉస్మానియా యూనివర్సిటీలోని జన్యు శాస్త్ర విభాగంలో "క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఫైటో ఎక్స్ట్రాక్ట్ ఫర్ యాంటీ ఏపీలెప్టిక్ యాక్టివిటీ ఆఫ్ అకాలిఫా ఇండికా "అనే అంశంపై పరిశో ధనలు జరిపి ఔషధ మొక్కల ప్రాముఖ్యత, మూర్ఛ వ్యాధిని తగ్గించుటలో వాటి ప్రాధాన్యతలపై పరిశోధనలు చేసి, వాటిని మూర్ఛ వ్యాధి వచ్చిన ఎలుకలపై ప్రయోగించి జన్యువరమైన మా ర్పులు గమనించినట్లు, సుధారాణి తన పరిశోధన గ్రంథంలో సమర్పించినట్లు, అందుకుగాను, ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. సుధారాణికి డాక్టరేట్ రావడం వల్ల పరి శోధన విద్యార్థులు తల్లిదండ్రులు బంధుమిత్రులు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సుధారాణికి డాక్టరేట్ వచ్చిన సందర్భంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం అభినందించారు.ఈ సందర్భంగా సుధారాణి తన పరిశోధనలకు సహకరించిన ప్రొఫెసర్ రోజారాణికి పరిశో ధక విద్యార్థులకు తన చదువులో ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫీజుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



- ఓయూ పరిశోధక విద్యార్థులు

నవతెలంగాణ-ఓయూ

ఈ సంవత్సరం రెండవ సంవత్సరం పిహెచ్డి కోర్సు ట్యూషన్ ఫీజును మార్చి 30 తేదీ వరకు చెల్లించాలని లేనియెడల పిహెచ్డీ కోర్స్ వర్క్ ఎగ్జామ్ రాయనీయమని కొన్ని విభాగాల డీన్ ఆఫీసులు నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మార్చి 23 నుండి పరిశోధక విద్యా ర్థులు నిరసన కార్యక్రమాలు చేస్తున్న విషయం తెలిసిందే.మంగళవారం వారు ఓయూ అడ్మిని స్ట్రేటివ్ బిల్డింగ్ విసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణ తో పరిశోధక విద్యార్థులు రెండు గంటల పీహెచ్డీ ఫీజుల అంశంపై చర్చించారు. అనంతరం వీసీ ప్రొ. రవీందర్ ఫీజుల పెంపు నిర్ణయాన్ని ఏప్రిల్ 23-04 -2024 రోజు జరిగే స్టాండింగ్ కమిటీ మీటింగ్లో అన్ని విభాగాల డీన్లు తో మాట్లాడి ఫీజుల పెంపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంటానని పరిశోధక విద్యార్థులకు వినతి పత్రం తీసుకొని హామీ ఇచ్చారని విద్యార్థులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రిసర్చ్ స్కాలర్స్ నెల్లి సత్య, స్పందన, బొడ్డుపల్లి అఖిల్, చేవెళ్ల యాదగిరి, పొట్టేపాక సందీప్, కిరణ్, మహేష్, లక్ష్మణ్, స్వరాజ్, ఆంజనేయులు గౌడ్ శివాజీ, గోవర్ధన్, నరేందర్, అనురాజ్, రవి, జయప్రకాష్ నారాయణ, సాయి వినీత్, సోను, సాయి స్వరాజ్ , పాల్గొన్నారు.

సామాజిక ప్రజాస్వామ్యంలో మాదిగలకు అన్యాయం

ప్రజా సంఘాల నాయకులు

నవతెలంగాణ-బంజారాహిల్స్

మొట్ట మొదటిసారిగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సరిగ్గా మూడు మాసాల్లోనే మాదిగ జాతికి అన్యాయం చేస్తున్నారనీ ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తపరిచారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఓయు జేఏసీ,నేషనల్ ఇంటెలెక్చటువల్ ఎస్సీ,ఎస్టీ,వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీ, బిజెపి పార్టీ మాదిగలకు రెండు నుంచి మూడు సీట్లు కేటాయిస్తే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మాత్రం మంత్రివర్గంతో పాటు మాలలకే ప్రాధాన్యమిస్తూ మాదిగలను అణగదొక్కుతున్నారని రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మాదిగల సత్తా చూపుతామన్నారు. మంత్రివర్గ విస్తీర్ణలో మాదిగ జాతికి చెందిన సత్యనారాయణ,లక్ష్మణ్, రమేష్లాకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఇంటలెక్చువల్ ఫోరం ఎస్సీ ఎస్టీ చైర్మన్ భగువాన్ ప్రసాద్,ఓయు జేఏసీ వేల్పుల సంజయ్,టి.జైరాం,చెరుకూరి రాజు,ఆకుల శ్రీనివాస్,ఎడవల్లి నర్సింహ,చంద్ర శేకర్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలకు అవగాహన సదస్సు

నవతెలంగాణ-హైదరాబాద్

ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మంగళవారం మమత ఎడ్యుకేషనల్ సొసైటి, చందులాల్ బారాదరి, జలమండలి ఆధ్వర్యంలో మహిళా పొదుపు సంఘాలకు 'శాంతి కొరకు నీరు' అనే అంశంపై అవగాహన సదస్సు కమ్మ భవన్ లో జరిగింది. పొదుపు సంఘాల ప్రతినిది మంజుల మాట్లాడుతూ నీటి సంరక్షణ, నీటి పొదుపుపై మహిళాల పాత్ర ఉందన్నారు. అక్కడికి వచ్చిన జల మండలి అధి కారులు నీటి నిల్వల కొరకై ప్రతి ఇంటిలో ఇం కుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఆ తర్వాత చందు లాల్ బారాదరి కార్యలయంలో డీజీఎం అబ్దుల్ హకీం ఆ జలమండలి ఉద్య గులకు అవగాహన నిర్వచించి నీటి లీకేజీలు, నీరు వృథా అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్ర త్తలు, ఇంకుడు గుంతలు పునరుద్ధరణ నీటిని సంరక్షించటం మనందరి భాధ్యత చిన్న చిన్న పనులు చేయటం వల్ల నీటి వృధాను అరికట్టవచ్చని సూచించారు.

కార్మికుల ప్రయోజనాలను కాలరాస్తే యుద్ధమే

- భారతీయ మజ్దూర్ సంఘ్

నవతెలంగాణ-బంజారాహిల్స్

అసంఘటిత వర్గాల ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా భారతీయ మజ్దూర్ సంఘ్, (బీఎంఎస్),జాతీయ కార్యవర్గ సమావేశాలు ఈ నెల 29 నుంచి 31 వరకు కొనసాగుతుందని భారతీయ మజ్దూర్ సంఘ్ఆల్ ఇండియా జనరల్ సెక్రెటరీ రవీంద్రన్ హింటె తెలిపారు. మంగళవారం సోమా జిగూడలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. అన్నోజిగూడ ఘట్‌కేసర్ విద్యాలయంలో జరిగే ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా ఉన్నటువంటి అసంఘటిత సంఘటిత సంఘాలకు చెందిన 44 ఫెడరేషన్ నుండి దాదాపు 150 మంది ప్రతినిధులు పాల్గొంటున్నయన్నారు. దేశ వ్యాప్తంగా ఏక్కడ అన్యాయాలు, అత్యాచారం జరు గుతున్నదో అక్కడ బీఎంఎస్ పనిచేస్తుందనీ ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేకుండా బీఎంఎస్ కార్మికుల పక్షాన పోరాడుతూ వారి అభివృద్ధికి తోడ్పాటు అందించే బాధ్యత తీసుకొని కనీసవేతనాల చట్టం అమలు చేయాలని జిల్లా కార్యాలయం నుండి ప్రధానమంత్రి కార్యాలయం వరకు కనీస వేతన చట్టాల అమలు చేయాలని వినతి పత్రాలు అందజేశామనీ అన్నారు. జి20లో పాల్గొనే అవకాశంతో పాటు బీఎంఎస్‌కి 20 లేబర్ ఎల్-20 సమావేశాల్లో జి20 దేశాలకు సంబంధించిన వివిధ ట్రేడ్ యూనియన్ ఎల్-20 సమావేశాలు నిర్వహించాయనీ దాంట్లో ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టం, ప్రైవేటు రంగంలో కూడా భద్రత లేకుండా కార్మికులను ఉద్యోగాలలోంచి తీసేస్తున్నరాని ఉద్యోగ, ఉపాధి భద్రత కల్పించాలని డిమాం డ్ చేస్తూ 29 రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశం లో చర్చలు కొనసాగుతాయని తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్నటువంటి రాయితీలు కావచ్చు రైల్వే పాసుల్లో సబ్సిడీ విషయంలో కేంద్ర ప్రభుత్వంతో చొరవ తీసుకొని మాట్లాడుతాం ఈ సందర్భంగా వాళ్ళు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రమేష్ గౌడ్,ప్రధాన కార్యదర్శి రామ్‌రెడ్డి పాల్గొన్నారు.



బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే

- వందే భారత్ రైలు పదిసార్లు జెండా ఊపడం తప్ప కిషన్ రెడ్డిసికింద్రాబాద్‌కు చేసింది ఏమీ లేదు
- బీఆర్ఎస్‌కు ఓటేస్తే మోరిలో వేసినట్టే
- మోడీ హటావో దేశ్ బచావో నినాదంతో ఏప్రిల్ లో ప్రచారం
- సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్



నవతెలంగాణ-ఓయూ

దేశానికి ప్రమాదకరమైనబీజేజీని సికింద్రాబాద్ పార్లమెంట్ సికింద్రాబాద్ పరిధిలో ఓడించేం దుకు పార్టీ శ్రేణులంతా క్రియాశీలకంగా పనిచేయాలని సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీని వాస్ పిలుపునిచ్చారు. సోమవారం లాలాపేట నఫీస్ ఫంక్షన్ హాల్‌లో కొమురెల్లిబాబు అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పది ఏండ్లలో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రజలకు ఉపయోగపడే ఏ పని చేయలేదని నిరంతరం మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయా లబ్ధి పొందుతూ ప్రజాస్వా మికంగా ఎన్నికైన ప్రభుత్వాలను అస్థిరపరచడం, ప్రశ్నించే ప్రతిపక్ష నేతల గొంతులను నొక్కుతూ ఈడీ, సిబిఐ లను ఉసుగ లుపుతో అక్రమంగా అరెస్టు చేయడం ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని అంబానీలకు తాకట్టు పెట్టడం చేస్తుంది కానీ దేశ అభివృద్ధి కోసం ఒరగబెట్టిందేమీ లేదు. అదేవిధంగా కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి పదిసార్లు వందే భారత రైలును జెండా ఊపడం తప్ప,సికింద్రాబాద్ అభివృద్ధికి చేసింది ఏమీ లేదని ఎద్దేవ చేశారు. టీఆర్ఎస్ ఓటేస్తే మోరీలో వేసినట్టే అని బిఆర్ఎస్ కు అభ్యర్థులు కరువయ్యారని ఆరోపించారు. ఏప్రిల్ మొదటి వారంలో "మోడీ హటావో దేశ్‌కి బచావో" నినాదంతో సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమంలో నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీహరి, గౌరీ నాగరాజ్, గువ్వల మల్లేష్, యాకోబ్, హుస్సేన్ , రవికాంత్, దేవేందర్, వెంకట్ గౌడ్, పాల్గొన్నారు.

విద్యార్థులు అభినందించిన వీసీ, రిజిస్ట్రార్



- హర్యానాలో రాష్ట్ర సంస్కృతి సంప్రదాయలను ప్రదర్శనలో సత్తా చాటిన వలంటీర్స్

నవతెలంగాణ-ఓయూ

జాతీయ సమైక్యత క్యాంప్ హర్యానా జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఉస్మానియా యూని వర్సిటీ ఎస్ ఎస్ ఎస్ వాలంటీర్స్ ఈనెల 12 నుంచి 18 వరకు హర్యానాలోని వతేహబాద్ లో జరిగిన జాతీయ సమైక్యత క్యాంపులో తెలంగాణ విద్యా ర్థులు తెలంగాణ సంస్కృతి సాంప్రదా యాలు, ఆట, పాటలతో, ఉపన్యాసాలతో అందరి మన్ననలు పొందారు. ప్రత్యేకించి తెలంగాణ బతుకమ్మ బోనాలు పోతురాజుల విన్యాసాలతో తెలంగాణ సంస్కృతిని చాటారు. ముఖ్యఅతిథిగా వచ్చినటువంటి దేవీలాల్ యూనివర్సిటీ వీసీ ప్రొ. అజ్మీర్ మాలిక్ తెలంగాణ సంస్కృతి బతుకమ్మ హైదరాబాద్ బిర్యానీ, హిరని గుర్తుచేస్తూ అభినందించారు. జాతీయ సమైక్యత క్యాంపుకు వెళ్లి వచ్చిన విద్యార్థులను మంగళవారం ఓయూ వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీ నారాయణలు అభినందించారు. ఈ అభినందన కార్యక్రమములో ఉస్మానియా యూని వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొ. నవీన్ సోడా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యతకు మెలగాలని జాతీయ సమైక్యతను చాటాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంటిజెంట్ లీడర్ డాక్టర్ జగన్ ను అభినందించారు. 7 రోజుల క్యాంప్ లో తెలంగాణ విద్యార్థుల ప్రదర్శనకు మొదటి స్థానంలో అవార్డు అందుకున్నారు. ఓయూ పరిధిలోని 10 కళాశాలాల నుండి 5గురు విద్యార్థులు ఈ క్యాంపులో పాల్గొన్నారు. విద్యార్థులను ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

పార్క్ పూర్వవైభవంకు పూర్వ విద్యార్థి చేయూత

నవతెలంగాణ-ఓయూ



ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరి ంగ్ విభాగం (ఇసిఇ) లోని ఓపెన్ స్పేస్ గార్డెన్ (పార్క్), త్వరలో విభాగం విద్యార్థులకోసం ఓపెన్‌లెర్ని ంగ్ స్పే స్ గార్డెన్ మార్చబడుతుందని ప్రిన్సి పాల్ ప్రొ. పి. చంద్రశేఖర్, హెడ్ ప్రొ. రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న మోస్ చిప్ టెక్నాలజీస్ లిమిటెడ్ అందించే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి,ఎస్,ఆర్) నిధుల ద్వారా సు మారు 9 లక్షలతో పార్క్ పూర్వ వైభవాన్ని తీసుకు రావడానికి పూర్వ విద్యార్థి శ్రీనివాసరావు ముందుకు వచ్చారు. ఈ వినూత్న అభ్యాస వాతావరణాన్ని సృష్టించడంలో కీలక పాత్ర పోషించిన పూర్వ విద్యార్థి, మోస్చిప్ టెక్నాలజీస్ లిమిటెడ్ (బిఇఇ సిఇ1995) సీఈఓ అండ్ సిఎండి శ్రీనివాస రావు కాకమా నుకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. దీనికి విశేష కృషి చేసిన ఉస్మానియా ఫౌండేషన్ అండ్ పూర్వ విద్యార్థుల సంఘం, యుసి ఇఒయుకు కృతజ్ఞతలు చెప్పారు.గతంలో ఈ పార్క్‌లో కూర్చొని వివిధ విద్యా, పరిశోధన అంశాలపై చర్చించే వాళ్ళం. అయితే ఇటీవలే ఇక్కడ పర్యటనకు వచ్చిన శ్రీనివాసరావు ఈ పార్క్ దుస్థితి చూసి చలించి పోయి మళ్ళీ పార్క్ కు పూర్వ వైభవాన్ని తీసుకురావాలని ఈ నిధులు ఇస్తున్నట్లు శ్రీనివాసరావు ప్రిన్సిపాల్, హెడ్, పూర్వ విద్యార్థి డా.డివికెతో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

టెట్ అర్హత పరీక్ష ఫీజు తగ్గించాలి

- జాజుల లింగంగౌడ్



నవతెలంగాణ-ఓయూ

టెట్ అర్హత ఫీజు తగ్గించా లని కోరుతూ టెట్ కన్వీనర్ రాధా రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ తెలిపారు. ఈ సంద ర్భంగా లింగంగౌడ్ మాట్లా డుతూ గతంలో టెట్ ఒక పేపర్‌కు రూ.200 ఫీజు ఉండగా దాన్ని రూ.1000కి పెంచారని,.రెండు పేపర్లు రాసే అభ్యర్థులకు గతంలో రూ.300గా ఉన్న ఫీజును ఏకంగా రూ.2,000కు వరకు పెంచారని ఫీజు లను ఈ స్థాయిలో పెంచడం నిరుద్యోగులకు అన్యాయం చేసినట్టేనని అ న్నారు.ఇప్పటికే కోచింగ్, శిక్షణ,హాస్టల్ ఫీజులకే వేలకు వేల రూపాయలు ఖర్చుపెడుతున్న అభ్యర్థులకు ఇది భారం కానుందని అన్నారు.దేశంలో ఎక్కడ లేని విధంగా టెట్‌కి ఒక్కో పేపర్‌కి వెయ్యి రూపాయల ఫీజు చెల్లించాలి అనడం మూర?త్వమేనని అన్నారు.ఎన్నికలకు ముందు నిరుద్యోగుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయమని చెప్పి ఇప్పుడు మాట మార్చడం సరికాదన్నారు.ఆన్ లైన్ పరీక్ష పేరిట వేలకు వేల రూపాయలు వసూలు చేయటం సరికాదు. వెంటనే టెట్ ఫీజు తగ్గించాలి. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నాము.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు రవి కిరణ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర నాయకులు గుంటి మహేష్ పాల్గొన్నారు.



రవీంద్ర భారతిలో రస రంజని 31 వ వార్షికోత్సవం సందర్భంగా జరుగుతున్న నాటక వేడుకల్లో భాగంగా తిరుపతి వేంకట కవులు విరచిత పాడవోద్యోగ విజయాలు నాటకం గుమ్మడి గోపాల కృష్ణ దర్శక నిర్వహణ లో రస రంజని హైదరాబాద్ వారిచే ప్రదర్శిత మైన నాటకం. నవతెలంగాణ-కల్చరల్

ఎంపీగా గెలిచాక ఎమ్మెల్యే పదవికి రాజీనామా

- ఎమ్మెల్యే దానం నాగేందర్



నవతెలంగాణ-బంజారాహిల్స్

బంజారాహిల్స్ లేక్ వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ, దానం నాగేందర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో దానం నాగేందర్ మాట్లాడుతూ...జూన్ 5న ఎంపీగా తాను గెలుపొందిన తర్వాత ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి రాజీనామా చేస్తానని తెలిపారు. రెండు మూడు నెలల్లో ఎమ్మెల్యే దానం రాజీనామా చేయకపోతే సుప్రీంకోర్టుకు వెళ్తామన్న కేటీఆర్ మాటలకు సమాధానంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

సర్కారు భూమిలో యథేచ్ఛగా నిర్మాణాలు..!

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- ప్రభుత్వ భూముల పరిరక్షణపై కొరవడిన పర్యవేక్షణ
- ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికుల వేడుకోలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు సీరియస్‌గా ఉండాలని సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినా క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. కబ్జాదారులపై కన్నెర్ర చేయాల్సిన అధికారులే తమకేమీ తెలియదు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘటకేసర్ మండల రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఘట్‌కేసర్ మండలంలోని నారపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 56, 58లో ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. తప్పుడు దవ పత్రాలతో ఈ తతంగా తెరలేపినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూమిని



కాపాడాల్సిన అధికారులు కనీసం ఆటు వైపు కూడా చూడటం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై వివరణకు తహసీల్దార్‌ను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ముఖ్యమంత్రి అదేశాలకే లెక్క లేదా..!

సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక సమావేశాల్లో ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు సిరియస్‌గా ఉండాలనీ, కబ్జాలకు పాల్పడేది ఎవ్వరైనా సరే.. ఉపేక్షించేది లేదని చెప్పిన మాటలను ఘటకేసర్ రెవెన్యూ అధికారులు పెడచెవిన పెట్టినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా లేక మనకేందుకులే అని





'మల్టీడిసిప్లినరీ ఇంటర్వెన్షన్' సర్జరీ విజయవంతం

నవతెలంగాణ-సిటీబ్యూరో

తీవ్రమైన స్కోలియోసిస్, న్యూరోఫైబ్రోమాటోసిస్ టైప్ ఉన్న 12 ఏండ్ల అరీట్ హాస్పిటల్స్‌లో చేరింది. బహుళ సంక్లిష్టతలు, సంబంధిత సమస్యల కారణంగా వైద్య బందానికి ప్రత్యేక సవాల్‌ను విసిరింది. ఈ బాలిక పరిస్థితి తీవ్రంగా క్షీణించింది. ఆమె శ్వాస, హాయిగా తినే సామర్థ్యాన్ని ప్రభావితం చేసింది. రోజువారీ పనులకు ఆటంకం కలిగిస్తుంది. రిస్క్ కారణంగా చాలా మంది సర్జన్లు ఈ కేసును తిరస్కరించారు. అరీట్ హాస్పిటల్స్, వెన్నెముక శస్త్రచికిత్సా విభాగం హెచ్‌ఓ.డీ డాక్టర్ వెంకట రామకష్ణ, నేతృత్వంలోని మల్టీడిసిప్లినరీ బృందం ఈ సవాల్‌ను ఎదుర్కొంది. ఈ బృందం న్యూరోసర్జన్లు, అనస్థీషియాలజిస్టులు, న్యూరో- మానిటరింగ్ స్పెషలిస్టులతో కూడిన మల్టీడిసిప్లినరీ బృందంతోపాటు ఐసీయూ బందం, కార్డియోథొరాసిక్, గ్యాస్ట్రో సర్జన్ల బ్యాకప్ మద్దతుతో 11 గంటల శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. అనంతరం యువతి శ్వాస తీసుకోవడం, ఆహారం తీసుకోవడంలో తక్షణ మెరుగుదలని ప్రదర్శించింది. ఆశ్చర్యకరంగా నాలుగు అంగుళాల ఎత్తు కూడా పెరిగింది. కేవలం మూడు రోజుల శస్త్రచికిత్స తర్వాత, ఆమె నడవగలిగింది. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట రామకష్ణ మాట్లాడుతూ "స్కోలియోసిస్, వక్రత డిగ్రీ, వెన్నెముకపై మాత్రమే కాకుండా కీలక అవయవాలపై కూడా ప్రభావం చూపుతుంది. ఆరోగ్యం పనితీరును పునరుద్ధరించడానికి మా శస్త్రచికిత్స ముఖ్యోన్నతం. అరీట్ హాస్పిటల్స్ మల్టీడిసిప్లినరీ టీమ్‌ని కలిగి ఉండటం విశేషం. ఇది సవాళ్లను ధీటుగా ఎదుర్కోవడానికి కలిసి పని చేస్తుంది" అని తెలిపారు. క్రిటికల్ కేర్ మెడిసిన్ విభాగం మెడికల్ డైరెక్టర్, హెచ్‌ఓడీ డాక్టర్ పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ " అరీట్ హాస్పిటల్స్ హైదరాబాద్‌లో ఒక సరికొత్త సదుపాయం. ఇది హైదరాబాద్ నగరంలో సంక్లిష్టమైన కేసులను పరిష్కరించడంలో పురోగతిని సాధిస్తోంది. కేవలం 6 నెలల్లో 600 సర్జరీలు విజయవంతంగా పూర్తి చేశాం" అని తెలిపారు. ఈ బృందానికి న్యూరోసర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ రామకష్ణ చౌదరి, ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరోసైన్సెస్ కన్సల్టెంట్ న్యూరోసర్జరీ డాక్టర్ రవీష్ సుంకర సహాయం చేశారు. అనస్థీషియాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ అనగాని కమలా దేవి, అనస్థీషియా కన్సల్టెంట్ డాక్టర్ విట్టల్ రావు కావూరి కూడా సహకరించారు.

'కబ్జా' నుంచి కస్టోడియన్ భూములను కాపాడాలి

- ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కలెక్టరేట్‌లో మండల దేవేందర్‌గౌడ్ వినతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

కాప్రా మండల పరిధిలోని కస్టోడియన్ భూములను కబ్జాదారుల నుంచి కాపాడి స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వాన్ని, జిల్లా ఉన్నతాధికారులను మండల దేవేందర్‌గౌడ్ కోరారు. ఈ భూములను ప్రజావసరాలకు వినియోగించాలని పేర్కొన్నారు. రూ.కోట్లాది విలువ చేసే ఈ కస్టోడియల్ భూముల కబ్జాకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవటంతోపాటు వారికి సహకరిస్తున్న పలువురు ఉద్యోగులు, పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఇన్‌వార్డులో కబ్జాకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన వినతిపత్రం అందజేసినట్టు ఆయన మీడియాకు వివరించారు. కస్టోడియల్ భూములతో ఎలాంటి సంబం ధం లేని తమ ఫ్యామిలీని బెదిరిస్తున్న భూకబ్జాదారుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ఈ విషయమై జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం కాప్రా మండల పరిధిలోని సర్వే నంబర్లు 9, 11, 47, 140, 143, 151, 153, 676, 677 లలో మొత్తంగా 90.08 ఎకరాల కస్టోడియన్ భూములు ఉండగా, కొందరు మండల కుటుంబీకులపై ఈ భూముల విషయమై విడివిడిగా పలు కోర్టుల్లో దావాలు వేయగా, వీటిని విచారించిన సుప్రీంకోర్టు 2011 జూన్ 3వ తేదీన కొట్టేసిందని దేవేందర్‌గౌడ్ తెలిపారు. కాందీశీకుల వారసులు ఇందులోని కొంత భూమిని ప్రయివేటు వ్యక్తులకు విక్రయించగా, కొందరు నివాస గృహాలు నిర్మించుకుని నివాసముంటున్నారనీ, మిగిలిన 69.21 ఎకరాల భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉండగా, కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు కొట్టేసిన ఈ భూముల కేసుల విషయాన్ని పేర్కొనకుండా శరత్ చంద్రారెడ్డి అనే వ్యక్తి మండల ఫ్యామిలీ నుంచి జీపీఏ తీసుకున్నారని ఆరోపించారు. మండల కుటుంబానికి సంబంధించిన వారు కూడా తనతో గొడవ పడినట్టు కోర్టును ఆశ్రయించి, సదరు భూముల పంపకాలను సామరస్య పూర్వకంగా జరుపుకోవాలని లోక్ అదాలత్ నుంచి ఒక అవార్డును శరత్ చంద్రారెడ్డి తీసుకున్నారన్నారు. కోర్టు ద్వారా పొందిన ఈ అవార్డును అడ్డం పెట్టుకున్న శరత్ చంద్రారెడ్డి పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించారన్నారు. ఈ నేపథ్యంలోనే శరత్ చంద్రారెడ్డి, మరోవ్యక్తి నాగరాజుతో కలిసి గతంలో ఈ భూముల్లో ఇండ్లు నిర్మించుకున్న ప్రయివేటు వ్యక్తులను బెదిరింపులకు పాల్పడుతూ.. భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండల దేవేందర్ గౌడ్ ఆరోపించారు. కస్టోడియన్ భూములను వారు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన ఉన్నతాధికారులకు సమర్పించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. మండల ఫ్యామిలీకి ఈ కస్టోడియల్ భూములపై ఎలాంటి హక్కులూ లేవని తెలిసినప్పటికీ, శరత్ చంద్రారెడ్డి, నాగరాజు తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారన్నారని ఆరోపించారు. జవహర్‌నగర్ పోలీసులు కూడా శరత్ చంద్రారెడ్డి, నాగరాజుకు వత్తాసు పలుకుతూ.. ఇబ్బందులకు గురి చేస్తున్నారని దేవేందర్‌గౌడ్ తెలిపారు. కాప్రా మండల పరిధిలోని 69.21 ఎకరాల కస్టోడియన్ భూము లను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న శరత్ చంద్రారెడ్డి, నాగరాజుపై తగిన చర్యలు తీసుకోవటంతోపాటు రక్షణ కల్పించాలని కోరారు.

'పౌరాణిక పద్య నాటకాలు సందేశాత్మకాలు'



నవతెలంగాణ-కల్చరల్

కేవలం పురాణ కథలు మాత్రమే పౌరాణిక పద్య నాటకాలుగా చూడరాదని పద్యాలలో తెలుగు భాషా సొగసు కథలో సందేశ మిళిత సమాజిక విలువలు కూడి ఉంటాయని రాష్ట్ర శాసన సభ తొలి సభాపతి ఎస్.మధుసూదనాచారి అన్నారు రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై ప్రముఖ నాటక సంస్థ రస రంజని 31 వ వార్షికోత్సవం సందర్భంగా జరుగుతున్న నాటక వేడుకలలో భాగంగా మంగళ వారం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మధుసూదనాచారి పాల్గొని మాట్లాడుతూ పద్యం తెలుగు వారికే సొంత మైన పద సంపద అన్నారు. కృష్ణ రాయబారం పద్యాలు వినని తెలుగు వారు ఉండ రనీ గుమ్మడి గోపాల కృష్ణ నోట ఆ పద్యాలు తీయగా పలుకుతాయని ప్రశంసించారు.కేంద్ర సమాచార హక్కు చట్టం పూర్వ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్ అధ్యక్షత వహించిన సభలో నాటక రచయిత దివాకర్ బాబు సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం డాక్టర్ కె వి రమణ తదితరులు పాల్గొన్నారు. కార్యదర్శి ముట్నూరి కామేశ్వర రావు నట రాజ్, అరుణ్ కుమార్ రాధా కృష్ణ కార్యక్రమ నిర్వహణ చేశారు. అనంతరం తిరుపతి వేంకట కవులు విరచిత పాడవోద్యోగ విజయాలు నాటకం గుమ్మడి గోపాల కృష్ణ దర్శక నిర్వహణ లో రస రంజని హైదరాబాద్ వారిచే ప్రదర్శిత మైంది.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు, వేసవిలో తాగునీటి సరఫరా ప్రణాళికపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సీఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి ప్రతీ అంశాన్ని పర్యవేక్షిస్తామన్నారు. గ్రామ, మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయి పర్యవేక్షణతో తాగునీటి సమస్యను అధిగమించేలా చూస్తామని చెప్పారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ మాట్లాడుతూ యాసంగి 2023-24 ధాన్యం వరి కోతల షెడ్యూల్ ప్రకారం జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సంబంధిత అధికారు లను ఆదేశించారు. యాసంగి పంట కోతలకు వస్తున్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో వరి కోతలకు అనుగుణంగా, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరిస్తూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. అధికారులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం చేయాలని, ఎక్కడా ప్రజా ప్రతినిధులు పాల్గొనవద్దని తెలిపారు. వరి కోతలను అనుసరించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు షెడ్యూల్ రూపొందించుకోవాలని, కొనుగోలు కేంద్రాల్లో కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌళిక వసతులు కల్పించాలని, ఎండ తీవ్రతను దష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా, టెంట్లు వంటి మౌలిక ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్యాడి క్లీనర్లు, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు, టార్పాలిన్లు, గన్ని బ్యాగులు సన్నద్ధం చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో రైస్ మిల్లులకు రవాణా చేసేందుకు అవసరమైన వాహనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. చివరి గింజ వరకూ నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరపై ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఎక్కడా తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన అవసరం లేదనే సందేశం రైతుల వద్దకు వెళ్లేలా అవగాహన కల్పించాలన్నారు. భారత ఆహార సంస్థ నిర్దేశించిన ధాన్యం నాణ్యతా ప్రమాణాలు, తేమ శాతంపై విస్తత అవగాహన కల్పించాలన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకుని నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి సంబంధిత మిల్లర్లకు కేటాయించాలని, రైస్ మిల్లు వద్ద ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం కోత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైస్ మిల్లర్ల వద్ద హమాలీల కొరత రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చే విధంగా ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో వరిసాగు చేస్తున్న రైతులకు సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ట్యాగింగ్ చేయాలన్నారు. వానాకాలం 2023-24 కు సీఎంఆర్ రా రైస్ డెలివరీ వేగవంతం చేయాలన్నారు. భారత ఆహార సంస్థ నిర్దేశించిన సమయానికి రైస్ డెలివరీ చేసే విధంగా ప్రతి జిల్లాలో రైస్ మిల్లుల పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రతిరోజూ రైస్ మిల్లులు పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిచేలా చూడాలన్నారు. సీఎంఆర్ రా రైస్ డెలివరీపై కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుందన్నారు.

తాగునీటిపై సమీక్ష

వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ తాగునీటి సరఫరాలో వచ్చే చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డు స్థాయిలో తాగునీటి సరఫరాకు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. జిల్లాలో తాగునీటి అవసరాల మేరకు బోరు బావులను, పాత తాగునీటి సరఫరా మోటార్లను పునరుద్ధరించాలని, తాగునీటి సరఫరా నిమిత్తం అవసరమైన పనులను వెంటనే చేపట్టాలని, ఎక్కడా నిధులకు ఆటంకం లేనందున అత్యంత ప్రాధాన్యతతో తాగునీటి సరఫరా పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామీణ నీటి సరఫరాశాఖ పరిధిలో ఉన్న తాగునీటి వ్యవస్థను ఒకసారి పరిశీలించి అవసరమైన మరమ్మత్తులు పూర్తి చేయాలని తెలిపారు. తాగునీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్ల చేసేందుకు సన్నద్ధం కావాలని ప్లాన్ బీ తయారు చేసుకోవాలని తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలో చివరి వార్డ్, గ్రామాల్లో చివరి ప్రాంతం వరకు తాగునీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన ప్రతి అంశాన్నీ రోజూ పర్యవేక్షించాలని, ప్రజలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సత్వరమే చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమస్తే తెలుగు దినపత్రిక
12
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
బుధవారం మార్చి 27, 2024 www.navatelangana.com

నేడు ముజీబ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ (ముజీబ్) ఆధ్వర్యంలో బుధవారం నాంపల్లి గృహకల్పలోని ఆ సంఘం కార్యాలయ ప్రాంగణంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇఫ్తార్ విందులో టీఎన్జీవో జిల్లా కార్యవర్గంతో పాటు వివిధ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, ప్రాథమిక సభ్యులు, ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొని ఇఫ్తార్ విందును విజయవంతం చేయాలని ముజీబ్ కోరారు.



కుషాయిగూడ టి.ఎస్.ఆర్.టి.సి, ఎస్.సి అండ్ ఎస్.టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతీ మంగళవారం అంబేద్కర్‌ను స్మరించుకుంటూ ఆ మహనీయుడి విగ్రహానికి పూల దండను వేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం పూల దండ వేసి అంబేద్కర్ ఆశయాలను సాధిస్తాం అంటూ నినదించారు. ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లూరి అంజయ్య, కుషాయిగూడ డిపో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్న కార్పొరేటర్..

నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ భగవాన్ కాలనీలో కొద్ది రోజులుగా నీరు సరిగా రాకపోవడం, వచ్చినా కొద్దిసేపు వస్తుండడం, నీటి ప్రెషర్ తక్కువ రావడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భగవాన్ కాలనీ ప్రెసిడెంట్ దామోదర్ రెడ్డి నీటి సమస్యను కార్పొరేటర్ బొంతు శ్రీదేవి దష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన కార్పొరేటర్ ఏఈ రోహిత్ దృష్టికి తీసుకెళ్లి గతవారం రిపేర్ చేయించారు. అయినా మళ్లీ సమస్య పునరావతమైంది. దాంతో వేసవికాలంలో ప్రజలకు ఎలాంటి నీటి సమస్య ఉండకూడదనికార్పొరేటర్ దఢ సంకల్పంతో, ముందుచూపుతో, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆలోచన చేశారు. భగవాన్ కాలనీ ఏటీఎం వద్ద ఉన్న పెద్ద వాల్వు పూర్తిగా పాడు కాగా.. వాల్వు రిపేర్ పనులను మంగళవారం ప్రారంభించారు. బుధవారం సాయంత్రం వరకు పనులు సంపూర్తిగా జరగనున్నాయి. వాల్వు రిపేర్ ఖర్చుతో కూడుకున్నది, పెద్ద పని కాబట్టి సమయం కూడా ఎక్కువగా తీసుకోనున్నది. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన కార్పొరేటర్‌కు ప్రజలు ధన్యవాదాలు చెబుతున్నారు.

మేడ్చల్ మున్సిపాలిటీలో నిధుల గోల్ మాల్

- రూ.20 లక్షలు మాయం
- రూ.13లక్షల 30వేలు రికవరీ..
- ఇంకా లెక్కల్లో తేలని రూ.6 లక్షల 70 వేలు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో ఇటీవల జిల్లా ఆడిటింగ్ అధికారి వెంకటేశం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆడిటింగ్ లో రూ. 20లక్షల రూపాయలు నిధులు గోల్ మాల్ జరిగినట్టుగా అధికారులు గుర్తించారు.కాగా అవుట్ సోర్సింగ్ మహిళా ఉద్యోగి నిర్వాకం వల్లే రూ.20లక్షల నిధులు గోల్ మాల్ అయినట్టు అధికారులు గుర్తించారు.సదరు మహిళా ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నుంచి ఇటీవలే రూ.13లక్షల 30వేలు రికవరీ చేసినట్టుఅధికారులు తెలిపారు.ఇదే విషయమై జిల్లా ఆడిటింగ్ అధికారి వెంకటేశంను వివరణ కోరగా ఆడిటింగ్ పూర్తయిందని రూ.20లక్షల వ్యత్యాసం గుర్తించినట్లుగా తెలిపారు.13లక్షల 30వేల రూపా యలు రికవర్ చేసినట్టు గా చెప్పారు.ఇంకా రూ.6లక్షల 70వేలు లెక్క తేలలేదని చెప్పారు. ఇదే విషయాన్ని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. రెండు రోజుల సమయాన్ని మున్సిపల్ అధికారులకు ఇచ్చినట్టుగా వెల్లడించారు.బ్యాంక్ స్టేట్ మెంట్స్, ఇతర రికార్డులు పరిశీలించి సరి చూస్తామ న్నారు.గోల్ మాల్ జరిగిన రూ.6.70లక్షలకు సంబంధించిన సరైన రికార్డులు చూపని పక్షంలో పై అధికారులకు నివేదిక అందజేసి తగిన చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు.



ఉపాధ్యాయురాలి మృతికి టీఎస్‌యూటీఎఫ్ నివాళ్లు

నవతెలంగాణ-కాప్రా

ఏఎస్ రావు నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు తులసీ కష్ణవేణి(45) కొంత కాలంగా అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీఎస్‌యూ టీఎఫ్ డబ్ల్యు ఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పలువురు ఉపాధ్యాయులు పి. చంద్రశేఖర్ రావు, జి.కృష్ణ, ఎం.కష్ణమూర్తి, గొట్టే కనకయ్య శ్రీధర్, యాదగిరి,లలిత, కవిత, సులోచన, శేఖర్, నిరంజనీ, శ్రీదేవి,లక్ష్మినరసమ్మ, అన్నపూర్ణ, శరత్కల తదితరులు మతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె మతికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మతరాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జనగామ జిల్లా బచన్నపేట మండలం కొన్నే గ్రామంలో తులసీ కష్ణవేణి ఉపాధ్యాయురాలుగా పనిచేశారు.

దోబీ ఘాట్‌లో సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-నేరేడ్ మెట్

గౌతంనగర్ డివిజన్ పరిధిలోని జ్యోతి నగర్ దోబీ ఘాట్ లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మా రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సునీత రాము యాదవ్‌తో కలిసి దోభిఘాట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా రజక సంఘం సభ్యులతో సమావేశమై వారి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నా రు. ఆయా సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అనంతరం వీరనారీ ఐలమ్మ విగ్రహానికి వారు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా రజక సంఘం సోదరులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రజక సంఘం, బీసీ కులాల ఐక్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా మీ వృత్తి కోసం దోబీ ఘాట్ కోసం మీరందరు పోరాడుతు న్నారన్నారు. మీ దోబీ ఘాట్ సమస్యను తాను తప్పని సరిగా పరిష్క రిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఐక్య వేది క నియోజకవర్గం అధ్య క్షులు కామల్ల ఐలన్న, ప్రధాన కార్యదర్శి రొయ్య ల కృష్ణమూర్తి, దోబీ ఘాట్ రజక సంఘం అధ్యక్ష లు పాండు, కార్యదర్శి కాసర్ల నాగరాజు,రజక సంఘాల, బీసీ కుల సంఘాల ఐక్య వేదిక నాయకులు జినుకుంట్ల రమేష్ గౌడ్, కరణం గోపి, అప్పాల శ్రీనివాస్, రజక సంఘం నాయకులు సత్యనారాయణ,తిరుపతి, మల్లేశం, వందలాది రజక సంఘం సభ్యులు నాయకులు, బీసీ కులాల ఐక్య వేదిక నాయకులు రాజకీయ పార్టీల నాయకులు, మహిళ సోదరి మణులు వందలాది రజకులు సంఘాల నాయకులు పాల్గొన్నారు,

మంచి ఆలోచన విధానంతోనే ఆరోగ్యం

- కోఠి మహిళా యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వినిత పాండే

నవతెలంగాణ-ఘట్కేసర్

మంచి ఆలోచన విధానంతోనే ఆరోగ్యం, ఆనందం వస్తుందని కోఠి మహిళా యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వినిత పాండే అన్నారు. ఘట్కేసర్ మండలం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఆవరణలో అడ్వాన్సు సైకలాజికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, అనురాగ్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్నె షనల్ హ్యాపినేస్ డే సందర్భంగా సైన్స్ ఆఫ్ హ్యాపినెస్ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా కోఠి మహిళా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వినిత పాండే పాల్గొని హ్యాపినేస్ సైన్స్ గురించి వివరించారు. సంతో షంగా ఉండాలంటే పాజిటీవ్ ఎమోషన్సతో ఉండా లని, ప్రొడక్టివ్ ఎంగేజ్మెంట్ మంచి మానవ సంబం ధాలు కలిగి ఉండాలని, తాత్కాలిక ఆనందాల జోలికి వెళ్లకుండా జీవిత విజయాల వైపు కషి చేసినప్పుడే ఆనందం ఉంటుందని తెలిపారు. గతంలో, భవిష్యత్తులో, జీవించ కుండా వర్ధమానంలో జీవించాలని సూచించారు. చిన్న చిన్న సామాజిక కార్యక్రమాలు చేపట్టడం వల్ల మనిషిలో మానవత్వంతో పాటు ఆరోగ్యాన్ని ఇస్తుందని గుర్తు చేశారు. అడ్వాన్స్ సైకలాజికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా



గ్రేటర్ హైదరాబాద్ గౌరవ అధ్యక్షుడు, అనురాగ్ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ మహిపతీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ 2225 మానసిక శాస్త్రంలో జరిగిన పరిశోధనలో తేలిన అంశాలను గురించి విద్యార్థులకు వివరించారు. ఆనందంగా ఉన్నవారు చదువులో, ఉద్యోగాలలలో రాణించగలరని తెలిపారు. ఆనందంగా ఉండే వారు క్రియా శీలకంగా ఆలోచిస్తారని, సంతోషంగా ఉన్నావారు జీవితంలో విజయాలు సొంతం చేసుకుంటారని, స్నేహితులు సహితం ఉంటారని, శారీరకంగా మానసింగా ఆనందగా ఉండడంతో ఎక్కువ కాలం జీవిస్తారని తెలిపారు. ఆనందంగా ఉన్న వారు అనారోగ్యాల నుంచి తొందరగా కోలుకుంటారని అన్నారు. ఫార్మసీ డీన్ డాక్టర్ వసుధ బక్షీ మాట్లాడుతూ శారీరక వ్యాయం మానసిక వ్యాయమంతో ఆనందాన్ని పొందవచ్చునని తెలిపారు. సదస్సు కో ఆర్డినేటర్లు కష్ణ ప్రసాద్, సునంద్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-అల్వాల్

ఆల్వాల్‌లో శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు మంగళవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ డి. మధుబాబు పర్యవేక్షణలో జరిగింది. 50 రోజులకు గాను రూ. 1,64,523/- ల ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా, సంజయ్, గోపాల్ సైంచర్, ఈ. ఓ. ఎం. వీరేశం, స్థానిక జే ఏ సి నాయకులు సురేందర్ రెడ్డి, భక్తులు బి.వి రాంచందర్ రావు, శివరామ క్రిష్ణ, రామారావు, మూర్తి, వసంత, నిర్మల, కవిత, రోహిణి లావణ్య వినోద, దేవస్థాన అర్చక సిబ్బంది పాల్గొన్నారు..

రైతు సేవా సహకార నంఘాన్ని ఆదర్శంగా నిలపాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిషత్ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి



నవతెలంగాణ-ఘట్కేసర్

సహకార సంఘం పాలకవర్గం రైతులు సమన్వయంతో పనిచేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అన్నారు. ఘట్కేసర్ పట్టణం లోని నారాయ్యం గార్డెన్‌లో రైతు సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ మేరకు చైర్మెన్ పాల్గొని మాట్లాడుతూ రైతులు అపోహలకు పోకుండా ప్రతీ సందేహాన్ని అధికారులతో పాలకవర్గం సభ్యులతో కలిసి తీర్చుకోవాలని సూచించారు. పాలకవర్గం సభ్యులు, అధికారులు రైతులకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. సమిష్టిగా పనిచేసినప్పుడే ఈ సంఘాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చునని తెలిపారు. రైతులు మూసి కలుషిత నీటితో పంటలు పండించుకోవడానికి సహితం ఇబ్బందులు పడుతున్నారని, మూసి నీళ్లలోకి దిగితే కాలు మంటలు వస్తున్నాయని రైతులు పలు మార్లు వాపోయారని, దీనికి తెలంగాణ ప్రభుత్వం మూసి ప్రక్షాళనకు కృషి చేస్తుందని, మూసీ పరివాహక రైతుల సమస్య తీరిపోనున్నదని తెలిపారు. గత కొన్ని రోజుల క్రితం నారాయణ రావు కాల్వ పైప్లైనుల ఏర్పాటు పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. తాను ఎప్పుడు రైతులకు అందుబాటులో ఉంటానని, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. పాలకవర్గం సభ్యుల వినతి మేరకు అనువైన ప్రాంతంలో గోదాంల నిర్మాణానికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార సంఘం జాయింట్ రిజిస్ట్రార్ సురేఖ వ్యాప్తి, యూనియన్ బ్యాంక్ ఏజీఎం రఘునాథ్ రెడ్డి, వైస్ చైర్మెన్ బద్దం అనంత్రెడ్డి, సహకార సంఘం ఎండి కర్మలాకర్, డైరెక్టర్లు, ఎంపీటీసీలు, రైతులు ఇ తర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జవహర్ నగర్‌లో అక్రమ నిర్మాణాలు కూల్చివేత



నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జవహర్ నగర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి, టీపీఎస్ స్రవంతి హెచ్చరించారు. మంగళవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెం.611, మోహన్ రావ్ కాలనీలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను రెవెన్యూ జవహర్ నగర్ టౌన్ ప్లానింగ్, మునిసిపల్ సిబ్బందితో కలిసి కూల్చి వేశారు. అనంతరం కార్పొరేషన్ లోని పలు సర్వే నెంబర్లలో అక్రమంగా నిర్మించిన రూములను రెవెన్యూ సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ పేద ప్రజలు ఎవరూ ప్రభుత్వ భూములలో ప్లాట్లు కొని మోసపోవద్దని, ప్రభుత్వ భూములలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.



మహిళలతో ఈటల జమున ముఖాముఖి

నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఈసీ నగర్‌లో వివిధ కాలనీల మహిళలతో బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం గత పది సంవత్సరాలలో చేసినటువంటి సంక్షేమ పథకాలను వివరించారు అదేవిధంగా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఈటల రాజేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు డినాదం, బీజేపీ రాష్ట్ర ఎస్సీ సెల్ పబ్లిసిటీ కన్వీనర్ కొమ్ము నరసింహ రావు, మేడ్చల్ జిల్లా మహిళా మోర్చా అధికార ప్రతినిధి కే.నాగమణి, చర్లపల్లి మహిళా మోర్చా అధ్యక్షురాలు చంద్రకళ, చర్లపల్లి డివిజన్ మహిళా మోర్చా సీనియర్ నాయకురాలు జ్యోతి రెడ్డి, కళావతి, రమాదేవి, చిన్న చర్లపల్లి సమాఖ్య అధ్యక్షురాలు దొమ్మాట కల్పన, కే బాలమణి, కే సబితా రెడ్డి ,ఉప్పల అసెంబ్లీ అధికార ప్రతినిధి లక్ష్మణ్ గౌడ్ రేగొండ వెంకటేశ్వర్లు హరినాయక్ తదితరులు ఉన్నారు.



వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- మల్కాజిగిరి ట్రాఫిక్ సీఐ శివ శంకర్

నవతెలంగాణ-నేరేడ్ మెట్

రోడ్లపై వాహనా లు నడిపే ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని మల్కాజిగిరి ట్రాఫిక్ సీఐ శివ శంకర్ అన్నారు. మంగళవారం మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం, నెహ్రూ యువ కేంద్రం సం యుక్త ఆధ్వర్యంలో ట్రాఫిక్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శైలజ అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ట్రాఫిక్ సీఐ శివ శంకర్ మాట్లాడుతూ... ట్రాఫిక్ నిబంధన లు పాటించకపోతే చట్ట పరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపవద్దని, లైసెన్స్ పొందిన వారు మాత్రమే వాహనాలు నడపాలని సూచించారు.అతి వేగం ప్రమాదకరమని హెచ్చరించారు. ఈ కార్యక్రమం అనంతరం విద్యార్థులు నేరేడ్‌మెట్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ ఆఫీసర్ ఏం. సాంబశివ రావు,బల రామారావు, నోడల్ ఆఫీసర్ ఐషయ్య, జాతీయ సేవా విభాగం అధికా రులు డాక్టర్ ఎస్.రమేష్, డాక్టర్ జగన్, జి. మల్లిక, డాక్టర్ పి.రవీందర్, ఏ.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాల్లో సాంబశివుడి చరిత్రను చేర్చాలి

- ట్యాంక్ బండ్ మిద ఆయన విగ్రహం పెట్టాలి
- కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర కార్యదర్శి మంగ యాకయ్య



నవతెలంగాణ-జవహర్‌నగర్

సాంబశివుడి విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ప్రభుత్వం పెట్టాలని, పాఠ్యపుస్తకాల్లో ఆయన చరిత్రను పొందు పరచాలని కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర కార్యదర్శి మంగ యాకయ్య కురుమ అన్నారు. మంగళవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో సాంబశివుని 13వ వర్ధంతిని కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర కార్యదర్శి మంగ యాకయ్య ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనపురి అయిలయ్య అలియాస్ సాంబశివుడు నల్లగొండ జిల్లా వలి గొండ మండలం దాసిరెడ్డిగూడెం గ్రామంలో జన్మించారని తెలిపారు. నక్సలైట్ ఉద్యమంలో 16 ఏండ్ల పాటు పనిచేసి మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, అనంతరం తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తూ, ప్రజల గుండెల్లో చిర స్థాయిగా గుర్తు ఉండేలా తనదైన ముద్ర వేశారన్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి, తన ఆటపాటతో ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన సాంబశివుని అడుగుజాడల్లో యువత పయనిం చాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సాంబశివుని ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం సాంబశివుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారత సంఘటన కార్యదర్శి దినేష్ కులకర్ణి



నవతెలంగాణ-ఘట్కేసర్

రైతులకు తెలంగాణ ప్రభుత్వంఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని భారతీయ కిసాన్ సంఘ్ అఖిలభారత సంఘటన కార్యదర్శి దినేష్ కులకర్ణి డిమాండ్ చేశారు భారతీయ కిసాన్ సంఘ్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలంలోని శివారెడ్డిగూడా బంధన్ ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర అధ్యక్షుడు జోగినపల్లి రంగారావు అధ్యక్షతన జరిపారు. ఈ సమావేశంలో అఖిల భారతీయ సంఘటన మంత్రి మాననీయ దినేష్ కులకర్ణి పాల్గొని మాట్లాడుతూ రైతులందరినీ పార్టీల కతీతంగా సంఘటితపరిచి రైతుల సమస్యలను రైతులే గ్రామస్థాయి నుంచి గుర్తించి పరిష్కరించుకునేందుకు "హర్ కిసాన్ హమారా నేత హై" మన సమస్యలను మనమే పరిష్కరించుకునేందుకు మనమంతా సమైక్యంగా ఉండి ప్రతీ సమస్యను తీర్చుకోవాలని, 140 కోట్ల మంది భారతీయులకు సరిపడే ఆహార పదార్థాలను పండిస్తున్న రైతులకు లాభసాటి ధర కావాలని కోరారు. రైతులందరూ ఒకే కుటుంబ సభ్యులని, కుటుంబ భావన సమాజం యెడల చింతన కలిగి ఉండాలని రైతు అభివద్ధి దేశం అభివద్ధి అని తెలియజేస్తూ ప్రభుత్వాలు రైతులకు వెన్నం టి ఉండాలన్నారు. ఈ సమావేశంలో కిసాన్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని, రుణమాఫీ డబ్బులు జమ చేయనందున ఖాతాదారులను బ్యాంకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ సంవత్సరం తక్కువ వర్షపాతం కావడం వల్ల రైతులు వేసుకున్న వరి చేనులు ఎండిపోవడం జరుగుతున్నదన్నారు. మూలిగేనక్క మీద తాటి కాయ పడ్డట్టు "ఈ మధ్యలో అకాల వర్షాలు ,రాళ్ళ పడి వరి పంటలు, మొక్కజొన్న పంట, మామిడి పిందెలు దెబ్బతిని రైతు కోలుకోలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు. అలాంటి రైతుకు ఎకరానికి రూ. 25 వేలు ఎక్స్గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కోరారు. వచ్చే ఖరీఫ్ నుండి రైతులకు క్రాఫ్ ఇన్సూరెన్స్ ప్రభుత్వం చెల్లించి అందులో రైతు నుంచి ఒక రూపాయి తీసుకొని అమలు చేయాలని.. ఒక రూపాయి చెల్లించడం వలన రైతుకు హక్కు ఉంటుందన్నారు. కోస్గి పశువుల సంతలో ఆవుకి రూ. 1000 అప్పుడే పుట్టిన దూడకు రూ. 1000 మార్కెట్ ఫీజు కింద వసూలు చేయడం జరుగుతోందని చెప్పారు. ఇది అత్యంత దారుణమైన విషయమన్నారు. దీనిని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని మార్కెట్లలో తక్ పట్టీలు రైతులకు ఇవ్వడం లేదని.. అర్థి, ముట్టి, చాట పేరుతో రైతులను నిలువు దోపిడిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో గతంలో వడ్ల కొనుగోలు సమయం లో తరుగు పేరుతో క్వింటాలుకు 8 నుంచి 10 కిలోల వరకు తరుగు తీయడం జరిగిందని.. ఈ ప్రభుత్వంలో అలాంటి అన్యాయం జరగకుండా చూడాలని.. ప్రభుత్వం ప్రకటించినట్టు రూ. 500 బోనస్ కలిపి రైతులకు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత కార్య దర్శి కే సాయి రెడ్డి, క్షేత సంఘటన కార్యదర్శి దోనూర్ రాము, జాతీయ కార్యవర్గ సభ్యులు ముదిగంటి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, సభ్యత నమోదు ప్రముఖ్ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, ఉపాధ్యక్షురాలు లావణ్య రెడ్డి, ప్రచార ప్రముఖులు లెగల శ్రీనివాసులు, మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ కిసాన్ సంఘ నాయకులు రాజేందర్ రెడ్డి, అంజి రెడ్డి, సుదర్శన్ రెడ్డి, తెలంగాణ అన్ని జిల్లాల నుండి కిసాన్ సంఘ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యేను కలిసిన చిన్నం శ్రీను



నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్యను మంగళవారం యాదగిరిగుట్టలోని ఆయన నివాసంలో జవహర్ నగర్ కార్పొరేషన్ ప్రగతినగర్ కు చెందిన యాదాద్రి కాంగ్రెస్ పార్టీ భువనగిరి జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చెమటకాయలని తగ్గించుకోండి ఇలా...



వేసవి వచ్చిందంటే చెమటకాయల సమస్య మొదలవుతుంది చాలా మందికి. ఇవి చిన్న ఎర్ర పొక్కుల్లా ఉంటాయి. ఈ చెమటకాయలు సాధారణంగా ముఖం, మెడ, వీపు, ఛాతీ ప్రాంతాల్లో ఎక్కువగా వస్తాయి. వేడిగా, ఉక్కగా ఉండే వాతావరణంలో ఉండే వారికి ఈ సమస్య తప్పనిసరి. ఇది ముందు విపరీతమైన చెమటతో మొదలవుతుంది. చర్మం మీద ఉండే డెడ్ స్కిన్ సెల్స్ ఈ చెమటని స్కిన్ కింద ట్రాప్ చేస్తాయి. ఆ చెమట చిన్న చిన్న పొక్కులుగా ఏర్పడుతుంది. ఇవి పగిలినప్పుడు మంటగా అనిపిస్తుంది. అందుకే ఈ సమస్యని ప్రిక్లీ హీట్ అని కూడా అంటారు. ఈ చెమటకాయల సమస్య రాకుండా ఉండాలంటే ఏం చేయాలో తెలుసుకుందాం.

కాటన్ బట్టలు వేసుకోండి..

శరీరం చల్లగా, గాలి తగిలేలా ఉండడం ముఖ్యం. మీకు కుదిరితే చెమట కాయలు ఉన్న చోట కాసేపు బట్ట తొలగించి డైరెక్ట్‌గా గాలి తగిలేలా చూడండి. చిన్న పిల్లలకి అవసరం అనుకున్న సమయంలోనే వేయండి. మీరు కూడా వదులుగా ఉండే కాటన్ బట్టలు వేసుకోండి. సింథటిక్ బట్టలు వేసుకోకండి. సమ్మర్ లో తేలిక పాటి రంగుల్లో వదులుగా ఉండే కాటన్ బట్టలు వేసుకోండి. సింథటిక్ బట్టల్లో గాలి ఆడదు. కాటన్ బట్టలు శరీరానికి గాలి తగిలేటట్లు చూస్తాయి. స్కిన్ పొడిగా ఉంచుకోండి. ఈ వేడి లో స్కిన్ ని ఎప్పుడూ పొడిగా ఉంచుకోండి. స్నానం అయిన తరవాత వెంటనే టవల్ తో పొడిగా అద్దుకోండి. గట్టిగా తుడవకండి. వెంటనే పౌడర్ చల్లుకుంటే చల్లగా ఉంటుంది.

పెరుగు

పెరుగు ఎప్పుడూ చల్లగా ఉంటుంది. చల్లని పెరుగుని చెమట కాయల మీద అప్లై చేసి పదిహేను నిమిషాల పాటూ వదిలెయ్యండి. తరవాత చల్లని నీటితో కడిగేసి మెత్తటి బట్టతో అద్దండి. గట్టిగా తుడవకండి. పెరుగులో ఉన్న యాంటీ-బాక్టీరియల్ యాంటీ-ఫంగల్ ప్రాపర్టీస్ ఈ సమస్యకి త్వరగా చెక్ పెడతాయి.

కొబ్బరి నీళ్ళు తీసుకోండి..

బయట ఉన్న వేడికి శరీరంలో నీళ్ళు ఆవిరైపోతాయి కాబట్టి ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉండేలా చూసుకోవడం అవసరం. కొబ్బరి నీళ్ళు, నిమ్మకాయ నీళ్ళు, లస్సీ, మజ్జిగ వంటివి తాగుతూ ఉండండి. ఆల్కహాల్‌కీ, ఏరేటెడ్ డ్రింక్స్‌కీ నో చెప్పండి. ఫ్లేవర్డ్ వాటర్ కూడా మీ డైట్‌లో చేర్చుకోవచ్చు.

మంచి ఆహారం...

వేపుళ్ళూ, స్వీట్సూ తగ్గించి సాలడ్స్, ఫ్రూట్స్ తీసుకోండి. తాజా కూరగాయలు, ఇంట్లో వండిన వంటనే తీసుకోండి. పండ్లు ఎక్కువగా తీసుకోండి.

ఆస్తా వోహ్రా... చదువు కోసం, ఉద్యోగం కోసం చేసిన సుదీర్ఘ ప్రయాణంలో ఆమెకు ప్రపంచం అంటే ఏమిటో తెలిసొచ్చింది. లింగ వివక్ష సమాజంలో ఎంతగా ఉందనే వాస్తవాన్ని అర్థం చేసుకుంది. తన సన్నిహిత మిత్రుడైన రితేష్ డి రిటెలిన్‌తో తన కొత్త అనుభవాలను పంచుకుంటున్న సమయంలో ఈ సమాజంలో ఒక అంతరం ఉందని గ్రహించింది. అమ్మాయిలకు 'అలా వుండూ ఇలా ఉండకు' అంటూ తీర్పు చెప్పే స్థితి నుండి వారిని వారిగా గుర్తించడం, అంగీకరించడం, అర్థం చేసుకోవడంలో సమాజానికి సహాయపడటానికి ఒక వంతెన అవసరమనుకుంది. ఆ ఆలోచన నుండి ఉద్భవించినదే 'మంజురి'. ఇది ఇప్పుడు భారతదేశంలోనే మొదటి సెక్స్ ఎడ్యుకేషన్ కంపెనీగా అవతరించడానికి ప్రయత్నిస్తోంది. సమాజానికి అవసరమైన సమగ్రమైన సానుకూల లైంగిక విద్య అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఆమెతో సంభాషణ...



మహిళకు ఇది యుద్ధం చేసినట్టే

నేను ఒక పంజాబీ సాంప్రదాయ కుటుంబం నుండి వచ్చాను. నిత్యం పురుషాధిక్యతను ఎదుర్కొనే సమాజం మనది. అయితే రితేష్‌తో మాట్లాడే సమయంలో నాకు అర్థమైంది, మహిళలకు వారి అవసరాలు, వాటి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించే వేదిక ఇప్పటి వరకు ఒక్కటి కూడా లేదని. చాలా మంది ఇంటర్నెట్‌లపైనే ఆధారపడుతుంటారు. నేను కాలేజీలో చదివేటపుడు కొందరు నాకు ఫేస్ మసాజర్స్ గురించి చెప్పారు. ఇది చాలా చవకైన వైబ్రేటర్. ఇవన్నీ నిజానికి స్వీయ ఆనందం కోసం ఉద్దేశించిన వైబ్రేటర్లు. వీటి వల్ల అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే భారతీయ సమాజ సాంప్రదాయిక స్వభావమే దీనికి కారణం. మేము ఈ అంతరాన్ని గుర్తించాము. అదే నేటికీ బ్రాండ్‌గా మమ్మల్ని ప్రేరేపిస్తుంది. మేము ఏం చెప్పినా సూటిగా చెప్పాలనుకున్నాం. అందుకే మేము వైబ్రేటర్‌ను వైబ్రేటర్ అని పిలుస్తాము, 'మసాజర్' అని కాదు.

ఉద్యోగాన్ని విడిచిపెట్టాను

మంజురి ప్రారంభించినప్పుడు నాకు మద్దతుదారులు ఎవరూ లేరు. మొదటి ఆరు నెలలు నా ఉద్యోగం చేసుకుంటూనే కొంత సమయం మాత్రమే మంజురి కోసం ప్యాకేజింగ్, షిప్పింగ్, కస్టమర్ సర్వీస్‌ను కూడా నిర్వహించాను. అయితే తక్కువ కాలంలోనే మాకు మంచి స్పందన వచ్చింది. కస్టమర్ల నుండి మేము అందుకున్న ప్రేమ, ఆకర్షణ చాలా గొప్పదని చెప్పుకోవచ్చు. ఆ ఆధరణతోనే నా మిషన్ కోసం పూర్తి సమయం కేటాయించడానికి ఎనిమిది నెలల్లోనే నా ఉద్యోగాన్ని విడిచిపెట్టాను. ఇది ఒక కంపెనీగా ఎదిగేందుకు మాకు అవసరమైన గొప్ప మద్దతు రితేష్, అతని కుటుంబం నుండి వచ్చింది.

యుద్ధం చేయడమే

మహిళలు తరచుగా తమ హక్కులు, అవసరాల కోసం నిలబడేందుకు సంకోచిస్తుంటారు. సాధారణంగా ఈ సమాజంలో మహిళల శక్తిని తక్కువగా అంచనా వేస్తారు. నాకు మహిళల నుండి కూడా పెద్దగా మద్దతు లభించలేదు. అలాంటి సమయంలో పురుషుల నుండి వచ్చిన తిరుగులేని ప్రోత్సాహానికి నేను కృతజ్ఞతలు చెప్పాలి. ఈ అనుభవం నాకు స్త్రీ, పురుషుల నుండే కాదు ట్రాన్స్‌జెండర్స్ నుండి కూడా మద్దతు వచ్చేలా చేసింది. ఒక భారతీయ మహిళగా నేను నిషిద్ధ అంశాల గురించి మాట్లాడుతున్నానంటే ఇది కూడా ఓ యుద్ధం చేయడం లాంటిదే. ఎందుకంటే మన దేశంలో మహిళలు తమ ఆలోచనలు, కోరికలు, ముఖ్యంగా లైంగిక అవసరాల గురించి బయటకు చెప్పకూడదకు. అలా చెప్తే వాళ్ళు ఎంతో పాపం చేసినట్టు.



మనసు విప్పి చెప్పేలా...

> స్త్రీలు తమ సొంత అవసరాలు, కోరికలను నియంత్రించుకున్నప్పుడు అది వారి జీవితంలోని ప్రతి అంశంపైనా కచ్చితంగా ప్రభావం చూపుతుంది. దీన్ని నేను హృదయపూర్వకంగా నమ్ముతున్నాను. కనుక వారు మనసు విప్పి తమ ఆలోచనలు చెప్పుకునే అవకాశం కల్పించాలి. అది వృత్తిలో, బెడ్ రూంలో, బోర్డ్‌రూమ్‌లో' ఎక్కడైనా కావొచ్చు. వారికి నచ్చితే నచ్చిందని, నచ్చకపోతే నచ్చలేదని చెప్పే హక్కు వారికి

సవాళ్లు ప్రత్యేకమైనవి

కంపెనీ గురించి ప్రచారం చేసేందుకు సోషల్ మీడియాను ఉపయోగించుకోవాలనుకున్నాం. ప్రజలకు అవగాహన కల్పించాలనుకున్నాం. కానీ మేము అతి కొద్ది కాలంలోనే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, నెట్‌వర్కింగ్ సైట్‌లు, చెల్లింపు గేట్‌వేల నుండి నిషేధించబడ్డాము, తిరస్కరించబడ్డాము. దీనిపై మేము కేసు కూడా వేశాము. దాంతో నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫారమ్ కొంత కాలం తర్వాత మాపై నిషేధాన్ని తీసివేసింది. ఇప్పుడు సెక్స్‌పోజిటివ్ కంటెంట్‌కు మరింత పుష్ ఇచ్చింది. ఇలాంటి మద్దతు కోసం మేమెంతో కృషి చేశాం. ఎందుకంటే మేము ఒంటరిగా చేయలేమని మాకు తెలుసు. మా కేసును ముందుకు తీసుకురావడానికి సంఘం మాకు సహాయం చేసింది. అలాగే 'మహిళగా ఉండి సెక్స్ టాయిస్ ఎందుకు అమ్ముతున్నావు, పెండ్లి తర్వాత కూడా దీన్ని కొనసాగిస్తావా, మాస్టర్స్ చేసి ఇలాంటి పని చేయాల్సిన అవసరం ఏటి' ఇలా ఎన్నో ప్రశ్నలు అడుగుతుంటారు. కానీ నేను మాత్రం ఇలాంటి ఒక వేదిక మన మహిళలకు అవసరం అని గుర్తించాను. కనుక ఎట్టి పరిస్థితుల్లో కొనసాగిస్తాను.

సానుకూల స్పందన

అతి తక్కువ కాలంలోనే ఆడా, మగా తేడా లేకుండా ప్రజలందరి నుండి సానుకూల స్పందన వచ్చింది. ఇది మాకు ఆనందకరమైన ఆశ్చర్యాన్ని కలిగించింది. మా ఆఫ్‌లైన్ ఈవెంట్‌ల సమయంలో 20 నుండి 50 ఏండ్ల వయసు గల మహిళలు నా దగ్గరకు వచ్చి ఇలాంటి అవగాహనా కార్యక్రమాలు చాలా అవసరమంటూ హృదయపూర్వకంగా మనసు విప్పి మాట్లాడేవారు. ఎప్పుడైనా నేను ఈ పని చేయగలనా అని ఢీలా పడినప్పుడు ఇలాంటి ప్రేమ నన్ను తిరిగి ట్రాక్‌లోకి తీసుకువస్తుంది.

ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా ఒక కస్టమర్ మాకు ఉత్సాహం కలిగించే విధంగా వాయిస్ మెసేజ్ పెట్టింది. ఇలాంటి ఉద్వేగభరితమైన మహిళలను కలవడం వల్ల నా లక్ష్యాన్ని సాధించడానికి నేను ఒక అడుగు దగ్గరగా ఉన్నాననే భరోసాను నాకు ఇస్తుంది.

- సలీమ

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల నమోదును పెంచే చర్యలు చేపట్టండి

- మభ్యపెట్టి ప్రవేశాలు చేపడుతున్న కార్పొరేట్ కాలేజీలు : ఇంటర్ బోర్డు కార్యదర్శికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల నమోదును పెంచడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజాకు ఆయన మంగళవారం లేఖ రాశారు. రాష్ట్రంలో 416 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రథమ సంవత్సరంలో 85,038 మంది, ద్వితీయ సంవత్సరంలో 78,799 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ప్రతి కాలేజీలో కనీసం నాలుగు గ్రూపులుండాలనీ, ఒక్కో దాంట్లో కనీసం 40 మంది విద్యార్థులుంటే ప్రథమ సంవత్సరంలో 160 మంది, ద్వితీయ సంవత్సరంలో 160 మంది కలిపి మొత్తం 320 అవుతారని పేర్కొన్నారు. కానీ 25 జూనియర్ కాలేజీల్లో వందలోపు, 75 కాలేజీల్లో 200 లోపు విద్యార్థులున్నారని వివరించారు. హైదరాబాద్‌లోని హుస్సేనీ ఆలం కాలేజీల్లో 1,500 నుంచి రెండు వేల వరకు, మహబూబ్‌నగర్, వికారాబాద్, నాంపల్లిలోని జూనియర్ కాలేజీల్లో 1,200 మంది విద్యార్థుల వరకు చదువుతున్నారని తెలిపారు. ప్రయివేటు జూనియర్ కాలేజీల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 2.50 లక్షల చొప్పున చదువుతున్నారని పేర్కొన్నారు. ఒక్కో గ్రూపులో పది మందిలోపు విద్యార్థులున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 30కిపైగా ఉన్నాయని వివరించారు. నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్ కాలేజీలు పీఆర్వోలను నియమించుకుని పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి ప్రవేశాలు చేపడుతున్నాయని విమర్శించారు. ఆ ప్రవేశాల ప్రక్రియను నిలిపేయాలని డిమాండ్ చేశారు. పదో తరగతిలో పది జీపీఏను సాధించిన వారిలో ఎక్కువ మంది కార్పొరేట్ కాలేజీల్లో చదువుతున్నారని తెలిపారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో వారు సాధించిన మార్కులు, ర్యాంకులను విడుదల చేయాలని కోరారు. కొద్ది మందికి మాత్రమే మంచి ర్యాంకులు వస్తున్నాయని వివరించారు. మెజార్టీ విద్యార్థులు ఇంటర్‌లో తక్కువ మార్కులను సాధిస్తున్నారని తెలిపారు. పదో తరగతిలో తక్కువ జీపీఏ లేదా సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరుతున్నారని వివరించారు. అయినా అక్కడ మెరుగైన ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ విషయాలతో కరపత్రాన్ని ముద్రించి తల్లిదండ్రులకు పంచితే వాస్తవాలు తెలుసుకుని తమ పిల్లలను ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేర్పించే అవకాశముంటుందని సూచించారు.

మోడీని, బీజేపీని ఇంటికి పంపేదాకా నిద్రపోం

- ఉదయనిధి స్టాలిన్



చెన్నై : లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీని, బీజేపీని ఓడించేవరకూ తమ పార్టీ నిద్రపోదని తమిళనాడు క్రీడా మంత్రి, డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ తేల్చిచెప్పారు. డీఎంకేకు, ఇండియా కూటమి పార్టీలకు నిద్రలేదంటూ ప్రధాని నరేంద్రమోడీ చేసిన వ్యాఖ్యలపై ఆయన దీటుగా స్పందించారు. తమిళనాడులోని తిరువన్నామలై ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ 'అవును, మోడీని, బీజేపీని ఇంటికి సాగనంపేవరకూ మనం నిద్రపోలేము. 2014లో రూ.450 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర రూ.1200. ఎన్నికలతో మోడీ డ్రామా మొదలైంది. రూ.100 తగ్గించారు. ఎన్నికల తర్వాత రూ.500 పెంచుతారని' విమర్శించారు. తమిళనాడులో తుపాను బీభత్సం సృష్టించిన కాలంలో మోడీ ఇటువైపు తొంగి చూడలేదని విమర్శించారు. కేంద్రం నుంచి ఆర్థిక సాయం చేయాలని ముఖ్యమంత్రి కోరినా, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఉదయనిధి తెలిపారు.

అవినీతిని చట్టబద్ధం చేసిన మోడీ సర్కార్

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించిన పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంతోపాటు అనంతరం విలేకరుల సమావేశంలోనూ తమ్మినేని వీరభద్రం మాట్లాడారు. దేశం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్న సమయంలో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. బీజేపీ భారత రాజ్యాంగాన్ని సంపూర్ణంగా మార్చి ఆ స్థానంలో మనుధర్మాన్ని తీసుకొచ్చి ఫ్యూడల్ పద్ధతులు ప్రవేశపెట్టడం కోసం కృషి చేస్తోందని అన్నారు. అధికారం నిలబెట్టుకునేందుకు కుల, మత, ప్రాంతీయ విద్వేషాలు సృష్టిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి అడ్డుగా ఉన్న భారత రాజ్యాంగాన్ని మార్చడమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. ఇప్పటికే సీఏఏ, పౌరసత్వ చట్టం అమలుకు పూనుకుందని, జ్యోతిష్య శాస్త్రం, వాస్తు వంటివి ప్రవేశపెట్టి విద్యా కాషాయీకరణకు యత్నిస్తోందన్నారు. ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను వేధించడం.. లొంగదీసుకోవడం, ప్రశ్నించే మేధావులను జైళ్లల్లో పెట్టడం లాంటివి చేస్తోందని విమర్శించారు.

బీజేపీ 2014 ఎన్నికల ముందు నల్ల డబ్బును బయటికి తీసి దేశ ప్రజల ఖాతాల్లో ప్రతి ఒక్కరికీ రూ.15 లక్షలు జమ చేస్తామని చెప్పిందన్నారు. కానీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక అవినీతికి చట్టబద్ధత కల్పించిందని విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో వివిధ రాజకీయ పార్టీలకు అందిన వాటిల్లో అత్యధికం బీజేపీ ఖాతాలోకే చేరాయని చెప్పారు. ఎలక్టోరల్ బాండ్స్ చట్ట విరుద్ధమైనవని సీపీఐ(ఎం) మొదటి నుంచీ పోరాడిందని గుర్తు చేశారు. సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవడం వల్ల అవినీతి బయటికి వచ్చిందన్నారు. ఆకలి సూచీలో మనదేశం 111 స్థానంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో పదేండ్లుగా బీజేపీ చేసిన అవినీతి, అక్రమాలు, ఇచ్చిన హామీలపై పెద్దఎత్తున చర్చ జరుగుతోందన్నారు. నాడు వ్యాపారస్తులు వేరు, రాజకీయ నాయకులు వేరుగా ఉండేవారని, నేడు వ్యాపారస్తులే రాజకీయ నాయకులుగా మారారని, వారే ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని తెలిపారు. వేల కోట్ల రూపాయల అధిపతులు ఎన్నికల బరిలో ఉంటున్నారని, ఎన్నికయ్యాక వారు ఇంకా ఎక్కువ సంపాదించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే నిరంతరం నిజాయితీగా నికరంగా ప్రజా సమస్యలపై పోరాడే జహంగీర్‌ను భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థిగా నిలబెట్టామని, ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఫోన్ ట్యాపింగ్ పరికరాల కొనుగోళ్లపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరికీ సీపీఐ(ఎం) చేసిన ప్రజాపోరాటాలు తెలుసన్నారు. తమ పార్టీ పోరాటాల ఫలితంగా పేదలకు భూములు, ఇండ్ల స్థలాలు సాధించి పెట్టారని చెప్పారు. నకిరేకల్, ఇబ్రహీంపట్నం, జనగామ, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా గెలిచి ప్రజల కోసం పని చేశారన్నారు. భువనగిరి పార్లమెంట్ ఏర్పడిన 2009 ఎన్నికల నుంచి సీపీఐ(ఎం) పోటీ చేస్తోందన్నారు.

ఈ పార్లమెంట్ పరిధిలో సీపీఐ(ఎం) అనేక ప్రజా పోరాటాలు నిర్వహించిందన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను ప్రజలు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మీ, సీపీఐ(ఎం) ఎంపీ అభ్యర్థి ఎండి.జహంగీర్, రంగారెడ్డి, సూర్యాపేట, జనగామ, సిద్దిపేట జిల్లాల కార్యదర్శులు కాడిగళ్ల భాస్కర్, మల్లు నాగార్జున రెడ్డి, మోకు కనకారెడ్డి, ఆముదాల మల్లారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, పైళ్ల ఆశయ్య, ఎంపీ రమణ, డబ్బికార్ మల్లేశం, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగ నర్సింహ, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దొనూరి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఏం చూసి మోడీకి ఓటేయాలి?

(మొదటిపేజీ తరువాయి)

సోనియమ్మ నాయకత్వాన్ని బలపరచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు తుక్కుగూడ రాజీవ్ గాంధీ ప్రాంగణంలో భారీ బహిరంగ సభ నిర్వహించి ఆరు గ్యారంటీలను ప్రకటించుకున్నామని గుర్తు చేశారు. ఏప్రిల్ 6 లేదా 7న మళ్లీ అక్కడే జాతీయస్థాయి గ్యారంటీలను ప్రకటించబోతున్నట్టు తెలిపారు. రంగారెడ్డి జిల్లా నుంచే దేశ రాజకీయాలకు శంఖారావం పూరించబోతున్నామని చెప్పారు. ఈ జనజాతర సభకు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే హాజరవుతారని తెలిపారు. ఇదిలా వుండగా మిగతా ఎంపీ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు బుధవారం సీఎం ఢిల్లీకి వెళ్లనున్నారు.

29న టీపీసీసీ కార్యవర్గ సమావేశం
సీఎం రేవంత్‌తో మహేష్‌కుమార్ భేటీ

పార్లమెంటు ఎన్నికలు, తుక్కుగూడ బహిరంగ సభ తదితరాంశాలపై చర్చించేందుకు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ సీఎం రేవంత్‌తో మంగళవారం భేటీ అయ్యారు. ఈనెల 29న టీపీసీసీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రితోపాటు ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శులు, సీనియర్ నాయకులు హాజరుకానున్నారు.

మార్చిలోనే మండుతోంది

(మొదటిపేజీ తరువాయి)

కరీంనగర్, జగిత్యాల, జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. హైదరాబాద్‌లోనూ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో మంగళవారం అత్యధికంగా జూబ్లీహిల్స్‌లో 39.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. అయితే, ఈ నెల 31, ఏప్రిల్ ఒకటో తేదీన రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడే అవకాశముంది.

తాళ్ల మడుగు(ఆదిలాబాద్)	42.3 డిగ్రీలు
సత్నాల(ఆదిలాబాద్)	42.3 డిగ్రీలు
చాప్రాల(ఆదిలాబాద్)	42.1 డిగ్రీలు
అసిఫాబాద్ (కొమ్రంభీమ్)	42.0 డిగ్రీలు
అర్లీ(టి)(ఆదిలాబాద్)	41.9 డిగ్రీలు
కొండాపూర్(మంచిర్యాల)	41.8 డిగ్రీలు
రాయినిగూడెం(సూర్యాపేట)	41.7 డిగ్రీలు
మాడ్గులపల్లి(నల్లగొండ)	41.7 డిగ్రీలు
మోర్తాడ్(నిజామాబాద్)	41.5 డిగ్రీలు
దసూరాబాద్(నిర్మల్)	41.4 డిగ్రీలు

సీఏఏలో ముస్లిం మైనారిటీలు మినహాయింపు

(మొదటిపేజీ తరువాయి)

ఆశ్రయం కల్పిస్తోందని యూఎస్‌సీఐఆర్ఎఫ్ కమిషనర్ స్టీఫెన్ సెచ్నక్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. హిందువులు, పార్సీలు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, క్రిస్టియన్లకు సీఏఏ ఆశ్రయం కల్పించినపుడు, ఈ చట్టం ప్రత్యేకంగా ముస్లింలకు మాత్రమే ఎందుకు మినహాయింపునిచ్చిందని ప్రశ్నించారు. ఈ చట్టం వాస్తవంగా పొరుగుదేశాల్లో హింసకు గురైన మైనారిటీలకు రక్షణ కల్పించేందుకు రూపొందించినట్టైతే.. బర్మా నుండి వచ్చిన రోహింగ్యా ముస్లింలకు, పాకిస్తాన్ నుంచి వచ్చిన అహ్మదీయ ముస్లింలు, ఆఫ్ఘనిస్థాన్ నుంచి వచ్చిన హజారా షాహిలు సహా ఇతరులకు కూడా చట్టంలో స్థానం కల్పించాలని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై టామ్ లాంటోస్ హ్యూమన్ రైట్స్ కమిషన్ గతవారం చేపట్టిన విచారణలో సెచ్నక్ వివరణనిచ్చారు. భారత్‌లోని మత స్వేచ్ఛ అంశాలను బహిరంగంగా చర్చించాలని యూఎస్ కాంగ్రెస్ సభ్యులను యూఎస్‌సీఐఆర్ఎఫ్ కోరింది.

ప్రభుత్వ ప్రతినిధులతో, ముఖ్యంగా కాంగ్రెస్ సభ్యులతో చర్చలలో మత స్వేచ్ఛ అంశాన్ని కూడా చేర్చాలని పిలుపునిచ్చింది. స్టేట్ డిపార్ట్‌మెంట్ ఇటీవల స్పష్టం చేసినట్టు .. మత స్వేచ్ఛను గౌరవించడం, అన్ని వర్గాలకు చట్ట ప్రకారం సమానంగా రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలు అమలయ్యేలా చూడాలని యూఎస్‌సీఐఆర్ఎఫ్ కమిషనర్ డేవిడ్ కర్రీ పేర్కొన్నారు. మైనారిటీ వర్గాలకు మద్దతుగా నిలిచిన మానవహక్కుల కార్యకర్తలను నిర్బంధం నుంచి విడుదల చేసేందుకు భారత అధికారులతో కలిసి పనిచేయాలని యూఎస్‌సీఐఆర్ఎఫ్ అమెరికా ప్రభుత్వాన్ని కోరినట్టు ఆయన తెలిపారు.

దేశం ప్రశాంతంగా ఉండాలంటే.. మోడీ తిరిగి అధికారంలోకి రావొద్దు

తూత్తుకూడి : దేశం ప్రశాంతంగా ఉండాలంటే మోడీ తిరిగి అధికారంలోకి రావద్దని , మళ్లీ మోడీ ప్రధాని అయితే దేశమంతా అల్లర్లతో అల్లకల్లోలంగా మారుతుందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఓటర్లను హెచ్చరించారు. మోడీని మళ్లీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమనేది తమిళనాడు ప్రజల చేతుల్లో ఉందన్నారు. బీజేపీ మళ్లీ గెలిస్తే సమాజంలో విష బీజాలు నాటుతుందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేసిన ఆయన.. పార్టీ అభ్యర్థుల కోసం పలు నియోజకవర్గాల్లో పర్యటిస్తూ ప్రజలను ఓట్లడుగు తున్నారు. తమ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నారు. మంగళవారం ఉదయం తూత్తుకుడి జిల్లాలో స్టాలిన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన సోదరి, ఎంపీ కనిమొళితో కలిసి తూత్తుకుడిలోని కూరగాయల మార్కెట్‌లో, మత్స్యకారుల కాలనీలో ఆయన ప్రచారం చేశారు. స్థానికులు సీఎంతో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు.

అదానీ చేతికి మరో నౌకాశ్రయం

(మొదటిపేజీ తరువాయి)

పోర్టును రూ.3,350 కోట్లకు అదానీకి విక్రయించినట్టు ఎస్‌పీ గ్రూప్ మంగళవారం ప్రకటించింది. కాగా.. ఇందులోని ఎస్‌పీ గ్రూపునకు చెందిన 56 శాతం వాటాను, 39 శాతం స్టెవెడొరెస్ నుంచి అదానీ పోర్ట్స్ స్వాధీనం చేసుకుంది. ఒడిషాలో నిర్మాణ దశలో ఉన్న ఈ నౌకాశ్రయాన్ని ఎస్‌పీ గ్రూప్ 2017లో కొనుగోలు చేసింది.

గోపాల్‌పూర్ పోర్టు వార్షిక సామర్థ్యం 20 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉంది. గ్రీన్‌ఫీల్డ్ ఎల్ఎన్‌జీ రీగ్యాసిఫికేషన్ టెర్మినల్ ఏర్పాటుకు పెట్రోనెట్ ఎల్ఎన్‌జీతో ఇటీవలే ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పోర్టులోని 95 శాతం వాటాను స్వాధీనం చేసుకోవడం ద్వారా దీర్ఘకాలంలో భారీ రాబడి ఉంటుందని అదానీ పోర్ట్స్ అంచనా వేస్తోంది. రుణాలను తగ్గించుకొని కొత్త ప్రయాణాన్ని ప్రారంభించడానికి తమకు ఈ నిధులు సహకరించనున్నాయని ఎస్‌పీ గ్రూప్ ప్రతినిధి పేర్కొన్నారు. తద్వారా భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా తమ కీలక వ్యాపారాలపై దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. 2021లో నౌకాశ్రయాల రంగంలోకి ప్రవేశించిన అదానీ గ్రూపు అనతి కాలంలోనే దేశంలోని అత్యంత కీలకమైన ముంద్రాపోర్టు, కృష్ణపట్నం పోర్టు, కరైకల్ పోర్టు, హజీరా పోర్టు, ధామ్రా పోర్టు తదితర పోర్టులను స్వాధీనం చేసుకుంది. దేశంలోని మొత్తం నౌకాశ్రయ వ్యాపారంలో అదానీ 13 పోర్టులతో 24 శాతం వాటాను హస్తగతం చేసుకున్నారు.

భారత్‌లో పెరిగిన కుబేరులు..

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. లిస్టెడ్ కంపెనీల షేర్ ఆధారంగా, అన్‌లిస్టెడ్ కంపెనీలకు సంబంధించి ఇన్వెస్టర్ రౌండ్‌ల విలువ ఆధారంగా ఈ జాబితాను రూపొందించింది. భారత్‌లో గతేడాది 2023లో కొత్తగా 94 మంది కుబేరులు జత కావడంతో మొత్తం వీరి సంఖ్య 271కి చేరింది. వీరి సంపద ఒక్క లక్ష కోట్ల డాలర్లు (దాదాపు రూ.83 లక్షల కోట్లు)గా ఉంది.

ఆసియా ఖండంలోనే ముంబయి కుబేరులకు కేంద్రంగా మారింది. దేశ ఆర్థిక రాజధానిలో 92 మంది కుబేరులు ఉన్నారు. చైనాలోని బీజింగ్‌లో 91 మంది కుబేరులు నమోదయ్యారు. లండన్ తర్వాత కుబేరుల పట్టణంగా ముంబయి నిలిచింది. న్యూయార్క్‌లో 119 మంది కుబేరులుంటే, లండన్ నగర పరిధిలో 97 మంది ఉన్నారు. గతేడాది కాలంలో ముంబైలో కొత్తగా 26 మంది బిలియనీర్లు పుట్టుకొచ్చారు. ప్రపంచంలోనే టాప్-20 బిలియనీర్లలో ఇద్దరు భారతీయులు చోటు సంపాదించుకున్నారు. టాప్-10లో నిలిచిన రిలయన్స్ చైర్మన్ ముకేష్ అంబానీ వ్యక్తిగత సంపద 115 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.9.5 లక్షల కోట్లు) సంపదను కలిగి ఉన్నారు. గతేడాది అంబానీ సంపద 40 శాతం పెరిగింది. 15వ స్థానంలో ఉన్న అదానీ గ్రూప్ చైర్మెన్ గౌతం అదానీ వ్యక్తిగత సంపద 86 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.7.16 లక్షల కోట్లు)గా హురున్ అంచనా వేసింది. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే 33 బిలియన్ డాలర్లు పెరిగింది.

భారత్ నుంచి ఔషధ రంగంలో 39 మంది, ఆటోమొబైల్ నుంచి 27, కెమికల్స్ నుంచి 24 మంది చొప్పున బిలియనీర్లు ఉన్నారు. ప్రపంచ దేశాల్లో టెస్లా అధినేత ఎలన్ మస్క్ 231 బిలియన్ డాలర్ల సంపదతో మొదటి స్థానంలో నిలిచారు. అతని తర్వాత అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 185 బిలియన్ల నికర విలువ సంపదతో రెండో స్థానంలో ఉన్నారు.

ఐపీఎల్‌లో నేడు
హైదరాబాద్ X ముంబయి
వేదిక : హైదరాబాద్ , రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..



బోణీ కొట్టేదెవరు?

- తొలి విజయంపై ఇరు జట్ల గురి
- సన్‌రైజర్స్‌తో ముంబయి ఢీ నేడు
- ఐపీఎల్‌కు ఉప్పల్ స్టేడియం ముస్తాబు





నవతెలంగాణ-హైదరాబాద్

సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబయి ఇండియన్స్.. ఐపీఎల్ 2024లో కొత్త సారథులతో ప్రయోగం. సారథ్య పరీక్షలో తొలి మ్యాచ్‌లోనే హార్దిక్ పాండ్య అనూహ్య పరాజయం చవిచూడగా.. పాట్ కమిన్స్ గెలుపు ముంగిట నిరాశపరిచాడు. హార్దిక్ పాండ్యకు సారథ్య పగ్గాలతో ముంబయి ఇండియన్స్ అభిమానుల్లో అలజడి, పెద్ద ఎత్తున వ్యతిరేకత ఆ జట్టుకు మైదానంలో ప్రతికూలంగా మారుతుంది. మరోవైపు ఆరెంజ్ ఆర్మీ అభిమానులు పాట్ కమిన్స్‌ను సొంతం చేసుకోవటం సన్‌రైజర్స్‌కు అతిపెద్ద ఊరట. డెవిడ్ వార్నర్ వివాదాస్పద నిష్క్రమణ తర్వాత సన్‌రైజర్స్ యాజమాన్యంపై అభిమానుల వ్యతిరేతక ఇప్పుడిప్పుడే తగ్గుతోంది!. తాజా సీజన్‌లో తొలి విజయం కోసం హైదరాబాద్, ముంబయి నేడు ఢీకొట్టనున్నాయి.

స్వదేశీ కలిసొస్తేనే..

సన్‌రైజర్స్ హైదరాబాద్ సీజన్‌లో మెరుగైన ఫలితాలు సాధించేలా కనిపిస్తుంది. జట్టు కూర్పు సైతం ఆశాజనంగా ఉంది. కానీ స్వదేశీ ఆటగాళ్ల పేలవ ప్రదర్శన ప్రతికూలంగా మారే ప్రమాదం పొంచి ఉంది. బ్యాటింగ్ లైనప్‌లో భారత క్రికెటర్లు మళ్లీ భారంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. మయాంక్ అగర్వాల్, అభిషేక్ శర్మ, అబ్దుల్ సమద్‌లు అంచనాలను అందుకోవటం లేదు. విదేశీ ఆటగాళ్లపై పూర్తి భారం వేయటంతో ఒత్తిడి పెరుగుతోంది. ఎడెన్ మార్‌క్రామ్ స్థానంలో ట్రావిశ్ హెడ్ తుది జట్టులోకి వస్తే బ్యాటింగ్ లైనప్ కాస్త బలోపేతం కావచ్చు. హెన్రిచ్ క్లాసెన్ గత మ్యాచ్‌లో అద్భుత ఇన్నింగ్స్‌తో అభిమానుల హృదయాల్లో చోటు సాధించాడు. సొంతగడ్డపై నేడు క్లాసెన్ నుంచి అభిమానుల మరో విధ్వంసక ఇన్నింగ్స్ ఆశిస్తున్నారు. మార్కో జాన్సెన్, పాట్ కమిన్స్‌లకు నటరాజన్, భువనేశ్వర్ చక్కగా సహకరిస్తున్నారు. భువనేశ్వర్ తొలి మ్యాచ్‌లో నిరాశపరిచినా.. స్వింగ్‌స్టర్ లయ అందుకునేందుకు పెద్ద సమయం పట్టకపోవచ్చు. షాబాజ్ అహ్మద్, మయాంక్ మార్కండేలు మరోసారి స్పిన్ బాధ్యతలు తీసుకోనున్నారు. గత సీజన్‌తో కలిపి వరుసగా ఐదో విజయం సాధించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ సీజన్ ఆరంభంలోనే గెలుపు బాట పట్టాలని భావిస్తోంది. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ తుది జట్టు ఎంపికలో విదేశీ ఆటగాళ్ల సందిగ్ధత ఈ మ్యాచ్‌లోనూ కొనసాగుతుంది. కెప్టెన్ పాట్ కమిన్స్ సహజంగానే తుది జట్టులో నిలుస్తాడు. గత మ్యాచ్‌లో ఇద్దరు బ్యాటర్లు, ఇద్దరు బౌలర్లను ఎంచుకున్నారు. సన్‌రైజర్స్‌కు ప్రధానంగా బ్యాటింగ్ విభాగంలో సమస్యలు ఉన్నాయి. దీంతో ముగ్గురు విదేశీ బ్యాటర్లను ఎంచుకునే అవకాశం సైతం లేకపోలేదు.

హార్దిక్‌కు సవాల్

హార్దిక్ పాండ్యకు సరికొత్త సవాల్. రోహిత్ శర్మ స్థానంలో ముంబయి ఇండియన్స్ కెప్టెన్‌గా హార్దిక్‌ను అభిమానులు అంగీకరించటం లేదు. గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఫీల్డింగ్ పొజిషన్లను హార్దిక్ తరచుగా మార్చటం అభిమానులకు ఆగ్రహం తెప్పించింది. దీనిపై సోషల్ మీడియాలోనూ అభిమానులు విమర్శలు గుప్పించారు. ఓ వైపు అభిమానుల మన్నన పొందటంతో పాటు మరోవైపు జట్టును గెలుపు పథాన నడిపించటం హార్దిక్ పాండ్యకు కత్తి మీద సాముగా మారింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ముంబయి ఇండియన్స్‌కు మంచి రికార్డుంది. గత ఐదు మ్యాచుల్లో ముంబయి నాలుగింట గెలుపొందింది. గత సీజన్‌లో రెండు మ్యాచుల్లో ముంబయి ఇండియన్స్‌దే పైచేయి. లోకల్ బాయ్ తిలక్ వర్మపై నేటి మ్యాచ్‌లో ఫోకస్ ఉండనుంది. ముంబయి ఇండియన్స్ శిబిరంలో కీలక ఆటగాడిగా ఎదిగిన తిలక్ వర్మ మిడిల్ ఆర్డర్‌లో సూర్యకుమార్ యాదవ్ స్థానం భర్తీ చేయటంపై దృష్టి సారిస్తున్నాడు. ఇషాన్ కిషన్, రోహిత్ శర్మలు స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే ముంబయి ఇండియన్స్ గట్టి పోటీ ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. పేసర్ జశ్‌ప్రీత్ బుమ్రాను ఎదుర్కొవటం సన్‌రైజర్స్ బ్యాటర్లకు సవాల్‌గా మారనుంది.



టికెట్లు హాట్‌కేక్‌లు

సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబయి ఇండియన్స్ మ్యాచ్‌కు టికెట్లు పూర్తిగా అమ్ముడుపోయాయి. కనీస టికెట్ ధర రూ.1500గా నిర్ణయించినా అభిమానులు ఆన్‌లైన్‌లో టికెట్ల కోసం పోటీపడ్డారు. నేటి మ్యాచ్‌కు స్టేడియం పూర్తి సామర్థ్యం మేరకు టికెట్లు అమ్ముడుపోయినట్లు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ వర్గాలు తెలిపాయి. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంత మైదానం ఉప్పల్ స్టేడియం.. ఆరెంజ్ ఫ్లాగ్‌లతో ముస్తాబైంది. టీమ్ ఈగల్స్‌కు మద్దతుగా ఈ సీజన్‌లో ఫ్యాన్స్ స్టాండ్స్‌లో ఆరెంజ్ ఆర్మీ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు తెలుస్తోంది.

గుజరాత్ చిత్తు

టైటాన్స్‌పై సూపర్‌కింగ్స్ గెలుపు
చెన్నై 206/6, గుజరాత్ 143/8

నవతెలంగాణ-చెన్నై

ఐపీఎల్ 2023 ఫైనల్ రీ మ్యాచ్‌లోనూ చెన్నై సూపర్‌కింగ్స్‌దే విజయం. చెపాక్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై చెన్నై సూపర్‌కింగ్స్ ఏకపక్ష విజయం నమోదు చేసింది. 207 పరుగుల భారీ ఛేదనలో గుజరాత్ టైటాన్స్ చేతులెత్తేసింది. సాయి సుదర్శన్ (37), వృద్దిమాన్ సాహా (21), డెవిడ్ మిల్లర్ (21) మినహా టైటాన్స్ బ్యాటర్లలో ఎవరూ రాణించలేదు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (8) నిరాశపరిచాడు. 20 ఓవర్లలో 8 వికెట్లకు గుజరాత్ టైటాన్స్ 143 పరుగులే చేసింది. చెన్నై సూపర్‌కింగ్స్ 63 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై



సూపర్ కింగ్స్ ఓపెనర్లు రచిన్ రవీంద్ర (46, 20 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సులు), రుతురాజ్ గైక్వాడ్ (46, 36 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), శివం దూబె (51, 23 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సులు) మెరుపు ఇన్నింగ్స్‌లతో 20 ఓవర్లలో 6 వికెట్లకు 206 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఎం.ఎస్ ధోని సీజన్‌లో వరుసగా రెండో మ్యాచ్‌లో బ్యాటింగ్‌కు రాలేదు.

ఆ ముగ్గురు మెరువగా.. : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన సూపర్‌కింగ్స్‌కు రచిన్ రవీంద్ర (46) ధనాధన్ ఆరంభం అందించాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో కలిసి తొలి వికెట్‌కు 62 పరుగులు జోడించాడు. రుతురాజ్ నెమ్మదిగా ఆడినా.. రచిన్ దంచికొట్టాడు. మూడు సిక్సర్లు, ఆరు ఫోర్లతో టైటాన్స్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. రచిన్ నిష్క్రమణ తర్వాత జోరందుకున్న రుతురాజ్.. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో మెరిశాడు. ఓపెనర్లు ఇద్దరూ అర్ధ సెంచరీ ముంగిట వికెట్ కోల్పోయారు. అజింక్య రహానె (12) నిరాశపరచగా.. శివం దూబె (51) చిచ్చరపిడుగులా చెలరేగాడు. ఎదుర్కొన్న తొలి రెండు బంతులనే సిక్సర్లుగా మలిచిన దూబె సూపర్‌కింగ్స్‌ను భారీ స్కోరు దిశగా నడిపించాడు. డార్లీ మిచెల్ (24) సమయోచిత ఇన్నింగ్స్ ఆడగా.. సమీర్ రిజ్వీ (14, 6 బంతుల్లో 2 సిక్సులు) ఆకట్టుకున్నాడు. రషీద్ ఖాన్ ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన రిజ్వీ.. ఐపీఎల్‌లో తొలి ఇన్నింగ్స్‌లోనే దూకుడుకు టీజర్ చూపించాడు. యువ బ్యాటర్లు సమిష్టిగా మెరవటంతో చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 206 పరుగుల భారీ స్కోరు చేసింది. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో రషీద్ ఖాన్ రెండు వికెట్లు పడగొట్టగా..సాయి కిశోర్, స్పెన్సర్ జాన్సన్, మోహిత్ శర్మలు తలో వికెట్ తీసుకున్నారు.

ఇక ఐదు టెస్టుల సమరం

బోర్డర్-గవాస్కర్ సిరీస్ షెడ్యూల్ విడుదల

మెల్‌బోర్న్: ప్రతిష్టాత్మక భారత్, ఆస్ట్రేలియా టెస్టు సిరీస్ ఇక నుంచి ఐదు మ్యాచుల పోరాటంగా ఉండనుంది. ఇప్పటివరకు యాషెస్, పటౌడీ ట్రోఫీ (భారత్,ఇంగ్లాండ్) టెస్టు సిరీస్‌ల్లోనే ఐదు మ్యాచులు జరుగుతున్నాయి. ఇక నుంచి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఐదు టెస్టులు ఉండనున్నాయి. ఈ మేరకు భారత్, ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డులు సంయుక్త నిర్ణయం తీసుకున్నాయి. ఇందులో భాగంగా ఈ ఏడాది నవంబర్‌లో భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. నవంబర్-జనవరి వరకు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం పోటీపడుతుంది. ఈమేరకు ఆస్ట్రేలియా అంతర్జాతీయ షెడ్యూల్‌ను మంగళవారం ప్రకటించింది.


భారత్, ఆస్ట్రేలియా టెస్టు సిరీస్ సంప్రదాయ తొలి టెస్టు వేదిక బ్రిస్బేన్ స్థానంలో పెర్త్ వచ్చింది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో తొలి టెస్టుకు గబ్బా ఆతిథ్యం ఇవ్వటం ఆనాయితీ. కానీ ఈ సారి అందుకు భిన్నంగా పెర్త్ స్టేడియం వేదిక కానుంది. రెండో టెస్టు, డే నైట్ పింక్ బాల్ టెస్టు ఆడిలైడ్‌లోనే షెడ్యూల్ చేశారు. బాక్సింగ్ డే టెస్టుకు మెల్‌బోర్న్, న్యూ ఇయర్



టెస్టుకు సిడ్నీ వేదిక కానున్నాయి. నవంబర్ 22-26న పెర్త్‌లో తొలి టెస్టు, డిసెంబర్ 6-10న ఆడిలైడ్‌లో డే నైట్ టెస్టు, డిసెంబర్ 26-30న మెల్‌బోర్న్‌లో బాక్సింగ్ డే టెస్టు, జనవరి 3-7న సిడ్నీలో న్యూ ఇయర్ టెస్టు జరుగుతాయి. ఆస్ట్రేలియా పర్యటనలో గత రెండు సార్లు భారత జట్టు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని సొంతం చేసుకుంది. ఇప్పుడు 2024లోనూ బోర్డర్ గవాస్కర్ సిరీస్‌ను దక్కించుకుంటే కంగారూ గడ్డపై అరుదైన హ్యాట్రిక్ టెస్టు సిరీస్ విజయం సాధించిన జట్టుగా టీమ్ ఇండియా నిలువనుంది.

నవచిత్రం

ఆ నమ్మకమే నడిపించింది



పృథ్వీరాజ్ సుకుమారన్

హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన 'ది గోట్ లైఫ్' (ఆడు జీవితం) సినిమా ఈ నెల 28న పాన్ ఇండియా స్థాయిలో మలయాళంతో పాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమాను బెన్యామిన్ రాసిన గోట్ డేస్ నవల ఆధారంగా అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ బ్లెస్సీ రూపొందించారు. విజువల్ రొమాన్స్ బ్యానర్ ఈ సినిమాను నిర్మించింది. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఈ సినిమాను తెలుగు స్టేట్స్ లో రిలీజ్ చేస్తోంది. ఈ సినిమాతో 16 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం చేసిన హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ మూవీ రిలీజ్ సందర్భంగా మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

వాస్తవ కథతో ఈ సినిమాను తెరకెక్కించారు దర్శకుడు బ్లెస్సీ. 90వ దశకంలో జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన నజీబ్ అనే వ్యక్తి జీవిత కథ ఈ సినిమాకు ఆధారం. నజీబ్ ఎడారిలో సాగించిన ప్రయాణంలో ఎదుర్కొన్న కష్టాలను వివరిస్తూ గోట్ డేస్ అనే పుస్తకాన్ని బెన్యామిన్ రాశారు. కేరళలో అనూహ్య పాఠక ఆదరణ పొందిన ఈ పుస్తకం రైట్స్ కోసం మలయాళ సినీ పరిశ్రమలో ప్రతి స్టార్ హీరో, దర్శక, నిర్మాతలు పోటీ పడ్డారు. ఆ హక్కులను మా డైరెక్టర్ బ్లెస్సీ దక్కించు కున్నారు. అప్పుడు ఈ ప్రాజెక్ట్‌తో 2008లో బ్లెస్సీ నన్ను సంప్రదించారు. అలా ఈ సినిమాతో నా జర్నీ మొదలైంది. ఈ సినిమా కోసం 31 కిలోల బరువు తగ్గాను. నజీబ్ ఎడారిలో ఎలాంటి కష్టాలు ఎదుర్కొని ఉంటాడని ఊహించుకుంటూ ఈ క్యారెక్టర్‌లో నటించాను. ఓ మంచి సినిమా చేస్తున్నామనే నమ్మకమే మమ్మల్ని 16 ఏళ్లు సినిమాతో ముందుకు సాగేలా చేసి, ఈ సినిమా రిలీజ్ కలని సాకారం చేసింది.

యూనిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్




శర్వానంద్

హీరో శర్వానంద్ నటిస్తున్న 35వ చిత్రం 'మనమే. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్ ప్రారంభించడానికి మేకర్స్ సిద్ధంగా ఉన్నారు. ఇందులో భాగంగా హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'ఇక నా మాటే..' పాటను ఈనెల 28న విడుదల చేయనున్నారు. సాంగ్ పోస్టర్‌లో శర్వానంద్ షేడ్స్‌తో ట్రెండీ అవతార్‌లో ఆకట్టుకున్నారు. స్కేటర్ రైడింగ్ చేస్తూ కనిపించారు. యూనిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో కృతి శెట్టి కథానాయికగా నటిస్తుండగా, చైల్డ్ ఆర్టిస్ట్ విక్రమ్ ఆదిత్య కీలక పాత్రలో కనిపించనున్నారు.
ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: కృతి ప్రసాద్, ఫణి వర్మ, అసోసియేట్ ప్రొడ్యూసర్: ఏడిద రాజా.

జరగండి.. సందడి షురూ

రామ్ చరణ్ కథానాయకుడిగా, శంకర్ దర్శకత్వంలో 'గేమ్ ఛేంజర్' సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై జీ స్టూడియోస్ అసోసియేషన్‌లో నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.
'జెంటిల్ మేన్' నుంచి 2.0 వరకు ఒక్కో సినిమాను ఒక్కో విజువల్ వండర్‌లా తెరకెక్కించి సౌతిండియన్ సినిమాలకు ఓ ప్రత్యేకతను తీసుకొచ్చిన డైరెక్టర్ శంకర్. ఆయన డైరెక్షన్‌లో రామ్ చరణ్ సినిమా చేస్తారనగానే మెగాభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే భారీ అంచనాలు పెరిగాయి. దీంతో నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ ఈ సినిమాను అందరి అంచనాలను మించేలా రూపొందిస్తున్నారు. నేడు (బుధవారం) రామ్ చరణ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఎస్.ఎస్.తమన్ సంగీత సారథ్యం అందిస్తోన్న ఈ సినిమా నుంచి 'జరగండి..' అనే పాటను విడుదల చేస్తున్నారు. 150 థియేటర్స్‌లో ఈ పాటను ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు.
రామ్ చరణ్ సరసన కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ చిత్రంలో శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సునీల్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



రామ్‌చరణ్

తెలుగులోనూ మంజుమ్మల్ బాయ్స్



2006లో జరిగిన ఒక యదార్థ సంఘటన స్ఫూర్తితో కొచ్చికి చెందిన కొంతమంది స్నేహితుల కథను అద్భుతంగా చూపించిన మలయాళ సర్వైవల్ థ్రిల్లర్ 'మంజుమ్మల్ బాయ్స్'.
ప్రపంచ మార్కెట్‌లో రూ.200 కోట్లను సంపాదించిన మొదటి మలయాళ చిత్రంగా చరిత్ర సృష్టించిన ఈ చిత్రానికి చిదంబరం ఎస్ పొదువల్ దర్శకత్వం వహించారు. సౌబిన్ షాహిర్, గణపతి, ఖలీద్ రెహమాన్, శ్రీనాథ్ భాసి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం మలయాళ ప్రేక్షకులనే కాదు ఇతర భాషా ప్రేక్షకులను అలరించి, అద్భుతమైన ఆదరణను పొందింది. ఈ ఇండియన్ బాక్సాఫీస్ సెన్సేషన్‌ను పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తోంది. తెలుగు హక్కులను సొంతం చేసుకున్న మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడక్షన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఇప్పుడీ చిత్రాన్ని సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ 6న ఏపీ, తెలంగాణలో విడుదల చేయనున్నట్లు అనౌన్స్ చేసింది. 2006లో కొడైకెనాల్‌లోని గుణాకేవ్‌లో చిక్కుకున్న తమ స్నేహితుడిని రక్షించిన ఎర్నాకులం మంజుమ్మల్ యువకుల నిజమైన అనుభవం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రానికి బాబు షాహిర్, సౌబిన్ షాహిర్, షాన్ ఆంటోని, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మాతలు.

పిల్లల్ని ఎలా పెంచకూడదో చూపించాం

నాని మూవీ వర్క్స్, రామా క్రియేషన్స్ ఆధ్వర్యంలో విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో'. ఈ మూవీకి కథ, డైలాగ్స్, స్క్రీన్ ప్లే, దర్శకత్వం రమాకాంత్ రెడ్డి వహించారు. డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేష్‌లు నిర్మించిన ఈ చిత్రం ఈనెల 29న రాబోతోంది. ఈ క్రమంలో హీరో విశ్వ కార్తికేయ మంగళవారం మీడియాతో సంభాషించారు.



విశ్వ కార్తికేయ

- ప్రతీ మనిషిలో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. వాటిని చూపించేలా ఈ చిత్రం ఉంటుంది. నంద్యాలలో ఈ సినిమా కథ జరుగుతుంది. అందుకే ఈ సినిమాకు 'కలియుగం పట్టణంలో' అని పెట్టాం.
- నేను ఎలాంటి పాత్రనైనా చేయగలను అనే పేరు తెచ్చుకోవాలని ప్రయత్నిస్తుంటాను. ఇందులో ప్రతీ పాత్ర చక్కగా ఉంటుంది. అన్ని క్యారెక్టర్లకు రెండు షేడ్స్ ఉంటాయి. రెండు షేడ్స్ ఉంటాయా?, డబుల్ రోలా? అనేది చెప్పలేం. ఇది స్క్రీన్‌పైనే చూడాలి. నాకు మాత్రం ఈ కథ చాలా నచ్చింది. అందుకే ఎంతో ఇష్టంతో ఈ చిత్రాన్ని చేశాను.
- నేను ఇంతకు ముందు చేసిన 'కళాపోషకులు' పూర్తిగా వినోదాత్మ కంగా ఉంటుంది. 'అల్లంత దూరానా' మెలో డ్రామాగా ఉంటుంది. 'జై సేన' అనేది పూర్తి కమర్షియల్‌గా ఉంటుంది. అయితే ఈ చిత్రం మాత్రం చాలా కొత్తగా ఉంటుంది. థ్రిల్లర్, సస్పెన్స్ మాత్రమే కాకుండా మదర్ సెంటిమెంట్ కూడా ఉంటుంది. ప్రతీ రెండు మూడు సీన్లకు కొత్త జోనర్‌లా అనిపిస్తుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది. నా కెరీర్‌లో ఇది ఎంతో ప్రత్యేకంగా నిలుస్తుంది.
- ఇందులో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను చూపిస్తాం. పిల్లల్ని తల్లిదండ్రులు సరిగ్గా పెంచకపోతే ఎలా ఉంటుందో చూపిస్తాం. తల్లిదండ్రులు తమ తమ పిల్లల్ని ఎలా పెంచకూడదో చూపించాం. ఎలా పెంచితే పిల్లలు ఎలా తయారవుతారో చూపించాం. చెడుని చెడుతోనే ఈ చిత్రంలో చూపిస్తాం. మా సినిమాను అన్నపూర్ణ బ్యానర్ రిలీజ్ చేస్తుండటం ఎంతో ఆనందంగా ఉంది.
- ఈ సినిమా తర్వాత ఓ ఇండోనేషియా ప్రాజెక్ట్ చేస్తున్నాను. ఆ మూవీలోనూ ఆయుషి హీరోయిన్‌గా నటిస్తోంది. ఆ మూవీ వరల్డ్ వైడ్‌గా రిలీజ్ కానుంది.

భార్యను ప్రేమించడం ఎలా?

హీరో విజయ్ ఆంటోని నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'లవ్ గురు'. మృణాళిని రవి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాను విజయ్ ఆంటోనీ ఫిలిం కార్పొరేషన్ బ్యానర్ పై మీరా విజయ్ ఆంటోనీ సమర్పణలో విజయ్ ఆంటోనీ నిర్మించారు. వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వం వహించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ సినిమాను రంజాన్ పండుగ సందర్భంగా ఏప్రిల్ 11న విడుదల చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఈ చిత్ర ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.
తండ్రి పోరు పడలేక పెళ్లికి ఓకే చెప్తుంది ప్రియా అనే అమ్మాయి. ఆమెకు ఈ పెళ్లి ఇష్టం ఉండదు. పెళ్లి చూపుల టైమ్‌లో కాబోయే భర్తకు కొన్ని కండీషన్స్ పెడుతుంది. అమ్మాయిని ఇష్టపడిన ఆ అబ్బాయి ఆమె చెప్పిన కండీషన్స్ అన్నింటికీ తలూపుతాడు. భార్యను వన్ సైడ్‌గా లవ్ చేస్తాడు. షరతులన్నీ ఒప్పుకుంటాడు గానీ పెళ్లయ్యాక వాటిలో ఉన్న ఇబ్బందులు అర్థమవుతుంటాయి. పెళ్లయ్యాక ఎదురైన ఈ సమస్యల నుంచి హీరో ఎలా బయటపడ్డాడు?, భార్యను ప్రేమించడం ఎలాగో తెలుసుకున్నాడా లేదా అనే అంశాలతో ట్రైలర్ ఎంటర్‌టైనింగ్‌గా చూపించారు.



మృణాళిని రవి, విజయ్ ఆంటోని

నటనలో సెకండ్ ఇన్నింగ్స్‌కి రెడీ

'పెళ్లాం ఊరెళితే, ఇంద్ర' వంటి సూపర్ హిట్ చిత్రాల్లో కీలక పాత్రల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్న నటి ప్రశాంతి హారతి. నటిగా తన కెరీర్‌లో సుదీర్ఘ విరామం వచ్చింది. ఇప్పటికీ తనకు యాక్టింగ్ మీద ప్యాషన్ తగ్గలేదని, ఆ ప్యాషన్‌తోనే మళ్లీ టాలీవుడ్‌కు రావాలని అనుకుంటున్నానని మంగళవారం ఆమె మీడియాతో తెలిపారు.
'శ్రీనివాసరెడ్డి డైరెక్ట్ చేసిన 'ఫిబ్రవరి 14 నెక్లెస్ రోడ్' సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయ్యాను. ఆ తర్వాత మణిశర్మ 'రూపాయి' చిత్రంలో నటించాను. బాలాజీ టెలీ ఫిలింస్ వారి సీరియల్స్‌లో నటించే అవకాశాలు రావడంతో ముంబై వెళ్లాను. ఆ తర్వాత 'ఇంద్ర' సినిమా కోసం అడిగారు. ఆ చిత్రంలో నటించాను. పెళ్లయ్యాక మా వారితో యూఎస్ వెళ్లాను. అక్కడ ఓంకార అనే కూచిపూడి డ్యాన్స్ స్కూల్ ప్రారంభించాను. మా పాప తాన్య నా దగ్గరే కూచిపూడి డ్యాన్స్ నేర్చుకుంది. మా పాప తాన్యతో తెలుగింటి సంస్కృతి పేరుతో మ్యూజిక్ వీడియో రూపొందించాం. ఈ మ్యూజిక్ వీడియోకు దర్శకుడు వీఎస్ ఆదిత్య కాన్సెప్ట్ తయారుచేసి రూపొందించారు. దానికి మంచి స్పందన లభించింది. మా పాప తాన్యకు 16 ఏండ్లు. తన ఏజ్‌కు తగిన మంచి అవకాశం వస్తే సినిమా ఇండస్ట్రీకి పంపేందుకు మా ఫ్యామిలీకి అభ్యంతరం లేదు. అలాగే మంచి పాత్రలొస్తే సినిమాలైనా, వెబ్‌సిరీస్‌ల్లోనైనా నటించటానికి రెడీ' అని అన్నారు.




ప్రశాంతి హారతి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

గుండె సంరక్షణకు లీ హెల్త్ లైఫోస్టెరాల్



హైదరాబాద్ : న్యూట్రాసూటికల్స్ తయారీలోని లీ హెల్త్ డొమెయిన్ తాజాగా గుండె సంరక్షణ కోసం సహజసిద్ధ ఔషధ మూలికలతో లైఫోస్టెరాల్ సాఫ్ట్ జెల్ క్యాప్సూల్స్‌ను ఆవిష్కరించినట్లు ఆ సంస్థ తెలిపింది. హృదయ సంబంధ వ్యాధులలో విస్తృత పరిశోధన తర్వాత లైఫోస్టెరాల్‌ను అందుబాటులోకి తెచ్చామని లీ హెల్త్ డొమెయిన్ డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి తెలిపారు. "లైఫోస్టెరాల్ సాఫ్ట్ జెల్ క్యాప్సూల్స్ తయారీలో వాడిన బయో యాక్టివ్ సమ్మేళనాలు అత్యంత శక్తివంతమైనవి. ఇవి కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్‌ను సమతుల్యం చేయడానికి, క్రమ రహిత హృదయ స్పందనల స్థిరీకరణ కోసం ధమనులలో మదువైన ఫలకాన్ని తొలగించడానికి అవసరమైన నిర్మాణాన్ని కలిగి ఉంటాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి" అని లీలారాణి తెలిపారు. తమ ఈ ఉత్పత్తులు ఫార్మసీలు సహా అమెజాన్, లీ హెల్త్ డొమెయిన్ పోర్టల్‌లో లభిస్తాయన్నారు.

నెల్లూర్‌లో సోలార్ మాడ్యూల్స్ ఉత్పత్తి

- రామయపట్నంలో ప్లాంట్ ఏర్పాటు
- రూ.15వేల కోట్ల పెట్టుబడి
- ఎస్ఎస్ఇఎల్ సబ్సిడరీ ఇండోసోల్ సోలార్ వెల్లడి



బిజినెస్ : షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (ఎస్ఎస్ఇఎల్) అనుబంధ సంస్థ అయిన ఇండోసోల్ సోలార్ ప్రయివేటు లిమిటెడ్ రాష్ట్రంలోని నెలూరులోని రామాయపట్నంలో అత్యాధునిక సోలార్ మాడ్యూల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈ నెలాఖరు నుంచే ఇక్కడ ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ కంపెనీ సిఇఒ శరత్ చంద్ర మాట్లాడుతూ.. జనవరి 2024లో కేటాయించిన సుమారు 30 ఎకరాల భూమిలో ఉత్పత్తి లైన్‌ను ఏర్పాటు చేశామన్నారు. "మార్చి 31 నుంచి మేము 500 మెగావాట్ల సోలార్ పివి మాడ్యూల్ ఉత్పత్తిని ప్రారంభిస్తున్నాము. ఇది అత్యాధునిక పూర్తి ఆటోమెటిక్ మాడ్యూల్ లైన్. దేశంలోనే తొలి గ్లాస్-గ్లాస్, బ్యాక్ షీట్ కాంబినేషన్‌తో పెర్క్, టాప్‌కాన్, హెచ్‌జెటి మాడ్యూల్‌లను తయారు చేయగలదు" అని తెలిపారు.తొలి దశ తయారీని అందుబాటులోకి తేవడానికి రూ.15,000 కోట్ల పెట్టుబడి వ్యయం చేస్తున్నామన్నారు. మరో ఏడాదిన్నరలో రెండో దశ యూనిట్‌ను అందుబాటులోకి తేనున్నామన్నారు. మొత్తంగా రూ.25వేల కోట్ల పెట్టుబడి వ్యయాన్ని అంచనా వేశామన్నారు. పూర్తి స్థాయిలో నిర్వహణలోకి తీసుకురావడం ద్వారా 23వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించనుందన్నారు. తాము ఈ యూనిట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా తొలి దశలో కేంద్ర పిఎల్ఐ స్కీం కింద రూ.1870 కోట్లు, రెండో దశలో రూ.3,300 కోట్ల చొప్పున ప్రోత్సాహకాలు అందనున్నాయన్నారు. భవిష్యత్తు పునరుత్పాదన ఇంధన రంగానికి భారీ డిమాండ్ ఉండనుందన్నారు. కడపలోని తమ ఎస్-ఎస్ఇఎల్ ప్లాంట్‌లో రోజుకు 500కి పైగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను తయారు చేస్తున్నామన్నారు.

ఏడాదిలో డైమ్లర్ నుంచి 14 కొత్త మోడళ్లు

చెన్నయ్ : ప్రస్తుత ఏడాదిలో భారత వాణిజ్య వాహన మార్కెట్‌పై కీలక దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ (డిఐసివి) వెల్లడించింది. 2024లో నూతన శ్రేణీలో 14 కొత్త మోడళ్లను ఆవిష్కరించే యోచనలో ఉన్నామని డిఐసివి ఎండి, సిఇఒ సత్యకమ్ ఆర్య తెలిపారు. 2022తో పోల్చితే గతేడాది 107 శాతం వద్ధితో రెట్టింపు బస్సు విక్రయాలను చేశామన్నారు. ఈ ఏడాది 45వేల బస్సులను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2023లో దేశీయంగా అమ్మకాలలో 13 శాతం వృద్ధి నమోదు చేశామన్నారు. ఆదాయంలో 21 శాతం, విడిభాగాల వ్యాపారంలో 21 శాతం పెరుగుదలను సాధించామన్నారు.

విప్రో జిఇ హెల్త్‌కేర్ రూ.8వేల కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ : విప్రో జిఇ హెల్త్‌కేర్ వచ్చే ఐదేళ్లలో రూ.8,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. తయారీ, ఆర్అండ్‌డి కోసం వ్యయం చేయనున్నామని ఆ సంస్థ సిఇఒ, ప్రెసిడెంట్ పీటర్ జె అర్డుని తెలిపారు. భారత్‌లో విస్తృతావకాశాలు ఉన్నాయని.. తాము అధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. ఇక్కడ తయారు చేసిన మెడికల్ పరికరాలను 15 దేశాలకు ఎగుమతి చేయనున్నామన్నారు. భారత వైద్య పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతుందని విప్రో జిఇ హెల్త్‌కేర్ ఛైర్మన్ అజీమ్ ప్రేమ్‌జీ పేర్కొన్నారు.

లోకో క్యాబ్ పోటీలో ద.మ.రైల్వేకు ఫస్ట్ ప్రైజ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జాతీయ స్థాయి లోకో క్యాబ్ పోటీల్లో దక్షిణ మధ్య రైల్వేకు మొదటి బహుమతి లభించింది. పాటియాలా లోకోమోటివ్ వర్క్స్‌లో భారతీయ రైల్వేలోని 13 జోన్లకు చెందిన లోకోమోటివ్‌లు ఈ పోటీలో పాల్గొన్నాయి. దీనిలో దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ఎలక్ట్రిక్ లోకో షెడ్, లాలాగూడ, పశ్చిమ రైల్వేకు చెందిన డీజిల్ లోకో షెడ్, వటావా సంయుక్తంగా మొదటి బహుమతిని అందుకున్నాయి. రైల్వే బోర్డు రైలింజిన్‌ను నడిపే సిబ్బంది అలసటను తగ్గిస్తూ, ఎక్కువ గంటలు పని చేసేందుకు అనుగుణంగా ఎలక్ట్రిక్ లోకో క్యాబ్‌లను అభివృద్ధి చేయాలని జోనల్ రైల్వేలకు సూచించింది. క్యాబ్‌కు శబ్ద కాలుష్యం లేకుండా కవర్ చేయడం, ఏసీ కోసం థర్మల్ ఇన్సులేషన్లో మెరుగుదల, వాటర్‌లెస్ యూరినల్, అనుకూలమైన సీటు, సాఫీగాఉండే విధంగా ఫ్లోరింగ్, సులభంగా ఆల్రైట్ సిగ్నల్ ఎక్స్ఛేంజ్ చేయడానికి ఏర్పాటు, బ్యాగేజీని ఉంచడానికి సరి అయిన సదుపాయం, రాబోయే సిగ్నళ్లను సూచించే వ్యవస్థ, ఇంజిన్ నడిపే సిబ్బందికి అద్దం ద్వారా ముందు ఉన్న ట్రాక్ పరిస్థితిని మెరుగ్గా చూడడానికి వీలుగా అద్దాన్ని శుభ్రపరిచే వ్యవస్థ, మాస్టర్ కీ వినియోగించే విధానం, సీటులో ఉన్నప్పుడు అన్ని స్విచ్‌లను చేరుకోవడానికి అనుగుణంగా డ్రైవరు డెస్క్ రూపకల్పన, సన్ వైజర్ మెరుగుదల, క్రూ వాయిస్ అండ్ వీడియో రికార్డింగ్ సిస్టమ్, డ్రైవర్ అడ్వైజరీ వంటి సౌకర్యాలు ఈ క్యాబ్‌లో ఏర్పాటు చేయాలని సూచించింది. దీనికోసం లాలాగూడలోని ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లో పదేండ్లు పాతదైన డబ్ల్యూఏజీ 9 హెచ్‌సీ ఇంజిన్‌ను ఎంపిక చేసి, సరికొత్త మెటీరియల్‌తో పై సౌకర్యాలను సమర్థవంతంగా ఏర్పాటు చేశారు. ఇతర జోన్లు చేసిన సౌకర్యాలకంటే దక్షిణ మధ్య రైల్వే మరింత సమర్థవంతంగా పనిచేసినందున ఈ పోటీలో విజయం సాధించినట్టు ప్రకటించారని ఆ సంస్థ మంగళవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపింది.

ప్రణీత్‌రావు బ్యాచ్ వ్యాపారులను బెదిరించారు

- డీజీపీ, హోం సెక్రటరీకి నిరంజన్ లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఫోన్ల ట్యాపింగ్‌లో పట్టుబడిన ప్రణీత్‌రావుతోపాటు కొంత మంది పోలీసు అధికారులు వ్యాపారులను బెదిరించారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ ఆరోపించారు. ఈ విషయంలో డీజీపీ, హోం సెక్రటరీకి లేఖ రాయనున్నట్టు తెలిపారు. ముగ్గురు కీలక అధికారులు కీలకమైన, రెవెన్యూ, పోలీసు వ్యవస్థను భ్రష్టు పట్టించారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఇంటికి దగ్గర ఇల్లు అద్దెకు తీసుకుని ఆయన ఫోన్ ట్యాపింగ్ చేశారని గుర్తు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నక్సలైట్ల కదలికల కోసం వాడే డివైస్‌ను కాంగ్రెస్ నాయకులపై ఉపయోగించారని విమర్శించారు. అప్పటి డీజీపీ, హెూమ్ మంత్రి ఇతర అధికారులపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు

న్యాయస్థానాలు ఆంక్షలు విధించలేవు

- రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనరాదంటూ బెయిల్‌కు షరతులపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : ఎలాంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనరాదంటూ ఒక వ్యక్తికి బెయిల్ ఇవ్వడానికి ఒరిస్సా హైకోర్టు విధించిన షరతును సుప్రీం కోర్టు మంగళవారం కొట్టివేసింది. అలా షరతు విధించడం ఆ వ్యక్తి ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొంది.

బెర్హంపూర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ సిబా శంకర్ దాస్ జనవరి 18న హైకోర్టు జారీ చేసిన ఆదేశాలపై సుప్రీంకు వెళ్లారు. ఆ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ బి.ఆర్.గవాయి, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన బెంచ్ పై తీర్పు చెప్పింది. బెయిల్ షరతును ఉపసంహరించుకోవాలని కోరుతూ దాస్ పెట్టుకున్న పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. 2022 ఆగస్టులో బెయిల్‌పై దాస్‌ను విడుదల చేస్తూ హైకోర్టు ఈ షరతు విధించింది. బహిరంగంగా ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులను సృష్టించరాదని, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనరాదని హైకోర్టు షరతులు విధించింది. అయితే ఇలాంటి షరతులు విధించడం వల్ల వ్యక్తి ప్రాథమిక హక్కులు ఉల్లంఘించబడుతున్నాయని సుప్రీం వ్యాఖ్యానించింది. అందువల్లనే హైకోర్టు విధించిన షరతులను కొట్టివేస్తున్నట్లు తెలిపింది. తన క్లయింట్ రాజకీయ వ్యక్తి అని, రాబోయే సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఆయన రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనాల్సి వుంటుందని దాస్ తరపు న్యాయవాది పేర్కొన్నారు.

గాజాలో 81మంది మృతి

- ఆహార పొట్లాలు అందుకునే క్రమంలో 18మంది మృతి
- లక్ష్యాల సాధనలో ఓడిపోయిన ఇజ్రాయిల్ : హమాస్ నేత విమర్శలు
- రాఫాలోకి ప్రవేశించి తీరుతాం : భద్రతా మండలి తీర్మానాన్ని బేఖాతరు చేసిన నెతన్యాహు



గాజా : గత 24గంటల్లో గాజావ్యాప్తంగా 81మంది మరణించగా, 93మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. కాల్పుల విరమణ జరపాలంటూ హమాస్ చేస్తున్న డిమాండ్‌ను కేవలం భ్రాంతికరమైన డిమాండ్' అంటూ ఇజ్రాయిల్ కొట్టిపారేసింది. గాజాపై దాడులతోనే ముందుకు సాగుతామని, అందులో ఎలాంటి సందేహం లేదని తేల్చి చెప్పింది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానాన్ని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు బేఖాతరు చేశారు. భద్రతా మండలి తీర్మానాన్ని ప్రపంచవ్యాప్తంగా నేతలు స్వాగతించారు. ఈ తీర్మానాన్ని కచ్చితంగా అమలు చేసి తీరాల్సిందేనని యుఎన్ చీఫ్ గుటెరస్ అన్నారు. రాఫాపై కొనసాగుతున్న దాడుల్లో భాగంగా ఇజ్రాయిల్ మిలటరీ ఒక ఇంటిపై బాంబు దాడి చేయగా, 9మంది చిన్నారులతో సహా 18మంది మరణించారు. రాఫాలోకి ప్రవేశించి తీరుతామని ఇజ్రాయిల్ జాతీయ భద్రతా వ్యవహారాల మంత్రి ఇతమర్ బెన్ గివిర్ చెప్పారు. అమెరికా తోడ్పాటు లేకుండానే తమ సైన్యం రాఫాలోకి ప్రవేశించగలదన్నారు. అమెరికా సహా యావత్ దేశాల తోడ్పాటు, మద్దతు లేకుండానే తాము అనేక యుద్ధాలు చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.లగాజాపై యుద్ధానికి దిగేముందు ఇజ్రాయిల్ ఏ లక్ష్యాలనైతే సాధించాలని ఆశించిందో వాటిని నెరవేర్చడంలో విఫలమైందని హమాస్ నేత ఇస్మాయిల్ హనియె తీవ్రంగా విమర్శించారు. టెహరాన్‌లో పర్యటన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ యుద్ధం సందర్భంగా పాలస్తీనియన్లు అద్భుతమైన ప్రతిఘటనను కనబరుస్తున్నారని ప్రశంసించారు. ఫలితంగా ఇజ్రాయిల్ అనుకున్న లక్ష్యాల్లో ఏ ఒక్కదాన్ని కూడా సాధించలేకపోయిందని అన్నారు.

పైగా ప్రపంచ దేశాల మద్దతును కూడా ఇజ్రాయిల్ కోల్పోతోందన్నారు. ఇరాన్ విదేశాంగ మంత్రి హుస్సేన్ అమీర్ అబ్దుల్లాతో కలిసి ఆయన పత్రికా సమావేశంలో పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయిల్‌కు రాజకీయ మద్దతు కరువవుతోందని తాజాగా భద్రతా మండలి ఆమోదించిన తీర్మానంతోనే అర్థమవుతోందన్నారు. విమానాల నుండి జారవిడుస్తున్న ఆహార పొట్లాలను అందుకునే క్రమంలో విషాదం చోటు చేసుకుంది. తొక్కిసలాటల్లో ఆరుగురు మరణించగా, 12మంది నీట మునిగి మరణించారని గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం తెలిపింది. గాజా ఉత్తర తీర ప్రాంతంలో విమానాల నుండి జారవిడిచిన ఆహార పార్శిళ్ళను తీసుకునే క్రమంలో మధ్యధరా సముద్రంలోకి ఈత కొట్టుకుంటూ వెళ్లి మరణించారని, ఈ సంఘటనలు చూస్తే ఆహారం కోసం ప్రజలు ఎంతగా వాచిపోతున్నారో అర్థమవుతోందని మీడియా కార్యాలయం పేర్కొంది.

ఫోన్‌ట్యాపింగ్‌కు కేసీఆరే బాధ్యులు

- సమగ్ర న్యాయ విచారణ జరిపించాలి
- బీజేపీ నేతలు, ఆఫీసు సిబ్బంది ఫోన్లనూ ట్యాప్ చేశారు
- లిక్కర్ కేసుకు, బీజేపీకి సంబంధం లేదు
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్‌కు గత ముఖ్యమంత్రి కేసీఆరే ప్రధాన బాధ్యులని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన అధికారులంతా ఫోన్ ట్యాపింగ్‌లో ఉన్నారనీ, ఈ కేసుపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో కొందరు పోలీసు ఉన్నతాధికారులు మాఫియాగా ఏర్పడి రాజకీయ నేతలు, అధికారులు, వ్యాపారుల ఫోన్లను ట్యాపింగ్ చేసి వ్యక్తిగత వ్యవహారాలను చూపెట్టి బెదిరింపులకు దిగారని ఆరోపించారు. బీజేపీ నేతలు, ఆఫీసు సిబ్బంది ఫోన్లను ట్యాపింగ్ చేసి బీజేపీ అధికార అకౌంట్ నుంచి డబ్బులు డ్రా చేసుకుని వెళ్తుంటే ఉగ్రవాదులను చుట్టిముట్టినట్టు స్వాధీనం చేసుకున్నారనీ, వాస్తవం తెలిసి ఉన్నతాధికారులు డబ్బులను తిరిగి ఇచ్చారని గుర్తుచేశారు. ఉగ్రవాదులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారి ఫోన్లను మాత్రే ఉన్నతాధికారుల అనుమతితో ట్యాపింగ్ చేయాలని నిబంధన ఉందన్నారు. అయితే, గత ప్రభుత్వంలో పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగేలా ట్యాపింగ్ జరిగిందని విమర్శించారు. తన చెల్లెలు, ఎమ్మెల్సీ కవితను బీజేపీ రాజకీయ కుట్రలో భాగంగా అరెస్టు చేయించిందని ఆరోపించడాన్ని తప్పుబట్టారు. కవిత ఢిల్లీ లిక్కర్ వ్యాపారంలో జోక్యం చేసుకున్నది వాస్తవం కాదా? కొంత మంది బినామీల పేరుతో సంస్థను పెట్టింది నిజం కాదా? ఆప్ ప్రభుత్వంతో చర్చలు జరపలేదా? కోట్లాది రూపాయలు చేతులు మారింది వాస్తవం కాదా? దమ్ముంటే వీటిపై స్పందించి బహిరంగ చర్చకు రావాలని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. లిక్కర్ స్కామ్ ఆప్ ప్రభుత్వ అవినీతిలో భాగమని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు ఇంకా తాము అధికారంలో ఉన్నామనే భ్రమల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు.కేసీఆర్ కుటుంబానికి అబద్ధాలు ఆడటం తప్ప ఏమీ తెలియదని ఆరోపించారు. లిక్కర్ స్కామ్ వ్యవహారంలో కవిత అరెస్టు అయిందనీ, దానికి బీజేపీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబ అవినీతిని ప్రజల ముందు పెడ్తామన్నారు. చెంగిచర్ల వడశాల ప్రాంతంలో నివాసముంటున్న ట్రైబల్స్‌పై జరిగిన దాడులను ఖండించారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ, మానవ హక్కుల కమిషన్లకు ఫిర్యాదు చేశామని చెప్పారు. దాడులకు పాల్పడిన వారిపై కేసులు పెట్టే విషయంలోనూ పోలీసులు తాత్సారం వహించడాన్ని తప్పుబట్టారు. ఈ విలేకర్ల సమావేశంలో బీజేపీ రాష్ట్ర నేతలు శ్రీధర్‌రెడ్డి, ఎన్వీ సుభాష్, కాసం వెంకటేశ్వర్లు, మాధవి, గోలి మధుసూధన్‌రెడ్డి, మురళీధర్‌గౌడ్, మౌనిక, సునీత, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరనున్న చిన్నపురెడ్డి

- సైదిరెడ్డి టికెట్‌ను ఆయకిస్తారంటూ ప్రచారం
- శానంపూడి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న కొందరు నేతలు
- తేరా చేరినా అభ్యర్థిని మార్చేది లేదంటున్న రాష్ట్ర నాయకత్వం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ నల్లగొండ జిల్లా నాయకత్వంలో ముసలం మొదలైందా? సైదిరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఒద్దంటే ఒద్దని ఎందుకంటున్నారు? తేరా చిన్నపురెడ్డి చేరిక క్లారిటీతో అభ్యర్థిత్వాన్ని నిజంగానే మార్చబోతున్నారా? ఇప్పటికే నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థిత్వాన్ని దక్కించుకున్న మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి చెవిలో బీజేపీ కమలం పువ్వు పెట్టబోతున్నదా? జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే నిజమే అనిపిస్తున్నది.

నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఇంద్రసేనారెడ్డి తర్వాత అంత బలమైన నేత ఆ పార్టీకి లేకుండా పోయారు. దీంతో ఆ నియోజకవర్గంపై బీజేపీ ఈసారి ఫోకస్ పెట్టింది. అందులో భాగంగానే బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని పార్టీలో చేర్చుకుని నల్లగొండ అభ్యర్థిగా ప్రకటించింది. నాగర్‌కర్నూల్‌లో పెట్టిన బహిరంగ సభలోనూ ఆయన పాల్గొన్నారు. అయితే, సైదిరెడ్డి చేరికను మొదటి నుంచీ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సైదిరెడ్డి హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా ఉన్న సమయం(2021)లో గుర్రంపోడు తండాను సందర్శించేందుకు బండి బృందం వెళ్లగా..బీజేపీ నేతలు, శ్రేణులపై దాడిచేయించారనే ఆరోపణలున్నాయి. సైదిరెడ్డి ఒత్తిడి మేరకు బండితో పాటు కీలక నేతలపై పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ శ్రేణులపై దాడులు చేయించిన వ్యక్తికి సీటు ఎలా కేటాయిస్తారంటూ బండి తన అసహనాన్ని వ్యక్తపరిచారు. ఇదే సమయంలో నల్లగొండ జిల్లా నాయకత్వం కూడా ఆయనకు టికెట్ ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్నది. రాష్ట్ర నాయకత్వం దృష్టికి కూడా అభ్యర్థిత్వాన్ని మార్చాలనే డిమాండ్‌ను తీసుకెళ్లింది. ఇలా కొన్ని రోజులుగా గొడవ నడుస్తూనే ఉంది. సైదిరెడ్డి కంటే ముందే తేరా చిన్నపురెడ్డిని బీజేపీ సంప్రదించింది. జిల్లాలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో సరిగ్గా పొసగకపోవడం, కేసీఆర్ కూడా సరిగా పట్టించుకోకపోవడంతో కొంతకాలంగా ఆయన బీఆర్ఎస్‌పై గుర్రుగా ఉన్నారు. దీన్ని పసిగట్టి ఆయనకు బీజేపీ ఎరవేసింది. మొదట ఆయన అంతగా ఆసక్తి చూపలేదు. 15 రోజుల నుంచి చర్చలు జరుగుతూనే ఉన్నాయి. తన ఫార్మాపరిశ్రమ ముందుకు పోవాలంటే రాజకీయ అండ ఉండాలనే ఉద్దేశంతో బీజేపీలో చేరేందుకు తేరా మొగ్గుచూపారు. తనకు నల్లగొండ సీటు ఇస్తే వచ్చేందుకు సిద్ధమని బీజేపీకి సంకేతాలు పంపారు. దాన్ని పరిశీలిస్తామనీ, సాధ్యం కాకపోతే రాజ్యసభ సభ్యులుగానీ, ఇతర ఏదైనా ముఖ్యమైన పదవిగానీ ఇస్తామని బీజేపీ ఆఫర్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే ఆయన ఒకటెండ్రు రోజుల్లో బీజేపీలో చేరబోతున్నారని సమాచారం. తేరా చేరికపై క్లారిటీ రావడంతో ఆయన్ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించాలనే డిమాండ్‌ను ఆ జిల్లా నాయకత్వం తెరపైకి తెచ్చింది. తెలంగాణ ప్రకటన తర్వాత 2014లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ స్థానం నుంచి టీడీపీ తరవున ఆయన పోటీచేసి ద్వితీయస్థానంలో నిలిచారు. 2009లో నాగార్జున సాగర్ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డిని ఓడించినంత పనిచేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కోమటిరెడ్డి ఫ్యామిలీని ఢీకొట్టి మరీ గెలిచారు. ఆర్థిక వనరులు పుష్కలంగా ఉండటం, నాలుగైదు నియోజకవర్గాల్లో తనకంటూ సొంత క్యాడర్ ఉన్న తేరా లాంటి వ్యక్తికి సీటిస్తే బీజేపీ అవకాశాలు మరింత మెరుగవుతాయనే విషయాన్ని పార్టీ నాయకత్వం దృష్టికి జిల్లా నాయకులు తీసుకెళ్లారు. క్లీన్ ఇమేజ్ ఉన్న తేరా రాకను బీజేపీ జిల్లా, రాష్ట్ర నాయకత్వాలు స్వాగతిస్తున్నాయి. ఇదే ఇప్పుడు సైదిరెడ్డికి ఎఫెక్ట్‌గా మారబోతున్నట్టు తెలిసింది. ఎంపీ అభ్యర్థిత్వాన్ని మార్చబోతున్నారనే భయం ఆయన్ను వెన్నాడుతున్నది. అయితే, బీజేపీ రాష్ట్ర నాయకత్వం మాత్రం దీన్ని కొట్టిపడేసింది. తేరా చిన్నపురెడ్డి పార్టీలో చేరేది వాస్తవమేననీ, ఆయనకు టికెట్ గ్యారంటీ ఏమీ ఇవ్వలేదని రాష్ట్ర నేతలు చెబుతున్నారు. ఇప్పటి వరకూ బీజేపీ ప్రకటించిన జాబితాల్లో కొన్ని పేర్లను జాతీయ నాయకత్వం మార్చినట్టుగానే సైదిరెడ్డిని మార్చి తేరా చిన్నపురెడ్డికి ఇచ్చే అంశాలనూ కొట్టిపడేయలేమనే చర్చ నడుస్తున్నది.

రైళ్ళలో మానవ అక్రమ రవాణాపై కఠిన చర్యలు

- ద.మ.రైల్వే ఏడీజీ మహేశ్ భగవత్ హెచ్చరిక

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రైళ్లలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ మహేష్ భగవత్ అన్నారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, గవర్నమెంట్ రైల్వే పోలీస్ ఫైల్ ఫార్మేషన్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ల ఆధ్వర్యంలో మంగళవారం సికింద్రాబాద్‌లోని సంచాలన్‌భవన్ హవా మహల్‌లో ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిలో 105 మంది ఆర్పీఎఫ్, జీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ భగవత్ దక్షిణ మధ్య రైల్వే ఇన్స్‌పెక్టర్ జనరల్ అండ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ శ్రీమతి అరోమా సింగ్ ఠాకూర్‌తో కలిసి మానవ అక్రమ రవాణా యూనిట్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ప్రపంచంలోని అతిపెద్ద రైల్వే నెట్‌వర్కుల్లో భారతీయ రైల్వే ఒకటి అనీ, ప్రజలు వివిధ ప్రయోజనాల కోసం రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారని తెలిపారు. మెరుగైన జీవితాన్ని పొందాలనే ఆశతో పిల్లలు నగరాలకు చేరుకోవడానికి రైల్వే వ్యవస్థను వినియోగించుకుంటున్నారనీ, మానవ అక్రమ రవాణాదారులు తమ స్వప్రయోజనాల కోసం పిల్లలను శ్రమ, లైంగిక దోపిడీ వంటి వాటికోసం రైల్వే మార్గాలనే ఉపయోగిస్తున్నారని వివరించారు. దీనివల్ల పిల్లలు తప్పుడు వ్యక్తుల చేతుల్లో పడి, భవిష్యత్‌ను కోల్పోతారని తెలిపారు. దీన్ని నిరోధించడం రైల్వేపోలీసుల కనీస బాధ్యత అని అన్నారు.వివిధ విభాగాల సమన్వయంతో ఈ విభాగాలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. గత ఏడాది ఇలా అక్రమ రవాణాకు గురైన దాదాపు 300 మంది బాలురను రైల్వేపోలీసులు కాపాడి, వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చారని వివరించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ డీఐజీ కమ్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఎమ్‌డీ షాదాబ్ ఖాన్ టీ, సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ శ్రీమతి షేక్ సలీమా, సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ శ్రీమతి దేబాస్మిత సీ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

రైతుల చెంతకు కేసీఆర్

- త్వరలో ముషంపల్లితో పాటు ఆలేరులో పర్యటన: మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి వెల్లడి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 180 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శించారు. నీటి విధానాన్ని సమగ్రంగా వినియోగించుకోకపోవడమే ఇలాంటి దుర్భర పరిస్థితికి దారి తీసిందని ఆయన అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ నేత, మాజీ సీఎం కేసీఆర్ రైతుల చెంతకు వస్తున్నారనీ, ఉమ్మడి నల్లగొండ జిల్లా భువనగిరి, ఆలేరుల్లో పర్యటిస్తారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

ఏప్రిల్ మొదటి వారంలో ఉండే కేసీఆర్ క్షేత్రస్థాయి పర్యటన కోసం రూట్ మ్యాప్ రెడీ చేస్తున్నట్టు తెలిపారు. నల్లగొండ మండలం ముషంపల్లితో పాటు ఆలేరు నియోజకవర్గంలో పర్యటించాలని పార్టీ నిర్ణయించిందన్నారు. గడిచిన పదేండ్లలో ఎండిపోని పంట పొలాలు, ఇప్పుడే ఎందుకు ఎండిపోయాయనే విషయంపై కేసీఆర్ ఆరా తీశారని చెప్పారు. అత్యధికంగా బోర్లు వేసి నష్టపోయిన నల్లగొండ మండలం ముషంపల్లి గ్రామం నుంచే ఈ పరిశీలన మొదలు పెట్టే విధంగా కార్యక్రమాన్ని పార్టీ రూపొందించిందని చెప్పారు. రోడ్డు మార్గంలోనే కేసీఆర్ పర్యటించనున్నారు. ఎండిపోయిన పంట పొలాలను పరిశీలనకు పొలంబాటు కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రీకారం చుట్టింది.

డీసీఏకు సర్టిఫికెట్ ఆఫ్ అక్రిడిటేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డీసీఏ)కు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ ల్యాబోరేటరీస్ (ఎన్ఏబీఎల్) సర్టిఫికెట్ ఆఫ్ అక్రిడిటేష్‌ను ప్రదానం చేసింది. డీసీఏ ల్యాబోరేటరీలు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ కచ్చితమైన ఫలితాలనిస్తున్నందుకుగాను అక్రిడిటేషన్‌కు అది అర్హత సాధించింది.

79 నమూనాల్లో తక్కువ ప్రమాణాలు

గతేడాది డ్రగ్ కంట్రోల్ అథారిటీ వివిధ రకాల ఔషధాలకు సంబంధించి 4,553 నమూనాలను సేకరించి పరీక్షించింది. వీటిలో 79 నమూనాల్లో తగినంత ప్రమాణాలు లేవని (సబ్ స్టాండర్డ్ డ్రగ్స్) తేల్చింది. వాటి వివరాలను డీసీఏ వెబ్ సైట్‌లో ప్రకటించింది.

పాలమూరుకు కేంద్ర సహాయానికి ప్రతిపాదనకు సిద్ధం చేయాలి

- నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ప్రధానమంత్రి కిషి సించాయ్ యోజన (పీఎం కేఎస్వీ-ఏఐబీపీ) కింద సహాయం పొందడానికి వీలుగా తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా అధికారులను ఆదేశించారు. మంగళవారం జలసౌధలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలపై ఆయన సమీక్ష చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం ప్రాధాన్య జాబితాలో చేర్చినందున, ఈ ప్రాజెక్టుకు కేంద్ర సహాయం కోరాలని ప్రభుత్వం నిర్ణయించిందని గుర్తు చేశారు. ఈ పథకంలో పనులు చేపట్టి, తక్కువ వ్యవధిలో ఎక్కువ ఆయకట్టును సాగులోకి తేవడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులను ఆరా తీశారు. ఈ ప్రాజెక్టు పనుల పూర్తికి ప్రతిబంధకాలపై చర్చించారు. ఇక ఈ పథకం కింద 2 టీఎంసీలు తరలించే పనులు 55 శాతం మేర పూర్తయ్యాయనీ, అదే ఒక టీఎంసీ పనులు 35 శాతం మేర పనులు పూర్తయ్యాయని అధికారులు కార్యదర్శికి వివరించారు. నార్లాపూర్ నుంచి కరివెన దాకా పనులు చేపట్టడానికి నిధులు ఇస్తే.. సాధ్యమైనంత మేర ఆయకట్టును సాధించడానికి అవకాశం దొరుకుతుందని అధికారులు గుర్తు చేశారు. ఆ తర్వాత పథకానికి రెండో దశ పర్యావరణ అనుమతి ప్రక్రియ ఎక్కడిదాకా వచ్చిందని రాహుల్ బొజ్జా ఆరా తీయగా, పెనాల్టీ రూపంలో విధించిన మొత్తంతోపాటు పర్యావరణానికి జరిగిన నష్టం కింద అంచనా వేసిన నిధులను పథకం పనులు జరిగిన గ్రామాల్లో వెచ్చిస్తే- రెండో దశ పర్యావరణ అనుమతి దొరుకుతుందని అధికారులు గుర్తు చేశారు. ఇక మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల వథకంపై కూడా సమీక్ష చేశారు.

ఈ పథకం కింద భూసేకరణ, పనులకు రూ.155 కోట్లు విడుదల చేస్తే ఈ ఏడాది 85 వేల ఎకరాలను ఈ పథకం కింద సాగులోకి తేవడానికి అవకాశం ఉంటుందని అధికారులు చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో నీటిపారుదలశాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం సీఈలతో పాటు ఎస్ఈలు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఐఎంజీబీకి భూములపై పిల్స్

నవతెలంగాణ-హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో 855 ఎకరాలను ఎకరం ధర రూ.50 వేలు చొప్పున క్రీడల అభివృద్ధి పేరుతో ఐఎంజిబి అనే బోగస్ సంస్థకు ఇవ్వడంపై దాఖలైన రెండు పిల్స్‌ను విచారణ చేయాలని సీనియర్ లాయర్ గండ్ర మోహన్ రావు హైకోర్టును కోరారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వ చివరి రోజుల్లో భూముల కేటాయింపు, భూముల రిజిస్ట్రేషన్ల వ్యవహార చర్యలను ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రద్దు చేసింది. ఈ చర్యలను సవాల్ చేస్తూ ఐఎంజీబీ దాఖలు చేసిన పిటిషన్లను ఈ నెల 7న హైకోర్టు డిస్మిస్ చేసింది. ఈ తీర్పును ఐఎంజిబి సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఈ నేపథ్యంలో ఐఎంజీబీకి భూముల కేటాయింపు, ఎంఓయూ, సేల్‌డీడ్.. ఇలా అన్ని అంశాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలంటూ టి.శ్రీరంగారావు, మరొకరు 2012లో పిల్స్ దాఖలు చేశారు. వీటిని చీఫ్ జస్టిస్ అలోక్ అరథే, జస్టిస్ సుజోయ్‌పాల్ ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ జరిపింది. సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేసినప్పటికీ పిల్స్‌పై విచారణ చేయవచ్చునని గండ్ర వాదించారు. ఐఎంజీబీ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌కు సుప్రీంకోర్టు నెంబర్ కేటాయింపు కాలేదనీ, సుప్రీంకోర్టు రిజిస్ట్రీ దశలోనే ఉందని ఆ సంస్థ తరపున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదించారు. పిల్‌పై విచారణ చేయాల్సిన అవసరం లేదన్నారు. ఇరుపక్షాల వాదనల తర్వాత విచారణ వాయిదా పడింది